ఎ.ఎం.ఆర్ అపార్డ్
AMR-APARD

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 5 సంచిక: 10

నవంబర్, 2013

ఎడిటర్
**జి.డి. ప్రియదర్శిని** ఐ.ఏ.ఎస్.
డైరెక్టర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు
**డా॥ సి. నాగరాజు**
**హెచ్. కూర్మారావు**
**డా॥ కె. ఆసయ్య**
**ఎ. నాగేశ్వరరావు**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
**సెంటర్ ఫర్ మీడియా & పబ్లికేషన్స్, అపార్డ్**
**& కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. - అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : editorsthanikapalana@gmail.com
Website: www.apard.gov.in

ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి గాని అపార్డ్‌కి గాని చెందినవిగా భావించనక్కరలేదు.

# విషయ సూచిక

సంపాదకీయం ..... 2
పంచాయతీ సర్పంచుల, సభ్యుల శిక్షణను నొసగే శిక్షకులకు అపార్డులో ట్రైనింగ్ ..... 3
గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిగా శ్రీ రేమండ్ పీటర్ ఐ.ఎ.ఎస్. ..... 4
సమస్యలన్నింటికీ తగు పరిష్కారం ..... 5
ఎ.ఎం.ఆర్. - అపార్డ్ డైరెక్టర్‌గా జి.డి. ప్రియదర్శిని, ఐఏఎస్ పదవీ బాధ్యతల స్వీకరణ ..... 6
అందరికి పోషకాహారం అందేలా చూడాలి ..... 6
బాల కార్మికుల (నిషేధం, నియంత్రణ) చట్టం - 1986 ..... 7
సామాజిక ఆర్థిక, కుల గణన ముసాయిదా జాబితా ప్రచురణపై సందేశం ..... 10
స్థానిక సంస్థలు - వనరులు, నిధులు సమకూర్చుకోవడం ఎలా ? ..... 11
మానవ ధర్మం - విలువలు బోధనలో చేర్చాలి ..... 14
ఉమాపురం గ్రామ పంచాయతీ మరోసారి ఏకగ్రీవం ..... 15
భారత్ నిర్మాణ్ వాలంటీర్ల ఆధ్వర్యంలో మద్యపాన నిషేధం కొరకు ర్యాలీ ..... 16
గ్రామ సభ గురించి కొన్ని ముఖ్య విషయాలు ..... 17
గ్రామీణవ్యవస్థలో నూతన శకం ..... 18
పలుకే బంగారం ..... 20
భారతీయ దార్శనికుడు స్వామి వివేకానంద ..... 21
పందిరి తీగ కూరగాయలు పెంచటం రైతులకు లాభదాయకం ..... 23
గ్రామ పంచాయతీ ఆదాయ వనరులను పెంపుకు ప్రయత్నించాలి ..... 25
ప్రపంచ బ్యాంకు అధికారులు అపార్డు సందర్శన ..... 26
ఆధునిక సాంకేతిక భారతీయ నాగరికత పోకడలు, కుటుంబ వ్యవస్థపై వాటి ప్రభావం ..... 27
గ్రామీణ చైతన్యానికి వారధులు బిఎన్‌విలు ..... 29
ప్రాజెక్టు అనంతపై సమీక్ష ..... 30
సైకిలు ప్రయాణానికి పునరాహ్వానం ..... 31
భారత్ నిర్మాణ్ వాలంటీర్ల అపూర్వ విజయాలు ..... 32
జవహర్‌లాల్ నెహ్రూ విలక్షణ వ్యక్తిత్వం ..... 34
విజయవంతమైన తాండా కథ ..... 35
వరి పంట అనంతరం మెరక పంటల సాగు పద్ధతులు ..... 36
భారతీయ గ్రామాలలో కాలుష్య నియంత్రణ ..... 39
ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణలు - శ్రీ ఎస్.ఆర్. శంకరన్, ఐ.ఎ.ఎస్.(రి) ..... 41
పంచాయితీ రాజ్ వ్యవస్థలో రూరల్ కమ్యూనికేషన్స్ వ్యూహం ..... 46
ఎల్లనృపులు గొలువ ఎరుగవే బాసాడి... ..... 48
సర్పంచ్‌ల అధికారాలు, బాధ్యతలు ..... 50
గాంధీటోపీ గవర్నర్ ఈడ్పుగంటి రాఘవేంద్రరావు ..... 53
రేబిస్ నివారణ - జాగ్రత్తలు ..... 55
మానవ విలువలను పాటిస్తూ గ్రామ ప్రజలను ఆదుకొనవలెనని పిలుపు ..... 57
గ్రామ సౌభాగ్యం కోసం బిఎన్‌విల కృషి ..... 58
సగటు మనిషి కల కావాలి 'మరుగు దొడ్డి' ..... 59
భూసార పరీక్షలు, పద్ధతులు, ఫలితాల విశ్లేషణ ..... 60
స్థానిక సంస్థలలో ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి! ..... 63

# సాంకేతికాభివృద్ధికి పండిట్ నెహ్రూ చూపిన మార్గం

ఏ దేశ భవిష్యత్తైనా బాలబాలికలను సరియైన రీతిలో తీర్చిదిద్దుట మీద ఆధారపడి ఉంటుంది. అందుకే చాచా నెహ్రూగా పేరు పొందిన మన మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వీరి భవిష్యత్తుకు తగిన బాట వేశారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కావలసిన వృత్తి విద్యా సంస్థలను, పాఠశాలలను పారిశ్రామిక సంస్థలను స్థాపించి రాబోయే తరాలకు మార్గ దర్శకుడయ్యారు. ఆయన చేసిన ఎన్నో పనులు బావి భారత పౌరులను దిద్దుటలో ముందున్నాయి. ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక రంగ అభివృద్ధికి పండిత్ నెహ్రూ చేసిన సేవలు ఎనలేనివి. అందులో కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ రీసెర్చ్‌ను స్థాపించి వివిధ రంగాలలో పరిశోధనలు జరుపుటకు బీజాలు నాటారు. జెనిటిక్ ఇంజనీరింగ్, వ్యవసాయ పరిశోధనకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్‌ను స్థాపించి ఆహారాభివృద్ధిలో పరిశోధనలు జరిపి అధిక దిగుబడులు పొంది ఆహార రంగంలో స్వయం పోషకంగా తీర్చి దిద్దేందుకు పునాది వేసారు జవహర్ లాల్ నెహ్రూ.

అదే రీతిలో భారత దేశం రక్షణ రంగాన్ని విస్తరింపచేసేందుకు ఆ రంగంలో పెక్కు పరిశోధనా సంస్థలను నెలకొల్పారు. నేడు భారత్‌కు అణు రంగంలో మూడో స్థానం పొందేందుకు నెహ్రూ బాట వేసారు. అణుఇంధన ఉత్పత్తిలో ముందున్నాం. ముంబాయిలో కల్పక్కం అణు రియాక్టర్, రాజస్తాన్ అణు ఇంధన పరీక్ష కేంద్రం మొదలైన అణు సంస్థలను నెలకొల్పి ప్రపంచ అణుశక్తి పటంలో స్థానాన్ని సంపాదించాం. అణు విద్యుత్ రంగంలో మనకున్న విద్యుత్ కొరతను తీర్చుకొనే పని చేయడం జరుగుతోంది. మరో దశాబ్దంలో పూర్తి స్థాయి అణు విద్యుత్ ఇంధనం తయారుచేసికొనే దేశంగా ముందుకు సాగగలం.

పండిత్ నెహ్రూ ఆలోచనలతో భారత్‌ను ఉన్నతమైన దేశంగా గుర్తింపు తెచ్చారు. అణు ఇంధన శక్తిని కేవలం శాంతియుత కార్యక్రమాలకీ ఉపయోగించడం జరుగుతుందని ప్రకటించారు. ఆ విధంగా 1974 మే 24 తేదీన భారతదేశం అణు శక్తిని శాంతియుతంగా ఉపయోగించే దిశలో నడుస్తున్నామని ప్రపంచ దేశాలకు తెలియపరచింది. దానితో మన దేశం శాంతి కాముక దేశంగా పేరు గడించింది. నేడు మనకు కావలసిన అణు ఇంధన వనరులను మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్‌లలో కనుగొనడం జరిగింది. మద్రాసులో మూడో అణు విద్యుత్ స్టేషన్ ఉపయోగంలోకి వస్తే మన విద్యుత్ కొరత తీరుతుంది.

భారత్ ఆహార రంగంలో స్వయం సమృద్ధిని సాధించుకొనేందుకు నెహ్రూ వేసిన బాటలో పయనించి నేడు ఫలితాలను సాధించుతోంది. అందుకే ఆయన భారత దేశ నిర్మాతగా ప్రసిద్ధిగాంచారు. ఆయన దూరదృష్టి వల్ల నేడు దేశాన్ని ప్రపంచ దేశాలలో ఉన్నతమైన స్థితిలో నిలబెట్టుకోవడం జరిగింది. బాల బాలికలకు శాస్త్ర రంగాలో అభిరుచిని కలిగించేందుకు పలు విధాలైన చర్యలను గైకొనడం జరిగింది. ఐ.ఐ.టీ.లను విశ్వవిద్యాలయల గ్రాంట్స్ సంఘంను స్థాపించి ఉన్నత విద్యకు, సాక్షర భారతిని స్థాపించుకుని క్రింది స్థాయిలో అక్షరాసత్యను పెంచుటకు, 1986లో విద్యా విధానంను రూపొందిచుకొని విద్యార్థులను ప్రగతి పథంలో నడుపుటకు ప్రపంచంలోనే అతి పెద్ద దేశంగా మానవ వనరులందు స్కిల్డ్ మేన్ పవర్‌ను అందించుటకు నెహ్రు యొక్క దూర దృష్టితో అవలంబించిన విద్యా విధానం కారణమని చెప్పవచ్చును.

జవహర్‌లాల్ నెహ్రూ భారత దేశ విదేశ విధానంలో అలీన విధానంను అలంబించి ప్రచ్ఛన్నయుద్ధానికి, కూటమి రాజకీయాలకు దూరముగా ఉండి అటు అమెరికా ఇటు సోవియట్ రష్యాల మధ్య సమాన దూరంతో మెలుగుతూ తృతీయ ప్రపంచ దేశాలలో భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టారు. భారత దేశ ప్రతిష్ట పెరిగేవిధంగా చుట్టు పక్కల దేశాలతో సంబంధాలను పటిష్ట పరుచుకొని దక్షిణాసియా దేశాలలో భారత్ ప్రముఖ స్థానం కలిగి ఉంది. సార్క్ దేశాల అభివృద్ధికి ఎక్చేంజ్ కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

( జి.డి. ప్రియదర్శిని )

# పంచాయతీ సర్పంచుల, సభ్యుల శిక్షణను నొసగే శిక్షకులకు అపార్డులో ట్రైనింగ్



ఏ.ఎం.ఆర్- అపార్డు నూతనంగా ఎన్నుకొనబడిన పంచాయతీ సర్పంచులకు, వార్డు మెంబర్లకు రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణనిస్తుంది. ఇంతవరకు 9 జిల్లాలోని సర్పంచులకు శిక్షణ ముగిసింది. ఇప్పుడు మిగతా గ్రామ సర్పంచులకు, మెంబర్లకు శిక్షణనిచ్చే జిల్లా కౌన్సిళ్ళ సభ్యులకు, MOTs, TOTs కు అపార్డులో ఒక రోజు శిక్షణను పంచాయతీ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ వి. నాగిరెడ్డి, ఐఏఎస్ ప్రారంభించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ మారిన పరిస్థితులకు అనుగుణంగా సర్పంచుల బాధ్యతలను, అధికారాలను గూర్చి వారికి క్షుణ్ణంగా తెలియజేయాలన్నారు. ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల అమలులో సర్పంచుల పాత్ర ప్రధానమైనది కనుక ఆ కార్యక్రమాలను గూర్చి అమలు, ఆర్థిక అంశాలను గూర్చి సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ ఇవ్వడం ద్వారా వాటిని సమర్థవంతంగా అమలు చేసేందుకు సమర్థకులుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద ఉందని అందుకు అనుగుణంగా అపార్డు శిక్షణా షెడ్యూల్స్, మాడ్యూల్సును తయారు చేసిందని వాటిని జిల్లా శిక్షణా కౌన్సిళ్ళు వాటిపై శ్రద్ధ తీసుకొని వారికి శిక్షణ నిచ్చి సమర్థతను, పారదర్శకతను పెంచాలని అన్నారు.

కమీషనర్ పంచాయతీరాజ్ శ్రీ డి. ప్రసాద్ ఐఏఎస్ మాట్లాడుతూ. ఈ శిక్షణ రెసిడెన్షియల్‌గా మంచి ప్రదేశంలో ఏర్పాటు చేసి అందరికి పద్ధతి ప్రకారం శిక్షణ ఇచ్చి ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలను గూర్చి వివరించాలని సూచించారు. శిక్షణ సమర్ధవంతంగా తీర్చిదిద్దవలెనని అందుకు తగిన బడ్జెట్‌ను పంచాయితీ శాఖ భరించుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంకు సిడిపిఏ సెంటర్ హెడ్ డాక్టర్ ఆర్. సూర్యనారాయణ రెడ్డి అధ్యక్షతన వహించి MOTs మరియు ఏ విధంగా జిల్లా పరిషత్, మండల పరిషత్‌లు సమన్వయంతో పంచాయతీ సర్పంచులు పనిచేయు విధంగా తీర్చిదిద్దవలెనని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిక్షణా కౌన్సిల్ సభ్యులు, ఇటిసి వారు, అపార్డు డిటిఎంలు పాల్గొన్నారు.

- సిఎంపి

# గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిగా శ్రీ రేమండ్ పీటర్




**శ్రీ ఆర్.జె. రేమండ్ పీటర్, ఐఏఎస్., గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా పదవి బాధ్యతలు స్వీకరించారు (24.10.2013) శ్రీ ఆర్. జె. రేమండ్ ఫీటర్, ఐఏఎస్ ఇంతకు ముందు ప్రిన్సిపల్ సెక్రటరీ సోషల్ వెల్ఫేరు శాఖలో పనిచేసి దేశంలో మొట్టమొదటి సారిగా ఎస్.సి. / ఎస్.టీ. లకు సబ్‌ప్లాన్ ను తయారు చేయుటలో ఎంతో శ్రద్ధ కనపరిచి అందరి ప్రశంసలు పొందారు.**

కమీషనర్, ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ, ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్యదర్శిగా వివిధ హోదాలలో పని చేసి ఆయా శాఖల అభివృద్ధికి కృషి చేశారు.




# గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

**గ్రామీణాభివృద్ధికి సర్పంచులు నడుంకట్టుకొని పని చేయవలసిన అవసరం ఉందని అపార్డు డైరెక్టర్ జనరల్ శ్రీ కె. చంద్రమౌళి ఐ.ఎ.ఎస్ (రిటైర్డ్) అన్నారు. గ్రామం సర్పంచుల చేతుల్లో ఉన్నందున వారు శ్రద్ధ వహించి గ్రామ సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని సూచించారు.**

అన్ని గ్రామాలకు ఒకే సమస్యలుండవని వారి వారి సమస్యలను బట్టి పనులు చేయాలని, ముఖ్యంగా రేషన్ సకాలంలో అందేట్లు చూడడం, పెన్షన్‌ను తగిన సమయంలో అందేలా చూడాలన్నారు.

శ్రీ కె. చంద్రమౌళి మహబూబ్‌నగర్ జిల్లా బండమీద పల్లి మహిళ ప్రాంగణంలో ఎఎంఆర్-అపార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సర్పంచుల శిక్షణ ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఎంతో నమ్మకంతో ప్రజలు మీ పైన ఉంచిన పనిని బాధ్యతతో పూర్తి చేసి మెప్పించాలని సూచించారు. గ్రామాలలోని సమస్యలను సర్పంచులు కాలానుగుణంగా సర్వే చేయించడం వాటిని తీర్చడానికి చర్యలను తీసుకోవలసిన అవసరం నేటికి ఉందన్నారు. ముఖ్యంగా గ్రామ పరిస్థితులు అర్థం చేసుకొని అమలు చేసినట్లైతే తగిన ఫలితాలు పొందవచ్చన్నారు. గ్రామంలో మంచినీటి సమస్య, రోడ్లు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు, తదితర సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఎవరికి వారు తమ తమ గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలన్నారు.

వంద శాతం అక్షరాస్యత, పనులు తదితర విషయాల్లో పురోగతి సాధించినప్పుడే గ్రామానికి మంచి పేరు వస్తుందన్నారు. విద్యుత్ కోతలు పెరుగుతున్నందున 2015లోగా ప్రతి గ్రామంలో జనరేటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో వాటర్ ట్యాంకులను తరుచూ శుభ్రం చేయాలన్నారు.

*- సి.ఎం.పి.*





# సమస్యలన్నింటికీ తగు పరిష్కారం

## ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో శ్రీ శశిభూషణ్ కుమార్ ఐ.ఎ.ఎస్

**ఏకలవ్య ఫౌండేషన్, శాంప్రసాద్ ఇనిస్టిట్యూట్ ఫర్ సోషల్ సర్వీస్ (సిస్) లు పరస్పర సహకారంతో ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాలైన ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, జైనూర్, సిర్పూర్ (యు) మండలాలలో విద్య, వైద్యం, జీవనోపాధి రంగాలలో పని చేస్తూ గిరిజన ప్రజలలో సామాజికంగా, ఆర్థికంగా మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు వెలుతున్నాయి.**

దీనిలో భాగంగా శ్యాంప్రసాద్ ఇనిస్టిట్యూట్ ఫర్ సోషల్ సర్వీస్ (సిస్) ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి మండలంలో ఐ.డబ్ల్యు.యం.పి. లచ్చంపూర్ 2011-12 అనే వాటర్‌షెడ్ పథకాన్ని నిర్వహిస్తున్నది. గిరిజనుల అభివృద్ధిని కాంకిస్తు వారి జీవన విధానాలను, సంస్కృతి సంప్రదాయాలను, నివసిస్తున్న పరిసరాలను వారి అవసరాలను తెలుసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభిద్ధి శాఖ కమీషనర్ శ్రీ శశిభూషణ్ కుమార్ అక్టోబర్ 6 న ఉట్నూర్ మండలంలోని సహకార మిత్ర సంస్థ ఆధ్వర్యంలోని సాలేగూడ (కే) గ్రామాన్ని సందర్శించి కో-ఆపరేటీవ్ సంఘం, రైతు సంఘం గురించి వారు చేస్తున్న పొదుపుల గురించి అడిగి తెలుసుకున్నారు.

అంతేకాక గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల గురించి, డబ్బుల చెల్లింపుల వివరాల గురించి, ఇందిర జలప్రభ పథకం అమలు గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. తరువాత సోనేరావు పొలంలో ఉన్న వర్షజల్ అనే పనిని వీక్షించి దీని ద్వారా రైతు పొందిన నీటి లాభాన్ని ప్రత్యక్షంగా చూశారు.

ఆ తరువాత సహకార మిత్ర సంస్థ ఆధ్వర్యంలో ఉన్న దాల్‌మిల్‌ను సందర్శించి అక్కడ ఉన్న ప్రజామిత్ర సమైక్య సంఘంతో సమావేశమై వారి సమస్యలను తెలుసు కున్నారు. పారిశుధ్ధ్యం ప్రాముఖ్యం దృష్ట్యా ప్రతి ఒక్కరు మరుగుదొడ్డిని నిర్మించి దానిని వాడుకునేలా ప్రోత్సహించాలని సూచించారు.

ఆ తరువాత శ్యాంప్రసాద్ ఇనిస్టిట్యూట్ ఫర్ సోషల్ సర్వీస్ (సిస్) ఆధ్వర్యంలో అమలు అవుతున్న ఐ.డబ్ల్యు.యం.పి., పథకంలోని కన్నాపూర్, పొచ్చంపల్లి గ్రామాలలోని వాటర్‌షెడ్ పనులను చూసి అక్కడి రైతులను, గ్రామస్తులను కలిసి ఉపాధిహామీ పథకం, ఇందిర జలప్రభ పథకాల పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి గ్రామస్తులు తమకు 3 ఫేజ్ కరెంటు, మంచి నీటి వ్యవస్థ కావాలని కమీషనర్ గారికి విజ్ఞప్తి చేశారు.

అదేరోజు పొచంపల్లి పంచాయతి పరిధిలోని రిమ్మ గ్రామంలో గ్రామస్తులతో సమావేశమై బసచేశారు. ఆక్కడి గ్రామ పటేల్ శంకర్, పలువురి గిరిజనుల సమస్యలను కమీషనర్ దృష్టికి తీసుకొచ్చారు. మరియు గ్రామానికి సరియైన రహదారి సౌకర్యం లేదని అదే విధంగా రాంపూర్ (బి) గ్రామ శివారులు నిర్మించిన చిక్‌మన్ ప్రాజెక్టు నీరు తమ గ్రామానికి అందడం లేదని, ఆ నీరు తమకు అందితే వ్యవసాయ రంగంలో తాము అభివృద్ధిని సాధిస్తామని తెలియజేశారు.

సమస్యలన్నింటికి స్పందిస్తూ, వీటిని ఐ.టి.డి.ఎ. పి.ఓ., జిల్లా పాలనాధికారి (కలెక్టర్) దృష్టికి తీసుకెళ్ళి తగు పరిష్కారం చూపుతానన్నారు. ప్రతి ఒక్కరు ఇంటింటికి మరుగుదొడ్డిని కట్టుకొని వాడుకోవాలని మళ్ళీ గ్రామానికి వచ్చినప్పుడు అందరూ మరుగుదొడ్డిని వాడుతుండాలని అన్నారు.

# ఎ.ఎం.ఆర్ - అపార్డ్ డైరెక్టర్‌గా జి.డి. ప్రియదర్శిని, ఐఏఎస్ పదవీ బాధ్యతల స్వీకరణ



ఎ.ఎం.ఆర్ -అపార్డ్ డైరెక్టర్‌గా జి.డి. ప్రియదర్శిని, ఐఏఎస్ అక్టోబర్ 30, 2013న పదవీ బాధ్యతలు స్వీకరించారు. జి.డి. ప్రియదర్శిని, ఐఏఎస్, ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన వారు. గతంలో నల్గొండ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు. అనంతరం గ్రేటర్ హైదరాబాద్ లో 2010 నుండి 2013 వరకు అడిషనల్ మున్సిపల్ కమీషనర్‌గా పని చేశారు.

ఏ.ఎం.ఆర్ - అపార్డులో ఆమె బాధ్యతలు స్వీకరించిన అనంతరం అపార్డ్‌లో శిక్షణా కార్యక్రమాల గురించి, వివిధ శాఖాధిపతులతో సమావేశమై తెలుసుకొన్నారు. శిక్షణలో అపార్డ్ ఆధునిక శిక్షణా పద్ధతులను అవలంబించి, సామాన్యులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని సూచించారు. అపార్డ్‌లో శిక్షణా వసతులను మరింత మెరుగు పరచాలని అధికారులను ఆదేశించారు. ◆

# అందరికి పోషకాహారం అందేలా చూడాలి




**దేశంలో అందరికీ పోషకాహారం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి గ్రామాలలో నున్న పోషకాహారలోపం ఎదిగే పిల్లల్లో కనిపించకుండా వారికి తగిన ఆహారం అందించేందుకు శాఖాధికారుల పనిచేయవలసి ఉందని అపార్డు సి.ఎన్.ఆర్ఎం అధిపతి శ్రీ హెచ్. కూర్మారావు అన్నారు. ఆయన ప్రపంచ ఆహార దినోత్సవం (16-10-2013) సందర్భంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అమీర్‌పేటలో జరిగిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.**

ఈ సమావేశంలో జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) డిమాన్ స్ట్రేటర్ శ్రీ నటరాజ్ మాట్లాడుతూ, మన రాష్ట్రంలో ఆహార లోపాన్ని సరిదిద్దేందుకు పలు చర్యలు తీసుకొన్నారని, మధ్యహ్నన భోజనం పాఠశాలలో అందించడం, అంగన్‌వాడీల ద్వారా చిన్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. అమీర్‌పేట గ్రామ సర్పంచ్ శ్రీరాములు మాట్లాడుతూ, అంగన్‌వాడీ వర్కర్ల ద్వారా అందిస్తున్న పోషకాహారం కొరకు తగిన నిధులు అందేలా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో అపార్డ్ సి.ఎన్.ఆర్.ఎం. అధికారులు శ్రీ రత్నాచారీ, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు భారత నిర్మాణ్ వాలంటీర్లు ముందుండి విజయవంతం చేశారు.

*- సి.ఎం.వి.*





# బాల కార్మికుల (నిషేధం, నియంత్రణ) చట్టం - 1986

ప్రస్తుతం ఎందరో బాలలు రెస్టారెంట్లలోను, చిన్న చిన్న మెకానిక్ షాపుల్లోను, కర్మాగారాలలోను, పరిశ్రమలలోను, యజమానుల ఇళ్ళల్లోను వెట్టిచాకిరీ చేస్తూ తగిన జీతం, సదుపాయాలు లేక నలిగి పోతున్నారు. కొందరు ఉపాధి లేక ముష్టివారుగా మారిపోతున్నారు. కొందరు బాలికలు చిన్న వయసులోనే వ్యభిచార నరకకూపంలోనికి బలవంతంగా నెట్టివేయబడుతున్నారు. వీరందరికీ స్వేచ్ఛగా, ఆనందంగా జీవించే హక్కు ఉందని తెలియజేస్తూ ఆదరించాలి. బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థలు వివిధ కార్మిక సంఘాలు, పత్రికలు, ప్రచార సాధనాలు తమ వంతు కృషి చేస్తూ చురుకైన పాత్రను పోషించాలి.

### బాల కార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరం

- ☆ బాలలను పనిలో పెట్టుకున్న యజమానులు చట్టరీత్యా శిక్షార్హులు.
- ☆ బాలల చేత పనిచేయించే సంస్థల యజమానుల, బాల కార్మిక చట్టం 1986, ఆంధ్రప్రదేశ్ షాప్స్ మరియు ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం 1988 క్రింద శిక్షార్హులు.
- ☆ 14 సంవంత్సరాలలోపు బాలలను జీతగాళ్ళుగా తీసుకుంటే, వెట్టి చాకిరీ నిర్మూలనా చట్టం 1976 కింద నేరం.
- ☆ తల్లిదండ్రులు భూస్వాములకు తమ పిల్లలను సంవత్సర జీతానికి ఇస్తే, అది వెట్టి చాకిరీ నిర్మూలనా చట్టం- 1976 క్రింద శిక్షార్హులు.
- ☆ బాల కార్మికులను బడికి పంపని పక్షంలో పిల్లల యజమానులపై రూ. 20 వేల జరిమానా విధిస్తారు. జరిమానాను బాలిక/బాలుని పేరుపై జమచేసి వారి చదువుకి వినియోగిస్తారు.
- ☆ బాలలను ఏ రకమైన పనిలో పెట్టుకున్నా కనీస వేతనాల చట్టం - 1948 క్రింద యజమానులు శిక్షార్హులు.

| | బాల కార్మికులు/వ్యవస్థకు సంబంధించిన ప్రధాన చట్టాలు | | |
|---|---|---|---|
| నెం. | చట్టాలు | వివిధ రకాల ఉల్లంఘనలకు శిక్షలు | |
| 1. | బాలలు (కార్మికుల తాకట్టు) చట్టం, 1933 | ---- | రూ. 50/ 200 |
| 2. | కర్మాగారాల చట్టం, 1948 | 2 ఏళ్ళు | రూ. 1 లక్ష |
| 3. | తోట కార్మికుల చట్టం, 1951 | 3 నెలలు లేదా 6 నెలలు | రూ. 500/1000 |
| 4. | గనుల చట్టం, 1952 | 3 నెలలు | రూ. 1000 |
| 5. | దుకాణాలు, వాణిజ్య సంస్థల చట్టం | రాష్ట్రం నుంచి రాష్ట్రానికి మారుతుంది. | |
| 6. | వాణిజ్య నౌకాయాన చట్టం, 1958 | - | వర్తించదు. |
| 7. | మోటారు రవాణా కార్మికుల చట్టం, 1961 | 3 నెలలు లేదా 6 నెలల | రూ. 500 |
| | | | రూ. 1000 |
| 8. | బీడీ మరియు సిగార్ కార్మికులు | 3 నెలలు లేదా 6 నెలలు | రూ. 500 |
| 9. | (ఉపాధి పరిషతులు) చట్టం, 1966 | | |
| | బాల కార్మిక చట్టం 1986 | కారాగార శిక్ష | |

★ ప్రభుత్వ ఉద్యోగులయితే పిల్లలను ఏ రకమైన పనిలో పెట్టుకున్నా ఎ.పి సివిల్ సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్ 1964 ప్రకారం శిక్షార్హులు.


### బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన - అవగాహన

బాల్యంలో హాయిగా ఆనందంగా ఆడుకుంటూ కాలం గడపాల్సిన బాలలు నేడు దేశంలో కఠినమైన ప్రమాదకరమైన పనులు చేస్తూ భారత చట్టాన్ని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. 1881లో ప్రథమంగా భారతదేశంలో బాలకార్మికులకు సంబంధించిన నిబంధనలు ఏర్పడ్డాయి. అందులో 7 నుండి 12 సంవత్సరాల మధ్య వయస్సుగల పిల్లలను ఫ్యాక్టరీలలో కార్మికులుగా నియమించరాదని పేర్కొన్నారు. ఆ తర్వాత 1922, 1934, 1948లో ఫ్యాక్టరీల చట్టంలో బాలకార్మికులకు సంబంధించి అనేక అంశాలను సవరించి శాసనాలు చేశారు. అయితే ఈ చట్టాలేవీ పిల్లల విషయంలో సమర్థంగా పనిచేయకపోవటం ఎంతో బాధని, ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

బాలకార్మికుల గురించి కొద్దో గొప్పో పట్టించుకున్న సంవత్సరంగా 1996ను పేర్కొనవచ్చు. 1996ను అంతర్జాతీయ బాలకార్మికుల నిర్మూలన సంత్సరంగా ప్రకటించారు.

### బాల కార్మికులను నిషేధించిన ప్రదేశాలు - పనులు

★ రైల్వే ద్వారా ప్రయాణికులు, సామాగ్రి, ఉత్తరాల రవాణా.
★ రైలు బొగ్గు ఏర్పాటు చేయటం, బూడిద కుప్ప తొలగించటం.
★ రైల్వే స్టేషన్‌ల్లో ఫలహారశాల, ఒక ప్లాట్ ఫారం నుంచి మరొక ప్లాట్ ఫారం వరకు వెండర్ల రవాణా, కదిలే రైలు నుంచి రవాణా.
★ పోర్ట్ అథారిటీ పనులు.
★ తాత్కాలిక లైసెన్సుతో బాణాసంచా అమ్మేషాపుల్లో పని.
★ పశుశాలల్లో పనులు.
★ బీడీల తయారీ.
★ తివాచీల తయారీ.
★ సిమెంటు ఉత్పత్తి, సంచుల్లో నింపటం.
★ వస్త్రాలపై ప్రింటింగ్, అద్దకం, నేత.
★ అగ్గిపెట్టెలు, పేలుడు పదార్థాలు, బాణాసంచా తయారీ
★ మైకా కోత, విభజన
★ షెలాక్ తయారీ.
★ సబ్బుల తయారీ.
★ తోలు శుద్ధి చేయటం.
★ ఊలు శుద్ధి చేయటం.
★ పలకలు, బలపాల పరిశ్రమలు.





★ విలువైన రాళ్ళ తయారీ.
★ సీసం, పాదరసం, మాంగనీసు, క్రోమియం, కాడ్మియం, బెంజిన్, క్రిమిసంహారకాలు, ఆస్బెస్టాస్ వంటి విషపదార్థాలతో ఉత్పత్తి తయారీ.
★ జీడిపప్పు పొట్టు తీయటం, ప్రాసెసింగ్.
★ ఎలాక్ట్రానిక్ పరిశ్రమలు, సోల్డరింగ్ మొదలైనవి.

### బాల కార్మిక వ్యవస్థపై సుప్రీం కోర్టు ఆదేశాలు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 24ను పూర్తిగా ఉల్లంఘిస్తూ, శివకాశిలోని అగ్గిపెట్టెల పరిశ్రమలో పిల్లలచేత పని చేయిస్తున్నారని ఎం.సి మెహతా పెట్టుకున్న అర్జీ (నెం.465, 1986) పై సుప్రీంకోర్టు 1996 డిసెంబర్ 10న తన తీర్పు ప్రకటించింది. హానికరమైన పనుల్లో ప్రక్రియల్లో పనిచేస్తున్న పిల్లలను ఆ పనుల నుండి తప్పించి, పునరావాసం కల్పించడం, అలాగే హానికరంగాని పనుల్లో, ప్రక్రియల్లో పనిచేసే పిల్లల పరిస్థితులను క్రమబద్ధం చేసి మెరుగుపరచడం ఎలా చేయాలనేది సూచిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

హానికరమైన పనుల్లో ఉన్న పిల్లలను గుర్తించి వారిని ఆ పనుల నుండి తప్పించి, పాఠశాలలో చేర్చాలని సుప్రీం కోర్టు అభిప్రాయడింది. చట్ట నిబంధనలను ధిక్కరిస్తూ ఎవరైతే పిల్లలను పనుల్లో పెట్టుకుంటారో అటువంటి యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, అటువంటి యజమానుల నుండి ప్రతి బాల కార్మికునికి రూ. 20,000 లు చొప్పున జరిమానా వసూలు చేయాలని ఆదేశించింది. అపరాధులైన యజమానుల నుండి వసూలు చేసిన జరిమానాలను డిపాజిట్ చేయటానికి జిల్లా బాలకార్మిక సంక్షేమ పునరావాస నిధి ఒకటి స్థాపించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఒకవేళ హానికరమైన పనుల్లో బాలకార్మికులు పని చేస్తున్నట్లయితే, అటువంటి చోట్ల ఆ బాలకార్మికుని కుటుంబంలో పెద్దవారికెవరికైనా ఉద్యోగం ఇవ్వాలని తీర్పులో సిఫార్సు చేశారు. ఒక వేళ ప్రత్యామ్నాయ ఉద్యోగాన్ని కల్పించలేని పక్షంలో ఆ తల్లిదండ్రులకి/ సంరక్షకులకి అదనంగా మరో రూ. 5,000 లు ప్రభుత్వం అందచేయాలి. మొత్తం రు.25,000 లని కార్పస్‌ఫండ్‌లో జమచేసి, దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని తల్లిదండ్రులకు చెల్లించాలి. ఒకవేళ పిల్లలను పాఠశాలలకు పంపించని పక్షంలో ఈ చెల్లింపుని నిలిపివేస్తారు.

అంతేకాక, బాల కార్మిక వ్యవస్థ (నిషేధం, క్రమబద్ధం) చట్టం నిబంధన 17 క్రింద నియమించబడిన ఇన్‌స్పెక్టర్లందరూ జిల్లా బాల కార్మిక సంక్షేమం పునరావాస నిధికి అధ్యక్షులైన జిల్లా మేజిస్ట్రేటుకి జవాబుదారీగా ఉండాలి.

ఒక సంస్థలో కానీ, లేదా సంస్థల వర్గంలో కానీ పనిచేస్తున్న లేదా పనిచేయడానికి అనుమతించిన బాలల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన నియమ నిబంధనలను సంబంధిత ప్రభుత్వాలు అధికారిక గెజిట్‌లో నోటిఫికేషన్ ఇచ్చి రూపొందించాలి.

**ఆంధ్రప్రదేశ్ బాల కార్మిక (నిషేధం నియంత్రణ) నిబంధనలు - 1995**

***కార్మిక ఉపాధి, శిక్షణ మరియు కర్మాగారాల శాఖ:*** బాలకార్మిక (నిషేధం నియంత్రణ) చట్టం 1986 (1986లో 61వ కేంద్ర చట్టం)లోని 13వ విభాగంలోని 1వ ఉపవిభాగం కింద బాలల ఆరోగ్యం కోసం, భద్రత కోసం నియమాల రూపకల్పన, తుది ప్రకటన.

జి.ఓ.ఎం.ఎస్.నెం.38, కార్మిక ఉపాధి శిక్షణ (కర్మాగారాలు లాబ్-4) 1995 అక్టోబర్ 18 వ తేది.

1986లో 61వ కేంద్ర చట్టంలోని 13 వ విభాగంలోని 1వ ఉపవిభాగం. 18వ విభాగంలోని 1వ ఉపవిభాగం ద్వారా సంక్రమించిన అధికారాలను అమలుపరుస్తూ, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఈ సందర్భంగా వివిధ సంస్థలు, కర్మాగారాలు, దుకాణాలలో విధుల్లో వినియోగించబడిన లేదా పని చేసుకోవడానికి అనుమతింపబడిన బాల కార్మికుల భద్రత కోసం వారి ఆరోగ్యం కోసం, ఈ కింది పేర్కొన్న నియమాలు విధిస్తున్నారు. ఇవే నియమాలు గతంలో బాల కార్మిక (నిషేధం, నియంత్రణ) చట్టం, 1986లోని ఉపవిభాగం 18 క్రింద ప్రకటితమయ్యాయి.

***మోయలేని బరువులు:*** పిల్లలతో 10 కిలోలకు మించిన బరువులు మోయించరాదు. చేయితో ఎత్తేదైనా, తలపై మోసేదైనా పది కిలోలకు మించరాదు.

***కళ్ళకు రక్షణ:*** పని ప్రదేశంలో, స్వభావాన్ని బట్టి పని జరిగినప్పుడు వెలువడే వాయువులు, ఆవిరులు లేదా అసాధారణ కాంతి కిరణాలు కళ్ళకు హాని కలిగించేవి, కంటి చూపును దెబ్బతీసేవి అయితే బాల కార్మికులకు ప్రమాదకరమైన వాయువులు, ఆవిరులు, కాంతి కిరణాల నుంచి కళ్ళకు రక్షణ కల్గించే నిమిత్తం గాగుల్స్ లాంటివి ఇవ్వాలి. తెరల్లాంటివి ఏర్పాటు చేయాలి.

***పేలుడు స్వభావం లేదా మండే స్వభావం లేదా మండే స్వభావం గల వాయువులు:*** బాల కార్మికులు పనిచేసే ప్రదేశంలో పేలుడు స్వభావం గల పదార్థాలు గానీ మండే స్వభావంగల వాయువులు గానీ తత్సంబంధమైనవి ఏవీ గానీ ఉండరాదు.

### పని గంటలు - పని వ్యవధి

- ☆ ఏ సంస్థలో గానీ, ఎక్కడగానీ బాల కార్మికులతో ఏకధాటిగా 3 గంటలు మించి పనిచేయించరాదు.
- ☆ బాల కార్మికులతో రోజుకు 6 గంటలకు మించి పనిచేయించరాదు. ఆ ఆరుగంటల్లోనే విశ్రాంతి సమయం ఉండాలి. పనికోసం వేచివుండే సమయాన్ని దీనిలో భాగంగానే పరిగణించాలి.
- ☆ చదువులకు, ఆటపాటలకు వెచ్చించిన రెండు గంటల కాలాన్ని ఈ ఆరుగంటల్లో భాగగంగానే పరిగణించాలి.

### వారాంతపు సెలవులు

బాల కార్మికులకు వారానికొకరోజు సెలవు ఇవ్వాలి. మిగతా రోజుల్లో వారికి ఎంత వేతనం లభిస్తుందో లెక్క కట్టి అంత వేతనాన్ని సెలవు రోజుకు కూడా ఇవ్వాలి.

### కల్పించవలసిన వైద్య సదుపాయాలు

- ☆ బాలకార్మికులతో పనిచేయిస్తున్న యజమాని లేదా ఉద్యోగసంస్థ వారందరి వైద్య అవసరాలు తీర్చాలి.
- ☆ బాల కార్మికులందరికి ప్రతినెలా విధిగా వైద్య పరీక్షలు చేయించాలి.
- ☆ ప్రతి యజమాని లేదా ఉద్యోగ సంస్థ బాల కార్మికులందరికీ విధిగా మెడికల్ రిజిస్టర్ నిర్వహించాలి.

### ప్రమాదాలు జరిగితే . . .

- ☆ ఏదైనా ప్రమాదం జరిగితే ఆ ప్రమాదం గురించి, ప్రమాదానికి గురైన బాల కార్మికుల గురించి యజమాని లేదా ఉద్యోగసంస్థ సంబంధిత ఇన్‌స్పెక్టరుకు తెలియపరచాలి.
- ☆ ప్రమాదానికి గురైన బాలకార్మికులకు అవసరమైన చికిత్సకు అయ్యే ఖర్చులను యజమాని లేదా ఉద్యోగ సంస్థయే భరించాలి.

3. ప్రతి ఉద్యోగ సంస్థ లేదా యజమాని అన్ని ప్రమాదాలకు సంబంధించిన ఒక రిజిస్టర్‌ను తప్పక నిర్వహించాలి.

### బాలకార్మికుని వయసు నిర్ధారణకు సాక్ష్యాధారాలు

- ☆ తన పరిధిలో ఉన్న ఉద్యోగ సంస్థలు లేదా యజమానులను, వారి వద్ద పనిచేస్తున్న బాలకార్మికుల వయసును ధృవీకరించే పత్రాలను సమర్పించవలసినదిగా ఇన్‌స్పెక్టర్ ఎప్పుడైనా కోరవచ్చు. ధృవీకరణ పత్రాల కోసం అయ్యే ఖర్చులను యజమానే భరించాలి. వయసు ధృవీకరణ పత్రాల కోసం ఇన్స్‌పెక్టర్ రాతపూర్వకంగా అడిగినప్పుడు వాటిని సమర్పించడానికి పదిరోజులు గడువిచ్చినప్పుడు యజమాని సమర్పించే పత్రాలు ఈ క్రింది విధంగా ఉండాలి.

1. పాఠశాల రికార్డులు
2. స్థానిక సంస్థలు నిర్వహించే జననాల రిజిష్టరు
3. ప్రభుత్వం, వైద్య ఆరోగ్య అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్లు

ఈ నియమం క్రింద ఉపనియమం - క్రింద అవసరమైన పత్రాలను యజమాని లేదా ఉద్యోగ సంస్థ సమర్పించాలి. ఆ యజమాని లేదా సంస్థ ఖర్చుల మీద ఇన్స్‌పెక్టరు, సదరు బాలకార్మికుని వయసు వైద్య పరీక్ష ద్వారా నిర్ధారింపచేయవచ్చు. జిల్లా అసిస్టెంట్ సర్జన్ చేత గానీ లేదా ఆ హోదాకు తగ్గని ఇ.ఎస్.ఐ. ఆసుపత్రుల వైద్యులచేతగానీ ఈ వైద్య పరీక్ష నిర్వహింపచేయాలి. ఆ వైద్యాధికారి ఈ నియమాలకు 'ఫారం-ఎ' ధృవపత్రం జారీ చేయాలి.

### రిజిష్టరు

ప్రతి యజమాని లేదా ఉద్యోగ సంస్థ బాలకార్మికుల వివరాలతో కూడిన రిజిష్టర్‌ను విధిగా నిర్వహించాలి. పని గంటల సమయంలోనైనా లేదా ఏ ఇన్‌స్పెక్టర్ అయినా ఎప్పుడైనా తనిఖీ చేసేందుకు వీలుగా ఈ రిజిష్టరు అందుబాటులో ఉంచాలి. నియమాలకు 'ఫారం - బి' రూపంలో వివరాలు రాసి రిజిష్టరు నిర్వహించాలి.

### నియామకపు లేఖ

ప్రతి యజమాని లేదా ఉద్యోగ సంస్థ పనిలో పెట్టుకున్న ప్రతి బాల కార్మికునికి 'ఫారం - సి' నియామకపు లేఖను విధిగా ఇవ్వాలి.

***– ఆర్.శివపార్వతి,*** *డిప్యూటీ డైరెక్టర్,*
*మహిళా శిశుసంక్షేమ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం*

# సామాజిక ఆర్థిక, కుల గణన ముసాయిదా జాబితా ప్రచురణపై సందేశం

**భారత ప్రభుత్వం అన్ని రాష్ట్రాలలో సామాజిక ఆర్థిక, కుల గణన (SECC) చేపట్టడం జరిగింది. ఈ గణన ప్రధాన ఉద్దేశ్యం ప్రతి వ్యక్తి యొక్క సాంఘీక, ఆర్థిక పరిస్థితులు, కులానికి సంబంధించిన వివరాలు, విద్యా స్థాయి తెలుసుకొని పేద కుటుంబాలను గుర్తించి వారికై ఉద్దేశించిన పథకాలను అమలు చేయడం.**

భారత ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం సామాజిక ఆర్థిక, కుల గణన (SECC), మన రాష్ట్రంలో అక్టోబర్ 2011 నుండి మార్చ్ 2012 వరకు జరిగింది. తదుపరి పర్యవేక్షణ, పరిశీలన ఇప్పటివరకు జరిగింది. ప్రస్తుతం భారత ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో ముసాయిదా జాబితాను అన్ని గ్రామ పంచాయితీలలో ప్రచురించడం జరుగుతుంది. అంతేగాక ప్రజల పరిశీలనకు గ్రామ సమాఖ్యల దగ్గర, మండల రెవిన్యూ కార్యాలయంలో ముసాయిదా జాబితా ప్రతిని ఉంచడం జరుగుతుంది.

ముసాయిదా జాబితా ఉద్దేశం సరియగు సమాచారంతో తుది జాబితా రూపొందించడం. దీని వలన పేదరిక నిర్మూలన కొరకై మంజూరైన ప్రభుత్వ పథకాలు సరియగు వ్యక్తులకు చెందుతాయి. ఈ ప్రకారంగా జాబితాను పారదర్శకతతో రూపొందించాలని ముసాయిదా జాబితా ప్రచురించడం జరుగుతుంది.

ఈ ముసాయిదా జాబితా నందు గణన చేసిన ప్రతి కుటుంబం యొక్క వివరాలు అనగా కుటుంబ సభ్యుల పుర్లు, వృత్తి, విద్యార్హతలు, వైకల్యము, మతం, కులం, గృహపు గోడ, పైకప్పు వివరాలు, స్వంత లేదా అద్దె గృహమా, ఎన్ని గదులు వున్నాయి. ఏ కుంటుంబ సభ్యుడైనా ఆదిమ గిరిజన తెగల గ్రూపు (PTG) కు చెందినవాడా, చట్టబద్ధంగా విముక్తి చెందిన వెట్టి కార్మికులా (LRBL), మాన్యువల్ స్కావెంజేరా (MS) వివరాలు ఉంటాయి. అంతేకాకుండా ఏ సభ్యుడైనా ప్రభుత్వ లేదా ప్రైవేటు ఉద్యోగం కలిగి ఉన్నాడా, వారి ఆదాయమెంత, కుటంబ ప్రధాన ఆదాయం దేని నుంచి వస్తుంది. కుటుంబం రెఫ్రిజిరేటర్, ల్యాండ్ లైన్ టెలిఫోన్ లేదా మొబైల్ ఫోన్, 2, 3 లేదా 4 చక్రాల యాంత్రిక వాహనం కలిగి ఉన్నాడా, భూమి వివరాలు, సాగు వివరాలు, వ్యవసాయ పనిముట్లు మరియు 50,000 రూపాయలకు మించి వ్యవసాయ రుణ పరపతి కార్డు కలిగి ఉన్నారా మొదలగు వివరాలతో కూడిన గణన చేసిన ముసాయిదా జాబితాను గ్రామ పంచాయతి, గ్రామ సమాఖ్య, తహసిల్దార్ కార్యాలయం వద్ద లభ్యంగా వున్నాయి.

ముసాయిదా జాబితా ప్రచురించిన 7వ రోజు అన్ని గ్రామ పంచాయితీలలో గ్రామ సభ జరుగుతుంది. ముసాయిదా జాబితా ప్రచురించిన మొదటి రోజు నుండి 21వ రోజు వరకు ప్రజల నుండి విన్నపాలు, ఆక్షేపణలు తగిన ఫారంలలో తీసుకోవడం జరుగుతుంది. గ్రామ రెవిన్యూ అధికారి లేదా గ్రామ పంచాయతీ కార్యదర్శికి విన్నపాలిచ్చి తగు రశీదునుపొందాలి. రశీదులో సూచించిన తేదీన సంభందిత అధికారి వద్ద విచారణ నిమితం హాజరుకావాలి.

**ఫారం - ఏ :** ముసాయిదా జాబితాలో ప్రచురించిన వ్యక్తి(లు) పరు(లు) సంబంధించి ఆక్షేపణలను దాఖలు చేయటానికి ప్రజల



వినియోగం కోసం ఉద్దేశించబడినది.

**ఫారం - బి :** ముసాయిదా ప్రచురణలో వ్యక్తి(లు) వివరాల దిద్దుబాట్లు/నవరణల కోనం ప్రజల వినియోగం కోనం ఉద్దేశించబడినది.

**ఫారం - సి :** .... గణన సమయంలో నివాస స్థలం నుండి తొలగించిన/ దూరంగా ఉన్న ఆయావ్యక్తుల చేర్పు కోనం ఉద్దేశించబడినది.

**ఫారం - డి :** ముసాయిదా ప్రచురణలో ఆక్షేపణకు గురైన వ్యక్తికి ఇవ్వవలసిన నోటీసు.

**ఫారం - ఇ :** క్లైములు, ఆక్షేపణలుగా పరిగణించే గ్రామ సభ తీర్మాన వివరాలతో వుంటుంది.

ఏ నుండి సి నమూనాలు గ్రామ రెవిన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శుల దగ్గర లభించును. నమునా ఫారంలో చేతివ్రాత ద్వారా వ్రాసిన విజ్ఞాపనలను కూడా స్వీకరించబడతాయి.

ఏ నండి సి నమూనాలో వచ్చిన విజ్ఞప్తులను మండల రెవిన్యూ ఆధికారి లేదా మండల అభివృద్ధి అధికారి లేదా నియమినిచిన మండల స్థాయి అధికారులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను వారం రోజులలోపు సంబంధిత కుటుంబ యజమానులు / సభ్యుల మందు సూచించిన తేదీ, స్థలంలో పరిష్కరించబడును. 45వ రోజు తుది జాబితా ప్రచురించబడును.

ఎవరైనా మండల అధికారులు ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందని యెడల సంబంధిత అప్పిలేట్ అధికారి అయిన రెవిన్యూ డివిజనల్ అధికారి, ఎంపికకాబడిన జిల్లా అధికారులను 7 రోజులలోపు సంప్రదించాలి.

కావున అందరు ప్రజలకు విజ్ఞప్తి ఏమనగా ఈ ముసాయిదా జాబితాలో వివరాలన్నింటిని క్షుణ్ణంగా పరిశిలించి సరియైన సమాచారాన్ని ఇచ్చి అర్హులైన వ్యక్తులకు ఎలాంటి నష్టం జరగకుండా మంచి సమాజాన్ని నిర్మించుటకు కృషి చేయాలని కోరుతున్నాను.

**బి. రాజశేఖర్, ఐ.ఏ.ఎస్.,**
**ముఖ్యకార్యనిర్వహణ అధికారి, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ,**
**రాష్ట్ర నోడల్ అధికారి, ఎస్ఇసిసి, గ్రామీణ ప్రాంతం హైదరాబాద్**



# స్థానిక సంస్థలు - వనరులు, నిధులు సమకూర్చుకోవడం ఎలా ?

**మన దేశంలో స్థానిక సంస్థల ప్రాధాన్యత 73 వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాచుర్యంలోకి వచ్చింది. మన రాష్ట్రంలో పంచాయతీరాజ్ చట్టం 1994 నుండి అమలులోకి వచ్చింది. ఈ చట్టం ద్వారా మన రాష్ట్రంలోని స్థానిక సంస్థల ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం మన రాష్ట్రంలో స్థానిక సంస్థలు గ్రామ పంచాయితీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లుగా ఏర్పడ్డాయి. రాష్ట్రం మొత్తం మీద 21,943 గ్రామ పంచాయితీలు, 1097 మండలాలు, 22 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. పంచాయతీరాజ్ శాఖలో ఉన్న స్థానిక సంస్థలలో సుమారు 2 లక్షల మంది ప్రజా ప్రతినిధులు, 2 లక్షల మంది ఉద్యోగస్తులు ఉన్నారు.**

ఏ శాఖలో లేని విధంగా పంచాయతీరాజ్ శాఖలోనే ఇంత పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం ఉంది. ఈ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన వివిధ సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రజలకు అందజేయడం జరుగుతున్నది. ఏ శాఖలో లేని విధంగా పంచాయతీరాజ్ శాఖలో స్థానిక సంస్థలలో ఉన్న ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు కలిసి గ్రామీణ ప్రజలకు మేలైన సేవలు అందజేస్తున్నారు.

2002 సంవత్సరంలో ప్రవేశ పెట్టబడిన గ్రామీణ సచివాలయ వ్యవస్థ ద్వారా స్థానిక సంస్థల బాధ్యతలు మరింత పెరిగాయి. ఎందుకంటే, ఇంతకు ముందు కేవలం పంచాయితీకి సంబంధించిన విధులు మాత్రమే గ్రామ పంచాయితీలు నిర్వహిస్తుండేవి. కొత్త వ్యవస్థ ద్వారా రెవెన్యూ, పోలీస్ శాఖలకు సంబంధించిన విధులు కూడా నిర్వహించడం జరుగుతోంది.

ఈ తరుణంలో గ్రామీణ ప్రజలను పేదరికం నుంచి పై స్థాయికి తీసుకు రావడానికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయవలసిన బాధ్యత స్థానిక సంస్థలపై మరింతగా పెరిగింది. కానీ ప్రస్తుతం స్థానిక సంస్థలు తమ పరిధిలో ఉన్న గ్రామీణ ప్రజలకు నిధుల లోపం వల్ల మేలైన సేవలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడానికి అవకాశం తక్కువగా ఉంటుంది. నిజంగా ఆలోచించాలంటే, ప్రస్తుతం స్థానిక సంస్థలు కేవలం ప్రభుత్వ నిధుల కోసమే వేచి ఉండడం జరుగుతున్నది.

స్థానిక వనరులను, తద్వారా ఆదాయాలను పెంపొందించు కోవలసిన అవసరం గురించి శ్రద్ధచూపడం జరగలేదు. తద్వారా స్థానిక సంస్థలలో ప్రజలకు కావలసిన కనీస అవసరాలైన తాగునీరు, ఆహారం, విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, విద్యుచ్ఛక్తి, రోడ్లు, డ్రైనేజీ, మరుగుదొడ్లు, స్థానిక పర్యావరణ పరిరక్షణ గురించి సరైన విధంగా తోడ్పాటు అందించడానికి అవకాశం కలగడం లేదు. మరి స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల ప్రస్తుత పరిస్థితి, సదరు సంస్థలు పంచాయితీ చట్టం ప్రకారం సమకూర్చుకోవలసిన వనరులు, నిధుల గూర్చి చర్చించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**గ్రామ పంచాయితీ :** 1964 లో ఏర్పాటు చేసిన పంచాయితీ చట్టం ద్వారా ఆనాడు గ్రామ పంచాయితీలను మేజర్, మైనర్‌గా విభజించడం జరిగింది. 60 వేల వార్షిక ఆదాయం కలిగిన పంచాయితీలు మేజర్ పంచాయితీలుగా, 40-60 వేల వార్షిక ఆదాయం మధ్యలో ఉన్న పంచాయితీలను మైనర్ పంచాయితీలుగా వర్గీకరించడం జరిగింది.

మన రాష్ట్రానికి సంబంధించి రెండవ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ రిపోర్ట్ (2001 - 05) ప్రకారం, సుమారు 390 పంచాయితీలు 1000 రూపాయల ఆదాయం కంటే తక్కువ కలిగి ఉన్నాయి.

అలాగే, 1350 గ్రామ పంచాయితీలు 2001 - 3000 రూపాయల లోపు ఆదాయం కలిగి ఉన్నాయి. సుమారు 3603 గ్రామ పంచాయితీలు 3001 - 5000 రూపాయల లోపు ఆదాయం కలిగి ఉన్నాయి. అంటే సుమారుగా 5348 గ్రామ పంచాయితీల వార్షిక ఆదాయం కేవలం సర్పంచ్‌లకు గౌరవ వేతనం ఇవ్వడానికి కూడా సరిపోవడం లేదు.

ఇటువంటి పరిస్థితులలో గ్రామ పంచాయితీలు ప్రజలకు మేలైన సేవలు అందించలేక పోతున్నాయి. అంతే కాకుండా చిన్న చిన్న పంచాయితీలతో కూడా వాటి అభివృద్ధికి అవకాశం లేకుండా పోతున్నది. జనాభా ప్రకారం ఆలోచిస్తే, 33 పంచాయితీలు 300 లోపు జనాభా కలిగి ఉన్నాయి. 240 పంచాయితీలు 301 - 500 లోపు జనాభా కలిగి ఉన్నాయి. 2990 పంచాయతీల జనాభా 501 - 1000 లోపే ఉంది. 4425 పంచాయితీలు సుమారు 1000 - 1500 జనాభా కలిగి ఉన్నాయి. నిశితంగా పరిశీలించినట్లయితే, సుమారు 7728 పంచాయితీలు 1500 జనాభా కంటే తక్కువగా ఉన్నాయి. మరి అంతే కాకుండా ప్రస్తుతం ఉన్న 21943 గ్రామ పంచాయితీల్లో సుమారు 10,300 గ్రామ పంచాయితీలకు సొంత భవనాలు లేవు.

ఇటువంటి పరిస్థితుల్లో గ్రామ పంచాయితీలను ఆదాయం, జనాభా ప్రాతిపదికన వర్గీకరణ చేసి కేరళ, కర్నాటక రాష్ట్రాల మాదిరిగా పంచాయితీల సంఖ్యను కుదించి తద్వారా గ్రామీణాభివృద్ధికి శరవేగంగా కృషి చేయవలసిన అవసరం ఉన్నది. 1994 పంచాయితీ చట్టం ప్రకారం, గ్రామ పంచాయితీలో వనరులను స్థూలంగా ఈ క్రింది విధంగా సమకూర్చుకోవచ్చు. (అ) సొంత వనరులు, (ఆ) కేటాయించబడిన రాబడులు, (ఇ) ప్రభుత్వ గ్రాంట్లు, (ఈ) ప్రజల నుండి విరాళాలు.

**(అ) సొంత వనరులు :** 1. పన్నులు (నిర్భంధపు ఐచ్ఛిక పన్నులు) 2. రుసుములు, విధింపులు, సుంకం, 3. ఫలప్రదమైన పనుల నుండి ఆదాయం.

**పన్నులు :** ఇంటి పన్ను, వాహనాలపై, వ్యాపార ప్రకటనలపై పన్ను, నీటి పన్ను, డ్రైనేజీ, లైటింగ్ మొదలైన పన్నుల వసూళ్ళ వల్ల, ఇతర ఫీజులు, మార్కెట్లు, పచ్చగడ్డి, చేపలు, రేవులు, చెట్లు, పళ్ళు మొదలైన వాటి ద్వారా వచ్చే ఆదాయం అంతా పంచాయితీ సొంత ఆదాయం. పన్నులు ఖచ్చితంగా వసూలు చేయాలి. ప్రజలు పన్నులు కట్టడాన్ని ప్రోత్సహించాలి. బకాయిలు ఉన్న వారు కట్టవలసిన సొమ్ము చెల్లించేటట్లు చూడాలి. పన్నులు కట్టలేని వారికి పెనాల్టీలు, ఫైన్లు వేయాలి. మార్కెట్ల అద్దెలు, చేపల రేవులు, తోటల నుండి పంచాయితీకి ఆదాయం వచ్చేటట్లు చూడాలి.



**రుసుములు, విధింపులు, సుంకం :** గ్రామ పంచాయితీ యాజమాన్యం కింద ఉన్న పోరంబోకు లేక సామాజిక భూముల వినియోగంపై రుసుము. గ్రామ పంచాయితీ కింద ఉన్న చావిడీలు, సారియాలతో సహా అన్ని భవనాలను వినియోగించుకున్నందుకు రుసుము. గ్రామంలో తవ్విన ఖనిజాలు, చిల్లర ఖనిజాలు, ఇతర వస్తువులపై ప్రభుత్వం వసూలు చేసిన సిగ్నోరేజిపై సర్‌ఛార్జి రూపంలో సుంకం ద్వారా నిధిని సమకూర్చుకోవచ్చు.

**ఫలప్రదమైన పనుల నుండి ఆదాయం :** పంచాయితీ భూమిలో చెట్లు పెంచడం, చెరువుల్లో చేపలు, రొయ్యలు పెంచడం లాంటి కొత్త పద్ధతుల ద్వారా ఆదాయం పెంచుకోవచ్చు.

**(ఆ) కేటాయించబడిన రాబడులు :** భూమి శిస్తు స్టాంపు డ్యూటీపై విధించే సర్‌ఛార్జి, వినియోగపు పన్ను, వినోదపు పన్ను, వృత్తి పన్ను.

**(ఇ) గ్రాంట్లు :** తలసరి 1 రూపాయి చొప్పున ఇచ్చే గ్రాంటు. రాష్ట్రీయం చేసిన సిబ్బంది జీతాల గ్రాంటు, నెలకు 100 రూపాయల అనుసూచిత వర్గాలు, అనుసూచిత జాతుల సర్పంచ్‌లు మొదలైన వారికి చెల్లించే పారితోషిక గ్రాంట్లు, వృత్తి పన్ను విధింపునకు బదులు రాబడిలో వచ్చిన నష్టానికి ఇచ్చే నష్టపరిహారం, గ్రామంలో 75 శాతం కంటే ఎక్కువ పన్నులు వసూలు చేసినందుకు ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్లు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఏ స్థాయిలోనైనా ఉత్తమ గ్రామ పంచాయితీగా ఎంపిక సందర్భంగా వచ్చిన గ్రాంట్లు మరియు జవహర్ రోజ్‌గార్ వంటి అభివృద్ధి గ్రాంట్లు.

**(ఈ) ప్రజల నుండి విరాళాలు :** అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజల ద్వారా వచ్చే విరాళాలు. వాస్తవికంగా ఆలోచిస్తే, చాలా గ్రామ పంచాయితీలు స్థానిక నిధులు పెంపొందించుకోవడంపై శ్రద్ధ చూపకుండా కేవలం ప్రభుత్వ నిధుల కోసమే ఎదురుచూస్తున్నాయి. ఇది స్థానిక సంస్థల ముఖ్య ఉద్దేశమైన స్వశక్తి ద్వారా అభివృద్ధి చెందే ఆశయానికి విరుద్ధం. కాబట్టి గ్రామ పంచాయితీలు తమ పరిధిలో గల స్థానిక నిధులను సమకూర్చుకోవడం, పెంపొందించుకోవడం కోసం ప్రత్యేక శ్రద్ధ వహించవలసిన సమష్టి బాధ్యత గ్రామ పంచాయితీ సర్పంచ్, ప్రభుత్వ ఉద్యోగి అయిన పంచాయితీ కార్యదర్శిపై ఉంది.

వాస్తవంగా పంచాయతీ చట్టం ప్రకారం, గ్రామ పంచాయితీలు తమ ఆదాయం తామే పెంపొందించడానికి కృషి జరపవలసిన బాధ్యత

ఉన్నా, సదరు బాధ్యతపై పంచాయితీకి సంబంధించిన ప్రజా ప్రతినిధులు కానీ, అధికారగణం కానీ సంతృప్తికరమైన శ్రద్ధ కనబరచడం లేదు. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వం గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న సర్పంచ్‌లకు, పంచాయితీ కార్యదర్శులకు మండల, పూర్వపు బ్లాక్ మరియు జిల్లా స్థాయిలో తమ పరిధిలో ఉన్న స్థానిక నిధులను పెంపొందించడం కోసం అవగాహన సదస్సులు నిర్వహించడానికి సరైన యంత్రాంగం ఏర్పరచవలసిన బాధ్యత ఉంది. ఇటువంటి బాధ్యతను చేపట్టడానికి ప్రస్తుతం ఉన్న గ్రేడ్ 1 పంచాయితీ విస్తరణాధికారి సేవలను వినియోగించుకుంటే, ఆశాజనకమైన ఫలితం ఉంటుంది.

**మండల పరిషత్ :** మన రాష్ట్రంలో మండల వ్యవస్థ 15.1.1997 లో ఏర్పడింది. ఈ వ్యవస్థ రాక ముందు 334 పంచాయితీ సమితులు ఉండేవి. సదరు సమితులను ప్రస్తుతం 1097 మండలాలుగా విభజించడం జరిగింది. ఈ మండల పరిషత్ పరిధిలో సుమారు 14,617 మంది మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులున్నారు. ప్రస్తుతం మండల పరిషత్‌లు తమ సొంత నిధుల ద్వారా కేవలం 0.68 శాతం మాత్రమే ఆదాయం చేకూర్చుకుంటున్నాయి.

మండల పరిషత్‌కు మిగిలిన 99.32 శాతం వచ్చే ఆదాయం: 8 రూపాయల ప్రభుత్వ తలసరి గ్రాంటు, స్టాంపు డ్యూటీ మీద సర్‌ఛార్జి, భూమి శిస్తు, సీవరేజీపై 50 శాతం, రేవు పాటలు 37.5 శాతం, మండల పరిషత్ ఆస్తుల మీద వివిధ రకాల ఆదాయాలు. ప్రస్తుత లెక్కల ప్రకారం, కోటి 46 లక్షల వార్షిక బడ్జెట్ ఉంటుంది. ఈ మండల పరిషత్‌ల ద్వారా వివిధ శాఖలకు సంబంధించిన గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన కార్యక్రమాలపై సుమారు రూ. 2 కోట్ల వరకు వ్యయమవుతోంది.

ప్రస్తుత మండల పరిషత్ పరిపాలనకు, గ్రామ పంచాయితీ పరిపాలనకు సరైన సమన్వయం కొరవడింది. అట్లాగే గ్రామ పంచాయితీలు, మండల పరిషత్‌లకు జవాబుదారీగా ఉండడం లేదు. కావున ప్రభుత్వం పంచాయితీ సర్పంచ్‌ను మండల పరిషత్‌లో అధికార హోదా గల సభ్యుడిగా గుర్తించడానికి చర్య తీసుకోవాలి. మండల పరిషత్ పాలన మెరుగవడానికి మండల పరిషత్‌కు సంబంధించిన ప్రజా ప్రతినిధులకు మరియు అధికార ప్రతినిధులకు మండల పరిషత్ నిర్వహించే అన్ని కార్యక్రమాలకు సంబంధించి సమగ్రమైన శిక్షణ ఇవ్వడానికి డివిజనల్, జిల్లా స్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి.



**జిల్లా పరిషత్ :** ప్రస్తుతం మన రాష్ట్రంలో 22 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా జిల్లా పరిషత్‌లకు 29 అంశాలకు సంబంధించిన నిధులు, విధులు, సిబ్బందిని సమకూర్చవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రస్తుతం ఈ 29 అంశాల బదలాయింపు గురించి కొంత చర్య తీసుకోబడినా, వాస్తవంగా అవి అమలులోకి రావడం లేదు. ప్రస్తుతం జిల్లా పరిషత్‌లకు తమ సొంత నిధుల ద్వారా కేవలం 0.68 మాత్రమే ఆదాయం చేకూర్చుకుంటున్నాయి. అద్దెల ద్వారా, మార్కెట్ ఫీజులు, ఫెర్రిస్ మరియు ఇతర ఆదాయాల ద్వారా ఈ ఆదాయం లభ్యమవుతోంది. మిగిలిన 99.32 శాతం జిల్లా పరిషత్‌కు వచ్చే ఆదాయం : 8 రూపాయల ప్రభుత్వ తలసరి గ్రాంట్లు, స్టాంపు డ్యూటీ మీద సర్‌ఛార్జి, భూమిశిస్తు, సీవరేజపై 50 శాతం, రేవు పాటలు 37.5 శాతం, జిల్లా పరిషత్ ఆస్తుల మీద వివిధ రకాల ఆదాయాలు. ప్రస్తుత లెక్కల ప్రకారం ప్రతి జిల్లా పరిషత్ యొక్క వార్షిక బడ్జెట్ 117.56 కోట్ల రూపాయలు ఉంటుంది. జిల్లా పరిషత్‌ల ద్వారా వివిధ శాఖలకు సంబంధించిన గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన కార్యక్రమాల్లో సుమారు రూ.100 కోట్ల వరకు అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి. జిల్లా పరిషత్ పరిధిలో కూడా జడ్.పి.టి.సి., ఎం.పి.టి.సి.లకు సరైన సమన్వయ విధానం లేక పరిపాలనా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కావున రీజనల్ మరియు రాష్ట్ర స్థాయిలో జడ్.పి.టి.సి. మెంబర్లకు మరియు సంబంధిత పరిధిలో గల అధికారులకు వారి బాధ్యతలకు సంబంధించి అవగాహన సదస్సులు నిర్వహించాలి.

పై పద్ధతుల ద్వారా స్థానిక సంస్థలలో గల ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎప్పటికప్పుడు స్థానిక సంస్థల ద్వారా చేపట్టే కార్యక్రమాలకు సంబంధించిన అవగాహన సదస్సులు, స్థానిక నిధుల సమీకరణ, తద్వారా ఆదాయం పెంపు మరియు సదరు స్థానిక సంస్థల పరిపాలనను క్షుణ్ణంగా పరిశీలించడానికి ప్రభుత్వం సరైన విధానం రూపొందించవలసిన బాధ్యత ఉంది. అంతేకాకుండా, నిధుల దుర్వినియోగం తగ్గించుకుని, ప్రజలకు మేలైన సేవలు అందించడానికి స్థానిక సంస్థలకు సరైన సహకారం అందించడం ద్వారా మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ఏర్పడడానికి అవకాశం ఉంటుంది.

**సి.ఎం.పి.**

# మానవ ధర్మం – విలువలు బోధనలో చేర్చాలి

**మన సమాజంలో అభివృద్ధితో పాటు కొన్ని లోపాలు చోటు చేసుకున్నాయి. వాటిలో ముఖ్యంగా మనం చేసే పనులలో కనీస విలువలను పాటించకపోవడం కరువైంది. ప్రతి వారు ఎన్నో చెబుతారు. పాటించరు. అంటే చెప్పట సులభమే కాని వాటిని ఆచరించడం కష్టం. అయినా ధర్మ సూత్రాలు, విలువలను మన పాఠశాల సిలబస్‌లోనే చేర్చాల్సిన అవసరం ఉంది. భారతీయ వ్యవస్థలో మన చుట్టూ చూసినట్లయితే ఎన్నో రకాలైన ఘోరాలు, నేరాలు జరుగుతున్నాయి. అయినా చాలా మంది మనకేందుకులే అని దాట వేస్తున్నారు. అవి పెరిగి చివరకు మనలనే రూపుమాపే స్థాయికి ఎదిగాయి.**

రాజకీయాల నుండి పోలీసు వరకు, సంఘసేవ నుండి క్రీడల వరకు, మందుల నుండి మేరేజ్ (వివాహం) వరకు సరియైన దారిలో నడవడం లేదు. వక్రమ మార్గం బట్టి మనిషిని నాశనం చేసే స్థాయికి చేరాయి. కనుక వాటిని ముఖ్యంగా హింసాప్రవృత్తి, కోరిక అదుపు లేకుండ మన సామాజిక వ్యవస్థను పీడించుకుతింటున్నాయి. ఈ నేపథ్యంలో మనిషిని సరియైన మార్గంలో పెట్టాలంటే విలువలతో కూడిన విద్య అవసరం. కనుక పాఠశాల విద్యనుండి ఎథిక్స్‌ను ఒక విషయంగా బోధించవలేనని అంతర్జాతీయ ఆత్యాత్మిక బోధకుడు ఆగాఖాన్ సూచించారు.

నైతిక ఆలోచనలను, సూత్రాలను పాఠశాల విద్యార్థుల మనస్సుల్లోకి చొప్పించెందుకు తగిన బోధన అవసరం ఉంది. మనం రోడ్డుపై "రెడ్‌లైట్" ను చూడగానే ఎందుకు ఆగాలి ? మనం ఎదుటివారు ఆపదలో నున్నప్పుడు ఎందుకు సహాయపడాలి ? అనే అంశాలకు సమాధానాలు పాఠశాలలో బోధించే అంశాలలో ఉండాలి. తద్వార నూతన మైండ్ ఆలోచనలను అందించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏ విధంగా చెబుతారో అట్లా ఆ పాఠశాలల్లోని టీచర్లు ఇది చేయాలి. దీని వలన సమాజానికి లాభం కలుగుతుందని చెబితే వారింటారు. కాని ఒకే రీతిలో టీచర్లు పాఠంలాగా చెబుతూ పోకుండ అకేషనల్‌గా ఎథికల్ విషయాలు చెబితే వారికి హత్తుకుంటుంది. ఎదుటి వారికి ఎందుకు సహాయం చేయాలి ? అంటే సమాధానం చెప్పలేని వారెందరో ఉన్నారు. కనుక వాటిని ప్రత్యామ్నాయ మార్గంను పిల్లలకు సూచించడం ద్వారా పిల్లలు నేర్చుకోగలుగుతారు.

నేడు సమాజంలో తల్లిదండ్రులు పిల్లలకు చెప్పెందెకు టైమ్ దొరకదు. గతంలో ఇంటిలో గ్రాండ్ ఫేరెంట్స్ ఉండి వారికి మోరల్స్ చెప్పేవారు. ఇప్పుడు అన్ని న్యూక్లియస్ కుటుంబాలు పిల్లలకు కథలు, సంఘటనలు గూర్చి చెప్పేవారు లేరు. ఏది నేర్చుకొన్న నేడు ఇంటర్‌నెట్, ఫేస్‌బుక్ ద్వారా తెలుసుకోవడం తప్ప వ్యక్తిగతంగా చెప్పడం కరువైంది. కనుక మౌకింగా వైవ్యక్తిక సంబంధాల ద్వారా పిల్లలకు మోరల్స్ చెప్పాలి.

కాని నేడు ప్రశ్న ఎథిక్స్ మంచి - చెడు మీద భావనలు (To some it has to do with feelings about with right or wrong) మరి కొందరికి అది మత నమ్మకాలు, మరికొందరికి న్యాయ సూత్రాలకు ఒదిగి ఉండడం లేద లోబడడం అని చెప్పచ్చు. మన సంఘం అంగీకరించే ప్రవర్తన, విలువలెనని చెప్పచ్చు. కాని దీనిని అందరు ఒప్పుకోకపోవచ్చు. అయిన అంగీకరిస్తారు. ఇప్పటికే పాఠశాలలో పిల్లల మీద ఎన్నో బరువులున్నాయి. వాటికి Ethics చేర్చడం ఎంత వరకు అవసరం విజ్ఞులు ఆలోచించాలి. సోక్రటీస్ "said that" unexamined life is not worth living" అంటారు.

అదే విధంగా స్కూలులో ఒక విషయం అబద్ధం, దొంగతనం, మోసం చేయడం అనేవాటిని గూర్చి చెప్పడం కాని వీటి గూర్చి చెప్పి కాలంను వ్యర్థం చేయడమేనని కొందరంటారు. కనుక పిల్లలు నూతన క్రియేటివిటీ ని అలవర్చుకోవాలి.

అదే విధంగా విలువలను గూర్చి చెప్పడం అవసరం లేదని కొందరంటారు. కాని పాఠశాలలో పిల్లలకు విలువలను గూర్చి చెప్పాలి. ఏమిటది ? అంటే అందరు అంగీకరించి చెప్పమన్నదే విలువలను Ethics గూర్చి చెప్పాలి. ఇందుకు తగిన టీచర్స్‌ను ఎంపిక చేయాలి. బెర్లోట్ బ్రెచ్ (Berlot Brech Growth first then ethics I say reading and arthometics first) అర్థ మెటిక్స్ చెప్పె టీచర్ ఎథిక్స్ గూర్చి చెబితే పిల్లలకు చేరుతుందని చెప్పవచ్చు.

మానవ విలువలు దిగజారుతున్న నేడు రాబోయే తరాలకు విలువల గురించి మంచి - చెడును గూర్చి చెప్పాల్సిన అవసరం నేటి తరం మీద ఉంది. ఆ పని మనందరి మీద ఉంది కాదంటారా ?

**- సి.ఎం.పి.**

# ఉమాపురం గ్రామ పంచాయతీ మరోసారి ఏకగ్రీవం

**మహబూబ్‌నగర్ జిల్లా - వంగూరు మండలంలోని గ్రామం ఉమాపురం. జిల్లాలో ఎవరికి తెలువనంతటి చిన్నగ్రామం. 1947 - 1949 ప్రాంతంలో దుందుభీ నదీ ప్రవాహానికి అడ్డకట్ట వేసి డిండీ ప్రాజెక్టును నిర్మించారు. అందులో మునిగిపోయిన గ్రామం ఉమాపురం. పునరావాసానికి నోచుకోక చాలా వెనుకబడి వుంది.**

1978 నుండి అభివృద్ధి వైపు అడుగులు వేయడం మొదలు పెట్టింది. సామాజిక సేవలో శ్రద్ధవున్న గ్రామ యువకుడు ఎం. సుధాకర్‌రావు తన గ్రామభివృద్ధిని చేయాలని నడుంబిగించాడు. గ్రామస్తులను, యువకులను, మహిళలను ఏకం చేశాడు. అందరు కలిసి రాత్రింబవళ్ళు కష్టపడి ముందుగ, పల్గు, పార, తట్టా, బుట్టా చేత బట్టి సమైక్యంగ కృషి చేసి రోడు నిర్మించుకున్నారు. ఫలితంగా 1979లో బస్సువచ్చి ఊరి ప్రజలను పలకరించింది. దీనితో, తాలుక, జిల్లా కేంద్రాలకు రాకపోకలకు మార్గం సుగమమైంది.

ఒక్కొక మెట్టు ఎక్కుతూ, విద్యుత్ అధికారుల సహకారంతో జరిగిన విధ్యుదీకరణతో గ్రామం క్రొత్త శోభను సంతరించుకున్నది.

1980లో ఈ గ్రామాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ అచ్చంపేట శాఖ వారు దత్తత తీసుకుని వ్యవసాయ రుణాలు ఇవ్వడంతో రైతుల జీవితాలలో క్రొత్త ఆశలు చిగురించాయి. రైతులకు తోడుగ, ప్రభుత్వం అనేక పథకాలను అమలు పర్చడంతో లబ్ధిదారుల జీవితాలు ప్రగతి బాట పట్టాయి.

కాలక్రమేణ గ్రామస్తుల కోరిక మేరకు గ్రామానికి ఇళ్ళ కోసం ప్లాట్లు, ప్లాట్లలో ఇల్లు కట్టుకొని సుఖ జీవనాన్ని సాగించడానికి ప్రభుత్వం చేపట్టిన గృహనిర్మాణ కార్యక్రమం అందర్ని ఆకట్టుకున్నది. గతంలో, మా గ్రామభివృద్ధికి కృషి చేసిన సర్పంచ్‌లు శ్రీ ఎన్. నిరంజన్, శ్రీ అయ్యన్న గౌడు, శ్రీమతి ఎం. శ్యామలమ్మ మధుసూధాన్‌రావులు చేపట్టిన రక్షిత మంచినీటి పథకం, వృద్ధాప్య పెన్షన్ పథకం, వీధి దీపాల నిర్వహణ, అక్షరాస్యత, ఆరోగ్య, పారిశుధ్య కార్యక్రమాలు, గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం - ఇలా ఎన్నో కార్యక్రమాలు వారి కార్యదక్షతను చాటి చెప్తున్నాయి.

1983వ సంవత్సరంలో టెలిఫోన్ అధికారులు టెలిఫోన్ సౌకర్యాన్ని అందించడంతో - మా పల్లె నుండి - డిల్లీ దాక మాట్లాడుకునే అవకాశం లభించింది అందరికి.

“చదువుంటేనే అన్నీ” అన్న ఆలోచనతో ఓ చక్కటి బడిని నిర్మించి పిల్లలకు చదువుకునే అవకాశం కల్పించడంతో వాళ్ళు మంచి పౌరులుగ తీర్చిదిద్దబడుతున్నారు.

గ్రామ పంచాయతీకి జరిగిన గత ఎన్నికల్లో (2006) ఈ ఊరు ఏకగ్రీవం కావడం విశేషమనుకుంటే, ఈ సారి (2013)లో కూడా ప్రజలంతా కలిసి ఏకగ్రీవానికి జై అన్నారు. రెండవ సారి కూడా ఏకగ్రీవమై సరికొత్త రికార్డును స్థాపించి పలువురి దృష్టిని ఆకర్షించింది. జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, ఉమాపురం గ్రామ ప్రజలను, ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ ఎం. సుధాకర్‌రావును అభినందించారు. దీనికి స్పందిస్తూ ఇది ప్రజల తీర్పన్నారు సుధాకర్ రావు.

ప్రభుత్వం అందించే అనేక పథకాల ద్వార లబ్ధి పొందుతూ, గ్రామాభివృద్ధిలో ప్రధానంగా యువత, యువకులను, గ్రామపెద్దలను, భాగస్వాములను చేస్తూ - వాళ్ళలో నవ చైతన్యాన్ని నింపి - ‘‘ఉమాపురం’’ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దాలని సంకల్పించారు. ఈ ప్రయత్నానికి ప్రభుత్వం అండగా వుంటుందని అందరు ఆశిస్తున్నారు. ఇంతవరకు ఊరికి తోడుగ వున్న, పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, జేడ్.పి. చేర్‌మెన్‌లు, జేడ్.పి.టి.సి.లను ఎం.పి.టి.సి. లను ఇతర శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

ప్రస్తుతం మా గ్రామానికి తొడుగ వుంటే ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న జాతీయ బ్యాంకు ‘‘ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు’’ వంగూరు మరియు రంగాపురం పి.ఎ.సి.ఎస్. ని ప్రజలందరు అభినందిస్తున్నారు.

రాబోయే రోజుల్లో అన్ని ప్రజాహిత సంస్థల సమన్వయంతో, ప్రజా సహకారంతో సాటిలేని మేటి గ్రామంగా “ఉమాపురం” నిలుస్తుందని ఆకాంక్షిద్దాం.

**- సి.ఎం.పి.**

# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల ఆధ్వర్యంలో మద్యపాన నిషేధం కొరకు ర్యాలీ

**ఖమ్మం జిల్లా, తిరుమలాయపాలెం మండలం, కొక్కిరేణి గ్రామంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని, కొక్కిరేణి గ్రామంలోని భారత్‌నిర్మాణ్ వాలంటీర్లు మహాత్మాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు.**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుమలాయపాలెం, మండలం తహసిల్దార్ శ్రీమతి విజయలక్ష్మి, ఎస్.ఐ. శ్రీ రఘువీరారెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ శ్రీ వెంకట్రామయ్య, డిటిఎం, శ్రీ సురేష్‌కుమార్ హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అయిన బెల్లం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అలాగే ఉప సర్పంచ్ శ్రీ చిర్ర వెంకమ్మ, వార్డు మెంబర్లు శ్రీ కల్లం వీరన్న, శ్రీ షేక్ సైదాబి, శ్రీ గుంతేటి వెంకటేశ్వర్లు, శ్రీమతి గుంతేటి వజ్రమ్మ, శ్రీ ఊడుగు ఉపేందర్, శ్రీమతి చావా కళ్యాణి, శ్రీమతి గంధం ప్రమీల, శ్రీ గంట క్రిష్ణయ్య, శ్రీ చావా రాజా, గ్రామస్థులు, భారత్‌నిర్మాణ్ వాలంటీర్లు, మాజీ ఎం.పి.పి. శ్రీ ఊడుగు రాములు పాల్గొన్నారు.

తహసిల్దార్ శ్రీమతి విజయలక్ష్మి మాట్లాడుతూ, గ్రామంలోని యువజనులు భారత్‌నిర్మాణ్ వాలంటీర్లుగా ఏర్పడి, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజల్ని చైతన్య పరచడం అభినందనీయం అని చెప్పారు, అలాగే ఎస్.ఐ శ్రీ రఘువీరారెడ్డి మాట్లాడుతూ, యువత ప్రజల్లో ప్రభుత్వ కార్యక్రమాల పట్ల అవగాహన కలిగించడానికి, స్వచ్ఛందంగా మంచి కార్యక్రమాలు చేయడానికి ఇదో మంచి వేదిక అని చెప్పారు. అలాగే గ్రామంలో మద్యపాన నిషేధం సంపూర్ణంగా అమల య్యేలా బి.ఎన్.వి.లు కృషి చేయాలి, దీనికి మా సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు.

గ్రామ సర్పంచ్ అయిన శ్రీ బెల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ, మన గ్రామంలో బి.ఎన్.వి.లు ఏర్పడి యువకులు ముందుకు రావడం సంతోషంగా ఉందని, అలాగే మన గ్రామంలో చాలా మంది మరుగుదొడ్లు కట్టించుకోలేదు, ముఖ్యంగా ఇప్పుడు మరుగుదొడ్లు చాలా అవసరం, దీనికి ప్రభుత్వం నుంచి రూ. 9000 సహాయం కూడా ఉంటుందని, కాబట్టి బి.ఎన్.వి.లు అందరూ దీని గురించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రతి కుటుంబం మరుగుదొడ్డి కట్టించుకొని, వాడుకునేలా ప్రోత్సహించాలన్నారు.

సభా కార్యక్రమం తరువాత మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమం గురించి గ్రామస్తులలో మంచి స్పందన వచ్చింది. అలాగే భారత్‌నిర్మాణ్ వాలంటీర్లు, గ్రామీణాభివృద్ధి శాఖ అందించే శిక్షణ కార్యక్రమాలకు హాజరయి, ప్రభుత్వ కార్యక్రమాల గురించి అవగాహన, అలాగే తమ నైపుణ్యాలను పెంచుకోవచ్చని చెప్పారు. అలాగే మహాత్మాగాంధీ ఆశయాలను నెరవేర్చడం మనందరి బాధ్యత అని చెప్పారు.

డిప్యూటీ తహసిల్దార్ శ్రీ వెంకట్రామయ్య మాట్లాడుతూ, "ఒకప్పుడు భారతదేశం సంస్కృతి, సంప్రదాయాలు, విలువలతో ప్రపంచంలోని గొప్ప దేశంగా ఉండేదని కాని ఇప్పుడు దేశంలో అవినీతి, నిరక్షరాస్యత, పేదరికం లాంటివి దేశాభివృద్ధికి అవరోధంగా ఉన్నాయని చెప్పారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్లు మంచి పనులతో ముందుకు రావడం ప్రశంసనీయం చెప్పారు.

ఖమ్మం జిల్లా డిటిఎం సురేష్‌కుమార్ మాట్లాడుతూ, కొక్కిరేణి గ్రామంలోని యువకులు భారత నిర్మాణ్ గురించి తెలుసుకొని,



హైదరాబాద్ అపార్డ్‌లోని జైపాల్‌రెడ్డి గారికి ఫోన్ చేసి, ఆ సార్ ద్వారా నా నెంబరు తెలుసుకొని, భారత్ నిర్మాణ్‌లో ఈ గ్రామం నుంచి ఇప్పటి వరకు 53 మంది, వాలంటీర్లు జాయిన్ అయ్యారని చెప్పారు. అలాగే ఇదే సందర్భంగా సర్పంచ్‌గారు కూడా ఇదే వేదికపై భారత్ నిర్మాణ్ పథకం ఉద్దేశం తెలుసుకొని, సంతోషంగా బి.ఎన్.వి.గా పనిచేయటానికి ముందుకు వచ్చారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో భారత్‌నిర్మాణ్ వాలంటీర్లు ముఖ్య భూమిక పోషించారు.

*-సురేష్‌కుమార్, డిటిఎం, ఖమ్మం*

# గ్రామ సభ గురించి కొన్ని ముఖ్య విషయాలు

**1. గ్రామపంచాయితీ వ్యవస్థలో 'గ్రామ సభ" ప్రాముఖ్యత తెలియజేయండి?**

- పంచాయితీరాజ్ చట్టంలోని 6వ సెక్షన్ గ్రామ సభ గురించి తెలియజేస్తుంది. 'గ్రామ సభ' అనేది ఒక సమావేశం కాదు. అది కూడ గ్రామపంచాయితీ, మండల ప్రజాపరిషత్‌ల వలె గ్రామపంచాయితీలోని ఓటర్లు అందరూ సభ్యులుగా ఉండే ఒక సంస్థ. చట్ట ప్రకారం గ్రామసభకు స్పష్టమైన అధికారాలు, విధులు ఇవ్వబడినాయి.
- గ్రామ పంచాయితీతో పాటు 'గ్రామ సభ' ఆవిర్భావమవుతుంది.

**2. గ్రామసభ సమావేశం సంవత్సరానికి కనీసం ఎన్ని సార్లు జరపాలి? అలా నిర్వహించకపోతే పర్యవసానం ఏమిటి?**

- సందర్భానుసారంగా గ్రామ సభ సమావేశం ఎన్నిసార్లు అయినా జరపవచ్చు.
- అయితే, నిబంధనల మేరకు సంవత్సరానికి ప్రభుత్వం నిర్ణయించిన తేదీలలో రెండు సార్లు జరపాలి. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14వ తేదీన, అక్టోబరు 3వ తేదీన విధిగా గ్రామ సభ సమావేశం నిర్వహించాలి. ముందస్తు ప్రణాళికతో, అర్థవంతంగా స్పష్టమైన ఎజండా ప్రకారం నిర్వహించాలి.
- గ్రామ సభ పై తేదీల ప్రకారం నిర్వహించకపోయినట్లయితే, తగు అవకాశం ఇచ్చి సర్పంచ్‌ని పదవి నుండి తొలగించడం జరుగుతుంది.

  (సెక్షన్ 20ఎ) (జి.ఓ.యం.ఎస్.నెం..367, తేది.28.08.98).

**3. 'గ్రామసభ' సభ్యులు ఎవరు? గ్రామసభ సమావేశానికి ఎవరు అధ్యక్షత వహిస్తారు? సమావేశానికి కోరం ఎంత?**

- గ్రామ పంచాయితీ ఓటర్ల జాబితాలో ఉన్న వయోజనులందరూ గ్రామసభ సభ్యులు. గ్రామసభ సమావేశానికి సర్పంచ్ అధ్యక్షత వహిస్తారు. సర్పంచ్ అందుబాటులో లేని పక్షంలో ఉప సర్పంచ్ అధ్యక్షత వహిస్తారు.
- గ్రామ సభ సమావేశాలకు 'కోరం' నిర్దేశించబడలేదు.

**4. గ్రామసభ సమావేశాల నిర్వహణకు పంచాయితి తీసుకొనవలసిన చర్యలేమిటి?**

- నిర్దేశించిన తేదీలలో (ఏప్రిల్ 14, అక్టోబరు 3) గ్రామ సభ సమావేశం నిర్వహించడానికి సంబంధిత డివిజనల్ పంచాయితీ అధికారి యం.పి.డి.ఓలతో సంప్రదించి ప్రతి గ్రామ పంచాయితీకి ఒక మండల స్థాయి అధికారిని కేటాయించాలి. సమావేశం తేదీకి వారం రోజులు ముందుగా ఈ కేటాయింపు జరగాలి.
- సమావేశం సూర్యోదయం ముందు సూర్యాస్తమయం తర్వాత జరపకూడదు.
- సమావేశం గురించి గ్రామ ప్రజలందరికీ విస్తృత ప్రచారం ద్వారా తెలియజేయాలి.
- గ్రామ పంచాయితీలో శివారు గ్రామాలున్నట్లయితే, రొటేషన్ పద్ధతిలో అన్ని గ్రామాలలోను గ్రామసభ సమావేశాలు జరపాలి.

**5. గ్రామ సభ సమావేశాలలో గ్రామ పంచాయితీ ప్రవేశపెట్టవలసిన అంశాలేమిటి?**

- గ్రామ సభ గ్రామ శాసన సభవంటిది. గ్రామ సభ సమావేశాలలో ప్రవేశపెట్టవలసిన అంశాలు:-
  1. గ్రామపంచాయితీ సాంవత్సరిక లెక్కలు, ఆడిట్ నివేదిక
  2. గత సంవత్సరపు పరిపాలనా నివేదిక.
  3. చేపట్టబోయే పనుల వివరాలు
  4. కొత్త పన్నులు వేయడానికి లేక ప్రస్తుతమున్న పన్నులు పెంచే ప్రతిపాదనలు.
  5. లబ్ధిదారుల ఎంపిక, పథకాలు నిర్మాణాలు చేపట్టే ప్రదేశం ఎంపిక చేసే ప్రతిపాదనలు.
  6. పంచాయితీ వ్యవసాయోత్పత్తుల ప్రణాళిక
  7. పంచాయితీకి దఖలు పడిన సామూహిక భూములు, పోరంబోకు భూముల వివరములు
  8. ఆడిట్ నివేదిక నకలు, బడ్జెట్‌నకలు
  9. పన్నుల బకాయిదారుల జాబితా

**6. గ్రామసభ సమావేశాల తీర్మానాల అమలులో గ్రామ పంచాయితీ బాధ్యత ఏమిటి?**

- చట్టంలో నిర్దేశించిన ప్రకారం గ్రామసభ సమావేశపు తీర్మానాల అమలుకు గ్రామ పంచాయితీ అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలి. గ్రామసభలో చేసిన సూచనలు పాటించడానికి చర్యలు తీసుకోవాలి.

**7. గ్రామసభ సమావేశం ఏర్పాటు చేయడానికి స్థానిక పౌరులు చొరవ తీసుకొనవచ్చా?**

- గ్రామపంచాయితీ ఓటర్లు 50 మంది లేక పంచాయితీలో 10% ఓటర్లు నిర్ణీత విషయ పరిశీలన కోసం గ్రామసభ సమావేశం ఏర్పాటు చేయమని ఐదురోజులు ముందుగా తేదీ, సమయం తెలియజేస్తూ నోటీసు ఇవ్వవచ్చు. సర్పంచ్ ఆ విధంగా గ్రామ సభ సమావేశం ఏర్పాటు చేయడానికి నిరాకరించినట్లయితే, నోటీసు జారీచేసిన సభ్యులే సమావేశం నిర్వహించి తీర్మానాలు చేయవచ్చు. (రూల్ 5 జి.ఓ.యం.యస్.నెం.367, తేది.28.8.98).

**8. ఇతర శాఖల ఏ ఏ అవసరాలకోసం గ్రామసభ సమావేశం నిర్వహించవలసి ఉంటుంది?**

- పంచాయితీ రాజ్ చట్టంలో నిర్దేశించిన మేరకే కాకుండా ఇతర శాఖల నియమ నిబంధనలకి అనుగుణంగా కూడా గ్రామసభ సమావేశం నిర్వహించవలసిన అవసరం ఉంటుంది. గ్రామస్థాయిలో ఆయా శాఖలకి సంబంధించిన విషయాలమీద అభిప్రాయ సేకరణకి, ఆమోదం కోసం గ్రామసభ సమావేశం ఏర్పాటు చేయవలసి ఉంటుంది.
  1. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు పరిశీలించి సవరణచేయడానికి
  2. భారీ పరిశ్రమలు, కర్మాగారాలు నెలకొల్పేముందు పబ్లిక్ హియరింగ్ కోసం
  3. వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం
  4. ఉపాధిహామీ పథకం క్రింద పనుల ఎంపిక, కూలీల బడ్జెట్ తయారీ తదితర నిర్ణయాల కోసం
  5. సామాజిక తనిఖీ నివేదికలు ప్రవేశపెట్టి అభిప్రాయసేకరణ కోసం

ఈ విధంగా గ్రామపంచాయితీ చట్టం క్రింద ఏర్పాటుచేయబడిన గ్రామసభ విస్తృత పరిధిలో పనిచేస్తుంది. ■

# గ్రామీణవ్యవస్థలో నూతన శకం

**బల్వంత్‌రాయ్ మెహతా సిఫారసులననుసరించి ఆంధ్రప్రదేశ్‌లో 1959 నవంబర్ 1న శ్రీ నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మూడంచెల పంచాయితీరాజ్ వ్యవస్థ ఏర్పడింది. గ్రామస్థాయిలో గ్రామపంచాయతీలు, తాలుకా స్థాయిలో పంచాయతీ సమితులు, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్తులు యీ వ్యవస్థకు అవయవాలు. దీనితో రాష్ట్రంలో యువ నాయకత్వం పైకి వచ్చింది. ఎంతో మంది ఉత్సాహవంతులైన యువకులు ఈ సంస్థల అధ్యక్ష పదవులకు ఎన్నికై ప్రగతికి నూతన బాటలు పరిచారు. వీరి కృషి ఫలితంగా గ్రామీణ వాతావరణమే మారి పోయింది. ప్రజలు శ్రమ దానాల ద్వారా వేలకొలది మైళ్ల రోడ్లు నిర్మించుకున్నారు. వందలాది పాఠశాలల భవనాలు నిర్మాణానికికొచ్చాయి. మారు మూలల గ్రామాలకు సైతం విద్యుచ్ఛక్తి సరఫరా లభించింది. రక్షితనీటి సౌకర్యాలు లభ్యమైనాయి. శాస్త్రీయ పరిజ్ఞానం పొంది రైతులు అధికోత్పత్తి సాధించారు. ఇతర సంక్షేమ పథకాలు ఎన్నో అమలులోకి వచ్చి బడుగు వర్గాల వారికి ఆర్థిక సహాయాన్ని చేకూర్చి పెట్టాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలలో మహత్తర పరివర్తన శకం పంచాయితీరాజ్‌తోనే మనరాష్ట్రంలో ప్రారంభమైంది.**

పంచాయితీరాజ్ సంస్థలు మొదటి ఐదేళ్ళకాలంలో సాధించిన ఫలితాలు ప్రజల దృష్టిని ఆకర్షించాయి. దేశ విదేశ ప్రముఖులు మన రాష్ట్రాన్ని సందర్శించి పంచాయతీరాజ్ సంస్థల వల్ల జరిగిన అభివృద్ధిని ప్రశంసించారు. ఈ రంగంలో ఇతర రాష్ట్రాలు మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకున్నాయి. అవినీతికి ఆస్కారంలేని పనులు జరిగాయి. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు డా.ఎం. చెన్నారెడ్డి ఈ సంస్థలకు సకాలంలో నిధులు విడుదల చేస్తూ వాటి అభివృద్ధికి తోడ్పడ్డారు. బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ సంస్థల అభివృద్ధి ఎడల ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఏతా-వాతా మనరాష్ట్రంలో తొలినాటి పంచాయితీ సంస్థలు ప్రగతికి సోపానాలు. రాజకీయాల ప్రవేశంతో ఇవి త్వరలోనే భ్రష్టు పట్టడం వేరే విషయం.

### ఎం.టి.రాజు నివేదిక

1964 నుంచి పంచాయితీరాజ్ సంస్థల్లో రాజకీయాల జోక్యం ఎక్కువ కావచ్చింది. దీనితో అభివృద్ధి నత్త నడకన నడిచింది. వీటి పరిశీలన కోసం 1967లో ఎం.టి.రాజు అధ్యక్షతన ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ చేసిన సూచనల్లో జిల్లా అభివృద్ధి బోర్డు రూపొందించిన పథకాలను జిల్లా పరిషత్తు అమలుకు పెట్టింది. ఈ బోర్డులు ముఖ్యంగా జిల్లాలోని వ్యవసాయం, నీటి పారుదల, పరిశ్రమలు, సహకారం, పంచాయితీరాజ్ శాఖలపై తమ దృష్టిని కేంద్రీకరించాయి. కలెక్టర్ పనిభారం పెరగడంతో రెవిన్యూ పాలనలో ఆయనకు సహాయకునిగా ఐ.ఏ.ఎస్. స్థాయి జిల్లా రెవిన్యూ అధికారి పదవిని సృష్టించారు.

సమితి కార్యకలాపాలను డివిజన్ స్థాయిలో రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ నిర్వహించారు. వీరు రూపొందించిన ప్రణాళికలు సమితి స్థాయి సమావేశాలో చర్చకు వచ్చేవి. ఆయా శాఖలకు చెందిన అధికారులు సమావేశాలలో పాల్గొని తమ శాఖకు చెందిన నివేదికలు సమర్పించేవారు. దీని వల్ల అభివృద్ధి పనుల్లో రాజకీయ ప్రాముఖ్యం తగ్గి అవసరం, వెనుకబాటు తనం ప్రగతికి ముఖ్యాంశాలైనాయి.

### వెంగళరావు కమిటీ

కార్యనిర్వహణలో ఎన్ని మార్పులు తెచ్చినా పంచాయితీరాజ్ సంస్థల్లో ప్రజల సహకారం మునుపటిలా కనిపించలేదు. దీని ఫలితంగా అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించడంలో కొంత జాప్యం జరుగుతూ వచ్చింది. ఈ లొసుగులను పరిశీలించడానికై కాంగ్రెస్ లెజెస్లేచర్ పార్టీ వెంగళరావు నాయకత్వంలో 1968లో ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ జిల్లా అభివృద్ధి బోర్డులను రద్దు చేయాలని సూచించింది. జిల్లా అభివృద్ధి బోర్డు అధికారులను జిల్లా పరిషత్తు మొదటిస్థాయి సంఘానికి అప్పగించాలన్న సిఫారసుకు ప్రభుత్వం అంగీకరించింది.

పంచాయతీరాజ్ సంస్థలకు సంబంధించిన నిబంధనలు, ఆర్థిక వనరులు మొదలైన ఇతర అంశాలను పరిశీలించి తగిన మార్పులు సూచించటానికి ప్రభుత్వం 1971లో నరసింహం కమిటీని నియమించింది. ఈ కమిటీ పంచాయితీరాజ్ సంస్థలకు సంబంధించిన నిర్మాణ విధానం, ఎన్నికల పరిపాలనా యంత్రాంగం, ఆర్థిక వనరులు మొదలైన విషయాలపై సమగ్ర పరిశీలన జరిపి 404 సిఫారసులతో కూడిన నివేదిక నొకటి ప్రభుత్వానికి సమర్పించింది. ముఖ్యంగా ఆర్థిక వనరులు, పరిపాలనా వ్యవస్థపై నరసింహం కమిటీ చేసిన పెక్కు సూచనలు ఆచరణ యోగ్యమైనవిగానే ఉన్నాయి.

నాలుగు సంవత్సరాలు అధికారంలో ఉన్న వెంగళరావు కానీ, అటు తర్వాత ముఖ్యమంత్రి అయిన డా. మర్రిచెన్నారెడ్డి కానీ పంచాయితీ రాజ్ సంస్థలకు ఎన్నికలు జరిపించలేకపోయారు.

1980లో11 సంవత్సరాల తర్వాత టి. అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పంచాయితీరాజ్ సంస్థలకు ఎన్నికలు జరిగాయి. 1981 వరకు వార్డు సభ్యులే గ్రామ సర్పంచ్‌ను ఎన్నుకునేవారు. దీనివలన అయిదేళ్ళ పదవీకాలంలో వార్డు సభ్యులను సంతృప్తి పరచడానికి సర్పంచులకు ఎక్కువ సమయం కేటాయించవలసి వచ్చేది. స్వల్ప వివాదాలతో సర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉండేది.

ఆ బెడద ఆనాటికి తప్పింది.

## మండల వ్యవస్థ - వినూత్న స్వరూపం

పంచాయితీరాజ్ వ్యవస్థ ఎన్నో సదుద్దేశాలతో, ఉన్నత లక్ష్యాలతో ప్రారంభించినా, అది తన లక్ష్యాలను సాధించడంలో విఫలమైంది. బ్యాంక్‌లు, గ్రామాలు, బ్లాకులు, జిల్లా పరిషత్తులకు సక్రమంగా సకాలంలో ఎన్నికలు నిర్వహించక పోవడం వల్ల ప్రజల ఆశలు, ఆకాంక్షలు తీర్చలేకపోయాయి. ఒకవేళ ఎన్నికలు జరిగినా ఆ సంస్థలు మాత్రం తమ విధులను నిర్వర్తించడంలోను, అనుకున్న ఫలితాలను సాధించడంలోను చేతికందనంత దూరంలో ఉండిపోయాయి.

ఈ దశలో రాష్ట్రంలో 1983లో తెలుగుదేశం పార్టీ అధికారంలో వచ్చింది. ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు పరిపాలన విధానం ప్రతిసామాన్య మానవుని గుడిసె ముంగిట నిలవాలనే ఉద్దేశంతో విప్లవాత్మకమైన మాండలిక రాజ్యాంగ విధానాన్ని ప్రణాళిక బద్ధం చేశారు.

వాస్తవంగా చెప్పాలంటే, అలవికాని విస్తీర్ణం గల పంచాయతీ సమితులు, తాలుకాలు సాధారణ గ్రామీణ అవసరాలను తీర్చడంలో వాటి పనిని అవి సక్రమంగా నిర్వహించలేకపోయాయి. ఈ కొత్త మాండలిక విధానంలో ప్రతి మండలం 35000 నుండి 55000 వేల వరకు జనాభా కలిగి ఉంటుంది. ఈ మాండలిక విధానం ప్రవేశ పెట్టడం వలన ఇంతకు ముందున్న జిల్లా పరిషత్తులు, జిల్లా ప్రజాపరిషత్తులుగా మారి పోయాయి.

దీని ప్రకారం మండల, జిల్లా పరిషత్తులకు అధ్యక్షుని ఎన్నికలు నేరుగా జరుగుతాయి. అంటే ఆయా మండల,జిల్లా పరిషత్తుల పరిధులలో గల ఓటర్లు ఆయా అధ్యక్షులను నేరుగా, స్వయంగా ఎన్నుకుంటారు. అంతేగాక పదవీ రాజకీయాలు అస్థిరత్వాన్ని సృష్టించకుండా ఉండేందుకు, స్థానిక స్వపరిపాలన సుస్థిరంగా నడిచేందుకు, ఫిరాయింపుదారుల, అసంతృప్తి వర్గ కార్యకలాపాలను అరికట్టేందుకు, అవినీతికి తావులేని స్వచ్ఛమైన పరిపాలన అందించడానికి పార్టీ ఫిరాయింపు నిరోధక శాసనంలోని నియమ నిబంధలను అధ్యక్ష పదవులకు ఎన్నికయ్యే వారికి కూడా వర్తింప చేయడం జరిగింది.

నూతనంగా ఏర్పడిన ఈ మండల వ్యవస్థలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తరగతులు, వెనుకబడిన వర్గాల వారికి, స్త్రీలకు రిజర్వేషన్లు కల్పించడం జరిగింది. మొత్తం జిల్లా పరిషత్తులు, మండల ప్రజా పరిషత్తుల అధ్యక్షుల సంఖ్యలో 15 శాతం షెడ్యూల్డు కులాలకు, 6 శాతం షెడ్యూల్డు తరగతులకు, 9 శాతం స్త్రీలకు, 20 శాతం వెనుకబడిన తరగతులకు కేటాయించటం జరిగింది.

ఈ కొత్త మాండలిక రాజ్యాంగ విధానానికి సంబంధించిన శాసనం 15-1-1987 నుండి అమలులోకి వచ్చింది. ప్రతి గ్రామీణానికి మండల ప్రధాన కేంద్రంలోనే సకల సదుపాయాలు, సౌకర్యాలు, సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఈ మండల వ్యవస్థను ప్రవేశపెట్టడం జరిగింది.

గ్రామ ప్రాంతాలలో గ్రామపంచాయితీ స్థాయిలో ప్రజలందరికీ అభివృద్ధిలో పాల్గొనే అవకాశం కల్పించడానికి గ్రామసభను ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామ సభ ప్రజాస్వామ్యీకరణ ప్రధాన సాధనంగా ఉద్దేశించబడింది. గ్రామస్థాయిలో ప్రజాస్వామ్య ప్రవృత్తిని పెంపు చేయడానికి, సామాజిక దృష్టిని పెంచడానికి, రాజకీయ చైతన్యాన్ని కలిగించడానికి పాలనా, రాజకీయ ప్రవృత్తులలో ప్రజలను విజ్ఞాన వంతులు చేయడానికి, బలహీనవర్గాల వారు తమ ప్రయోజనాలను కాపాడుకోవడానికి గ్రామసభ ఉపయోగపడుతుందని అశోక్‌మెహతా కమిటీ భావించింది.

దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలలో పంచాయితీరాజ్ సంస్థలలో గ్రామసభలు చట్టబద్ధమైన సంస్థలుగా ఏర్పాటు చేయబడ్డాయి. గ్రామసభ నిర్ణయాలు సలహాలు మాత్రమే అయినప్పటికీ, ప్రజలందరి చేత తీసుకోబడ్డ నిర్ణయాలు కాబట్టి, వాటిని గ్రామసభ తప్పనిసరిగా పాటిస్తుందని భావించవచ్చు. నిర్ణయాలు సమిష్టిగా చేయడం ప్రజా చైతన్యానికి దోహదం చేస్తుంది. కాని గ్రామ సభలు మన రాష్ట్రంలోనే కాదు, మరెక్కడా సమర్ధవంతంగా పని చేయటం లేదు. గ్రామ సభ కాగితం సంస్థగానే ఉంది.

## రాజ్యాంగం 73,74 సవరణ చట్టాలు

1985లో కాంగ్రెస్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ అనేక వేల మందిని సంప్రదించి, పంచాయతీరాజ్ మరియు నగరపాలక రాజ్యాంగ సవరణ బిల్లులను రూపొందించారు. ఇవి లోక్ సభ ఆమోదాన్ని పొందినా, అప్పటి రాజకీయ కారణాల చేత రాజ్యసభ ఆమోదం పొందలేదు. 1992 డిసెంబర్‌లో పి.వి. నరసింహారావు ప్రభుత్వంలో ఈ బిల్లులు పార్లమెంట్‌లో ఏకగ్రీవ ఆమోదం పొందాయి. ఇవే రాజ్యాంగం 73, 74 సవరణ చట్టాలు. పంచాయతీల వికేంద్రీకరణకు చెందిన 73వ సవరణ ద్వారా అనేక మార్పులు వచ్చాయి.

- ఈ చట్టం ద్వారా పంచాయితీరాజ్ నిర్మాణంలో దేశమంతటా సహ రూపత తేవడం జరుగుతుంది.
- జిల్లా పంచాయితీ, మధ్యస్థాయి పంచాయితీ, గ్రామస్థాయి పంచాయితీలలో మొదటి రెండు స్థాయిల చైర్మన్లను పంచాయితీ ప్రతినిధులు ఎన్నుకుంటారు. గ్రామపంచాయితీ సర్పంచ్‌ని మాత్రం ప్రత్యక్షంగా లేక పరోక్షంగా ఎన్నుకోవచ్చు.
- మూడింట ఒక వంతు స్త్రీలకు, జనాభా ప్రకారం హరిజనులకు, గిరిజనులకు రిజర్వేషన్లు ఉంటాయి.

రాజ్యాంగ సవరణల చట్టం ప్రకారం, అనేక పనులు రాష్ట్రాలు క్రమం తప్పకుండా చేయవలసి ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలకు, ఇవన్నీ అమలుకాకుండా చేయటానికి ఇంకా అనేక అధికారాలు ఉన్నాయి. ఎన్నికలు, అధికారాలు, రిజర్వేషన్లు, ఆర్థిక పనులు, సిబ్బంది నియామకం మొదలైనవి రాష్ట్రపాలనా యంత్రాంగం తోడ్పాటుతోనే జరగటానికి వీలుంది. పంచాయతీ సంస్థల అభివృద్ధిలో రాష్ట్ర ముఖ్యమంత్రులది ఎంతో గణనీయమైన పాత్ర.

ఈ ఎన్నికలలో సర్పంచ్ పదవులు తప్ప మిగిలిన రెండు (మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ అధ్యక్షులు) పదవులకు పరోక్ష పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయి.

ఇది ప్రజాస్వామ్య పద్ధతికి వ్యతిరేకం. ప్రజల చేత ఎన్నికైన అభ్యర్థులను కొనివేయడానికి, లేదా వారిని లొంగదీసుకోడానికి అర్థబలం, అంగబలం కలవారికి అవకాశం ఇచ్చినట్లయింది. ప్రజలచే ఎన్నుకోబడిన సర్పంచ్‌కు మండల పరిషత్‌లో ఆహ్వానపాత్ర, జిల్లా పరిషత్తులో మండల అధ్యక్షునికి ఆహ్వానపాత్ర ఇవ్వడాని బట్టి చూస్తే, మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో మరో రెండంచెలు - అంటే మండల ప్రజా పరిషత్తు ప్రాదేశిక నియోజక వర్గాలు, జిల్లా పరిషత్తు ప్రాదేశిక వర్గాలు కృత్రిమంగా సృష్టించి ఆచరణలో దీన్ని అయిదంచెల వ్యవస్థగా మార్చినట్లయింది.

ఈ పథకం వలన రాజకీయ పదవులు ఎక్కువ మందికీ కల్పించవచ్చు. రాజకీయ నిరుద్యోగం కొంతవరకు తీర్చవచ్చు. కాని ఎవరికి ఎవరు బాధ్యులో, వివిధ స్థాయిలలో జరిగే కార్యక్రమాలలో ప్రజలకు ఎవరు జవాబుదారీయో తెలియదు. ఎవరికీ వారే యమునా తీరే అన్న చందంగా ఒక అంతస్థుపై మరొక అంతస్థు, పెత్తనాలు చేయడానికి, కక్షలు, కార్పణ్యాలు సాధించడానికి ఉపయోగించుకోవడం జరుగుతుంది. రిజర్వేషన్లతో వచ్చిన మార్పుల వల్ల బి.సిల.కు 34 శాతం, ఎస్సీలకు 17.61 శాతం, ఎస్టీలకు 7.8 శాతం అన్ని తరగతుల్లో మహిళలకు 33 శాతం ఇవి వర్తిస్తాయి.

1995 గ్రామపంచాయతీ ఎన్నికలు రాజకీయ రంగంలో వినూత్నమైన మార్పులను తీసుకొచ్చాయి. ప్రభుత్వం అమలు పరచిన రిజర్వేషన్ల విధానం అనేకమంది కాకలు తీరిన రాజకీయ యోధులకు శరాఘాతంలా తగిలి వారు కనుమరుగు కావలసిన పరిస్థితులు దాపురించాయి. ఆ నేపథ్యంలో జిల్లాలో ఏ మాత్రం పలుకు బడి లేకుండా ముక్కూ మొహం తెలియని వ్యక్తులు రాజకీయ అవతరాలను దాల్చి ఎన్నికల బరిలో దిగారు. దీనితో గ్రామీణ రాజకీయ రంగంలో కొత్త తరానికి నాంది పలికినట్లయింది. సంవత్సరాల తరబడి గ్రామాలను ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలిన మాజీ సర్పంచ్‌లు ఎందరో ఈ రిజర్వేషన్ల పుణ్యమా అని ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కోల్పోయారు. రిజర్వేషన్ల కారణంగా గ్రామీణ రాజకీయాలలో కొత్త వారికి అవకాశాలు లభించాయి. ఏమాత్రం రాజకీయ పరిజ్ఞానం లేని వారు సర్పంచ్‌లు, వార్డు సభ్యులైపోయారు. ఈ వినూత్న పరిస్థితి గ్రామీణ రాజకీయాలలో యువతరాన్ని సృష్టించింది. రేపటి నాయకత్వానికి వారు వారసులు.

**- జి. వెంకట రామారావు,** విశ్రాంత లెక్చరర్, ప్రభుత్వ కళాశాల, హైదరాబాద్

# పలుకే బంగారం

**చక్కగా మాట్లాడటం ఒక కళ. కళే కాదు వరం కూడా. అయితే 'కళ' అసాధ్యం కాదు. ప్రయత్నిస్తే సులభమే. మాటతీరులో మనిషి వ్యక్తిత్వం ఉంటుంది. సంస్కారం పరిమళిస్తుంది. ఎన్ని భాషలు మాట్లాడగలమన్నది కాదు ప్రశ్న. మనసుకి హత్తుకొనేలా, మళ్ళీ మళ్ళీ మాట్లాడితే వినాలనిపించేలా భాషించటమే గొప్ప. ఈ కళ ఉంటే అసాధ్యమైన కార్యం అర చేత వాలుతుంది. కఠిన పాషాణ హృదయాలు సైతం కరిగిపోతాయి. మాటకు అంత శక్తి ఉంది.**

మృదువైన మాటలు, ప్రేమని కురిపించే మాటల వల్ల మిత్రులు పెరుగుతారు. పరుషంగా మాట్లాడితే శత్రువులు పెరుగుతారు. అందుకే నన్నయ మహాభారతంలో 'భూరిగుణోన్నతులన్న ద్రగు వాదికి ధీరులకు, ధరణి వల్లభులకు వాక్పారుష్యము చన్నె!' అంటాడు.

ఉత్తములకు ఉత్తమత్వం, మహాత్ములకు గొప్పతనం తెచ్చి పెట్టేది వారి మృదుభాషణమే. ఇది దేశ, కాల, ప్రాంతాలకూ, సమయ సందర్భాలకూ తగినట్లుగా ఉండాలి. ఎంత గొప్ప స్థాయిలో ఉన్న వారైనా హాయిగా, సౌమ్యంగా మాట్లాడడాన్ని అలవాటు చేసుకోవాలి. అధికంగా, అసందర్భంగా, అహంకారపూరితంగా మాట్లాడం అనర్థాల్ని కలిగిస్తుంది. దీనికెన్నో ఉదాహరణలున్నాయి. అంబరీషుణ్ణి నానామాటలన్నాడు దుర్వాసమహర్షి. ఏమైంది? చివరికి సుదర్శన చక్రం చేతిలో భంగపడక తప్పలేదు. ముందు వెనుకా ఆలోచించకుండా నలుగురిలో కృష్ణుడిపై నోరు చేసుకొన్నాడు శిశుపాలుడు. అతడికీ నాశనం తప్పలేదు.

ఒక్కసారి నోరు జారితే... మళ్ళీ వెనక్కి తీసుకోవటం కష్టం. కష్టం కలిగించే అంశమైనా మృదువుగా చెప్పడంలోనే ఎక్కువ ప్రయోజనం ఉంది. అలాగే మాటతీరు వ్యక్తిని బట్టి కూడా ఉంటుంది. ఒక వ్యక్తికి ఏ పద్ధతిలో చెప్తే నచ్చుతుందో ఆ పద్ధతిలో చెప్పటం కార్య సాధకుల లక్షణం. ఏ పనీ చేయని ఒక భర్తకి భార్య ఎంత మృదువుగా కర్తవ్యబోధ చేస్తోందో చూడండి.

'ద్వంద్వో ద్విగురసి చాహం
మద్గేహే నిత్య మవ్యయీ భావః
తత్పురుష! కార్మధారయ
యే నా2హం స్యాం బహువ్రీహిః

భర్త వ్యాకరణ వేత్త, కానీ సోమరి. పని చెయ్యడు. అందుకే వ్యాకరణపరిభాషలో 'మనమిద్దరం ద్వంద్వ సమాసంలాంటి వాళ్ళం, దంపతులం, మనకి రెండు ఆవులున్నాయి. (ద్విగు=రెండు ఆవులు కల). అయినా మన ఇంట్లో రోజూ వ్యయం చేయడానికి ఏమీ లేదు. అదే అవ్యయీ భావం. కాబట్టి ఓ పురుషుడా (తత్పురుష). కర్మధారయ. అంటే పని చెయ్యి. దాని వల్ల నేను బహువ్రీహి అవుతాను. అంటే పంటలు బాగా పండించి ధాన్యవంతులమవుదాం' అని చెప్పింది. కొంచెం చమత్కారం, కర్తవ్యబోధ కలిసిన ఈ పలుకులు ఎవరికి రుచించవు చెప్పండి? కాబట్టి మాటకో, మంత్రానికి ఉండేంత శక్తి ఉంది. తెలిసి దానిని చక్కగా ఉపయోగించుకొంటే సద్గతి, తెలిసో తెలియకో ఉపయోగించుకోలేక పోతే అనర్థాలు తప్పవు. తస్మాత్ జాగ్రత్త.


**- అద్దంకి శ్రీనివాస్.**

# భారతీయ దార్శనికుడు స్వామి వివేకానంద

**స్వామి వివేకానంద భారతీయ తత్వవేత్తలలో ప్రపంచ వ్యాప్తంగా పేరెన్నికగన్న ప్రముఖుడు. ఆయన అధ్యాత్మిక బోధనలు నేడు ప్రపంచ మానవాళికి మార్గదర్శకంగా ఉన్నాయి. 1863 జనవరి 12న మకర సంక్రాంతి పర్వదినాన బెంగాల్‌లోని కలకత్తాలో విశ్వనాథ్ దత్-భువనేశ్వరి దేవి పుణ్య దంపతులకు జన్మించారు. ఆయనకు తల్లితండ్రులు పెట్టిన పేరు నరేంద్రనాథ్ దత్.**

సనాతన హిందూ సాంప్రదాయానికి చిరునామాగా ఉన్న కాయస్త కుటుంబంలో నరేంద్రనాథ్ జన్మించారు. ఆయన తండ్రి విశ్వనాథ్ దత్ కలకత్తా హైకోర్టుకు అటార్నీగా పనిచేశారు. ఆయన తాతగారు దుర్గాచరణ దత్. ఆయన సంస్కృతం, పర్షియన్ భాషల్లో దిట్ట. నరేంద్రుడు చిన్నతనం నుంచి శివపురాణం, రామాయణం, భారతం, భాగవతంపై ఎక్కువ మక్కువ పెట్టుకొని వాటిని చదివారు. బాల్యం నుండి సాధువులన్నా, మత గురువులన్నా ఎనలేని అభిమానంతో ఉండి వారి సహచర్యాన్ని కోరుకునేవారు. ఆయన తల్లి తన కుమారుని అల్లరి తగ్గించమని రోజూ శివుడిని పూజించేది. నరేంద్రుని బాల్యం అంతా కలకత్తా మహానగరంలో గడిచింది.

ఆయన 1871లో ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్ మెట్రోపాలిటన్ సంస్థలో విద్యను అభ్యసించారు. అనంతరం ఆయన కుటుంబం 1877లో రాయ్‌పూర్‌కు మారడంతో, అక్కడ తన చదువును



కొనసాగించాడు. 1879లో తిరిగి కలకత్తా రావడంతో ప్రెసిడెన్సీ కళాశాలలో చేరి ప్రథముడిగా ఉత్తీర్ణత సాధించారు.

నరేంద్రుడు బాల్యం నుండి ఏకసంథాగ్రాహి, అనేక తత్వ గ్రంథాలను, మత గ్రంథాలను, చరిత్రను చదివాడు. అంతేకాకుండా సైన్సు, సోషల్, హిందూ సంస్కృతి, ఉపనిషత్తులు ఔపోశన చేశారు. భారతీయ శాస్త్రీయ సంగీతం, క్రీడలు వంటి వాటిపై కూడా కళాశాలలో చదివే రోజుల్లో ఆసక్తిని కనబరిచారు. ఐరోపా దేశాలు, వాటి చరిత్ర, విదేశీ తత్వశాస్త్రం అభ్యసించారు.

1881లో బి.ఏ. పాసయ్యారు. విదేశీ రచయితల ప్రభావం కూడా ఆయనపై పడింది. భారతీయ సంస్కృతి, సాహిత్యాన్ని ఆయన బెంగాల్ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. బ్రహ్మసమాజం అధినేత దేవేంద్రనాథ్ ఠాగూర్‌ను ఆయన కలుసుకొని 'మీరు భగవంతుడ్ని చూశారా?' అని ప్రత్యక్షంగా అడగడంతో ఆయన ఆశ్చర్యపోయారు. ఆయన ఆ సందర్భంలో, 'నాయనా నీ కళ్లు ఒక మహా యోగిపుంగవుని మాదిరిగా ఉన్నాయి. నీవు భవిష్యత్‌లో గొప్ప యోగివి కాగల'వని దీవించారట.

అనంతరం రామకృష్ణుడును తన గురువుగా భావించిన నరేంద్రుడు పలు సందర్భాలలో ఆయనను భగవంతుడిని గురించి పలు ప్రశ్నలు అడగంతో, ఆయన సందేహాలను నివృత్తి చేశారు. దాంతో ఆయన జీవితం మారిపోయింది. నిర్వికల్ప సమాధి గురించి ఆయనకు బోధించారు. నిరంతరం భగవంతుని ధ్యానంలో ఆయన మునిగిపోయేవారు.

1886 ఆగస్టు 16న తన గురుదేవుడు రామకృష్ణ పరమహంస మహానిర్యాణం చెందడంతో, నరేంద్రుడు రామకృష్ణ మఠాన్ని స్థాపించారు. అనంతరం సన్యాసం తీసుకొని స్వామి వివేకానందగా మారారు. తెల్లవారుజామున మూడు గంటలకు లేచి ఆయన జపం, తపం చేసుకొని గొప్ప అధ్యాత్మిక శక్తిని సంపాదించారు. కమండలం, భగవత్ గీతను ఎల్లవేళలా తన దగ్గర ఉంచుకొని పర్యటనలు చేసేవారు. ఐదు సంవత్సరాల పాటు దేశమంతటా పాదయాత్ర చేశారు. ఈ కాలంలో ఆయన దేశంలో అనేక పుణ్యక్షేత్రాలను తిరిగి వాటిని సందర్శించారు. సాధుపుంగవులతో కలసి వారితో అనేక అధ్యాత్మిక విషయాలు చర్చించేవారు.

దేశంలో ఉన్న భిన్న సంస్కృతులను అధ్యయనం చేశారు. అన్ని మతాల సారాంశం ఒక్కటే అని ప్రచారం చేశారు. నిరుపేదల అభ్యున్నతికి ఆయన పాటుపడ్డారు. భగవంతుడు ఒక్కరే అని, ఆయనే విభిన్న రూపాలలో ఉన్నారని ప్రజలకు వివరించారు. అనేక మత పెద్దలను కలుసుకొని వారితో అధ్యాత్మిక చర్చలు జరిపేవారు. దేశంలో అన్ని పుణ్యక్షేత్రాలను సందర్శించిన తరువాత ఆయన హిమాలయాలలో కొంత కాలం తపస్సు చేశారు.

విదేశాలలో ఆయన పర్యటించినపుడు భారతదేశ సంస్కృతిని అక్కడ ప్రజలకు వివరించే వారు. జపాన్ లోని నాగసాకి, కోబ్, యాకోహోమా, ఒకాసా, క్యోటో, టోక్యో వంటి నగరాలను పర్యటించారు. చైనా, కెనడా

## విన్నపం

నేను ఒక కెరటాన్ని అడిగాను
నువ్వు సముద్రం దగ్గర వదిలిపెట్టావు
శిఖరం చూడాలనుకున్నాను
నువ్వు లోయను చూపించావు
ప్రేమను ఆశించాను
నువ్వు మోసమెలా వుంటుందో చూపించావు
పక్షిలా ఎగరాలనుకున్నాను
రెక్కలనే విరిచే ప్రయత్నం చేశావు
అయితే –
ఓడిపోవడం జరగదు
దూరమేకావచ్చు
కష్టమే కనబడొచ్చు –
కెరటం నాకు దొరుకుతుంది
శిఖరం చేరే పట్టుదల నాకుంది
రెక్కల్లోకి బలాన్ని
గుండెలోకి ధైర్యాన్ని
నింపుకుని... పక్షిలా ఎగురుతాను
ఎగిరేముందు ఒక్కమాట నీకు –
"లోకంలో ప్రేమ లేకుండా చేయకు
గుండెకాయలతో జూదమాడకు"

*– మంత్రవాది మహేశ్వర్*

వంటి దేశాలు, ఆమెరికా సంయుక్త రాష్ట్రాలలో పర్యటించి భారత దేశ వైభవాన్ని వారికి చాటి చెప్పడం జరిగింది. 1893లో చికాగోలో పర్యటించినపుడు అయనను ఎవ్వరూ ఆదరించలేదు.

చికాగోలో జరిగిన ప్రపంచ అధ్యాత్మిక సదస్సులో అయన ప్రసంగించారు. తన ప్రసంగం ప్రారంభించగానే ఆయన అమెరికా 'సోదర, సోదరీమణులారా' అని మొదలు పెట్టినపుడు ఆమెరికా ప్రజలు ఆయనను గుర్తించి ఆయన ప్రసంగానికి అసాంతం చప్పట్లు కొట్టారు.

భారతదేశంలో ఉన్న వేద ధర్మాలు వివరించడమే కాకుండా, తన దేశంలో ఉన్న సనాతన ధర్మాన్ని ఆయన తన ప్రసంగంలో వివరించారు. న్యూయార్క్‌లోని పత్రికలు స్వామి వివేకానంద గురించి ఎంతగానో ప్రస్తుతించాయి. చిన్న వయస్సులో ఆయన సన్యసించి ఎన్నో ఆధ్యాత్మిక విషయాలు మనకు వివరించాయని తెలిపాయి. ప్రపంచంలో ఆయనకు ఎవ్వరూ సాటి లేరని ఆయన గొప్ప ఆధ్యాత్మిక వేత్త అని పొగిడాయి.

1893 సెప్టెంబరు 27 వరకూ ఈ ఆధ్యాత్మిక సమావేశాలు జరిగాయి. అమెరికా, ఇంగ్లాండ్ దేశాలకు చెందిన వారు నాటి వివేకానందుని ఆధ్యాత్మిక ఉపన్యాసాలను ఇప్పటికి కూడా నెమరువేసుకుంటున్నారంటే అతిశయోక్తి కాదు. దాదాపు రెండు సంవత్సరాల పాటు వివిధ దేశాలలో స్వామి వివేకానంద ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇవ్వడం జరిగింది. డెట్రాయిట్, బోస్టన్, న్యూయార్క్‌లలో ఆత్మ గురించి, ఆత్మ చనిపోయిన తరువాత ఏం చేస్తుందనే విషయాలు నాడు వివరించడంతో అమెరికన్లు ఆనాటి నుండే ఆత్మలు ఉన్నాయని భావించారు.


న్యూయార్క్‌లో ఆయన 1894లో వేదాంత సొసైటీ ఆఫ్ న్యూయార్క్ స్థాపించారు. అప్పటికే తన ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉండడంతో తన ప్రసంగాలను నిలిపివేశారు. యోగా, వేదాంతాల గురించి ఆయన ప్రత్యేకంగా క్లాసులు నిర్వహించేవారు.

1895 జూన్ నెలలో రెండు నెలలపాటు ఆయన న్యూయార్క్‌లోని థౌజండ్ ఐలాండ్ పార్కులో ఆధ్యాత్మిక శిక్షణను ఇచ్చారు. అదే ఏడాది ఆయన ఇంగ్లాండ్‌లో పర్యటించారు. 1895 నవంబర్ నెలలో బ్రిటీష్ మహారాణి మార్గరెట్ ఎలిజబెత్‌ను సందర్శించారు. అదే విధంగా ఐరిష్ మహారాణిను కలుసుకున్నారు. ఐరిష్‌లో ఒక యువతి ఈయన పర్యటన అనంతరం సిస్టర్ నివేదితగా తన పేరు మార్చుకొని భారతదేశంలో స్థిరపడ్డారు.

1896 మే నెలలో తిరిగి ఇంగ్లాండ్‌లో పర్యటించి ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ ప్రముఖుడు మాక్స్‌ముల్లర్‌ను కలుసుకొని రామకృష్ణుని జీవిత చరిత్రను ఇంగ్లీషులోకి అనువదించారు. తన ఆరోగ్యం రాను రాను క్షీణించడంతో ఆయన విదేశీ పర్యటనలు మానుకొని చివరి దశలో భారతదేశం వచ్చారు.

1902 జులై 4న ఆయన ప్రాత:కాలంలో నిద్రలేచి, మూడు గంటల సేపు మెడిటేషన్ చేశారు. అనంతరం ఆయన శుక్ల, యజుర్వేదాలను, సంస్కృత గ్రంథాలను పఠించారు. ఆ రోజు ఆయన తన శిష్యులకు రామకృష్ణ మఠంలో వైదిక కళాశాలను స్థాపించాలని కోరారు. రాత్రి ఏడు గంటలకు తన గదికి వెళ్లి తాను విశ్రాంతి తీసుకుంటున్నానని, తనను ఎవ్వరూ ఇబ్బంది పెట్టవద్దని తన శిష్యులను కోరారు. రాత్రి 8 గంటల 50 నిమిషాలకు ఆయన మహాసమాధిని పొందారు. నాలుగు పదులు నిండకుండానే ఆయన మహాసమాధి పొందారు.

*– సి.ఎం.పి.*



# పందిరి తీగ కూరగాయలు పెంచటం రైతులకు లాభదాయకం

**మన రాష్ట్రంలో సాగుచేస్తున్న ముఖ్యమైన పందిరి కూరగాయలలో అనపకాయ, గుమ్మడికాయ,కాకరకాయ, దోసకాయ, బూడిద గుమ్మడికాయలు ప్రసిద్ధి చెందినవి.**

### వాతావరణం- నేలలు

ఈ పంటలన్నింటికీ వేడి వాతావరణం అనుకూలమైనది. నీరు నిలువని తేలికపాటి నేలలు అధిక దిగుబడులను పొందటానికి అనువైనవి.

### మేలు రకాలు

1. బూడిద గుమ్మడి : ఎపిఎయు శక్తి, కో-1, కో-2

2. గుమ్మడి : ఆర్కా సూర్యముఖి, అర్కా చందన్, కో-1, కో-2

3. అనపకాయ : పూసా సమ్మర్ ప్రాలిపిక్‌లాంగా, పూసా సమ్మర్ ప్రాలిపిక్ రౌండ్, పూసా మంజరి (హైబ్రీడ్), పూసా మేఘదూత్ (హైబ్రీడ్), ఆర్క బహర్, ఎపిఎయూ ఎల్ ఎస్ 21 (రాజేంద్ర, వరద్ (మహికోహైబ్రీడ్).

4. కాకర కాయ : పూసాదోమౌసమి, కోయం బత్తూర్‌లాంగా, అర్కహరల్, పూసావివేక్, వికే 1 - ప్రియ.

5. బీరకాయ

జగిత్యాల లాంగ్, పూసానజ్దార్, కో-1,

పండు దోస : ఎపిఎయు యం.సి -13 (జ్యోతిర్మయి)

కూరదోస : ఎ.ఎం, లి - 43 (కిరణ్మయి)

పచ్చ దోస : జపనీస్‌లాంగా గ్రీన్, స్ట్రైట్ ఎయిట్, పూసా సన్యోగా (ఎఫ్1 హైబ్రీడ్).

6 పొట్లకాయ : ఎపిఎయూ శ్వేత, కో-1 (మిగిలిన పందిరి కూరగాయలలో ప్రాంతీయ రకాలు ఉపయోగిస్తారు.

### విత్తనం - విత్తు పద్ధతి

భూమి మీద పాకించే పాదులకు వర్షాకాలంలో నీటి కాలువలకు తోడుగా మురుగు నీరు పోవటానికి వీలుగా 2మీ. దూరంలో పొలం అంతా కాలువలు చేయాలి. ఈ విధంగా చేయటం వలన ఎక్కువగా ఉన్న నీరు కాల్వల ద్వారా వెలుపలికి పోతుంది.

### విత్తే దూరం :

*1. బీర :* పంటను మే - జూన్ మరియు డిసెంబర్ -జనవరిలో పండించ వచ్చును. పాదుల మధ్య దూరం 0.60-0.90 మీటర్లు నాండవలెను. మొక్కల మధ్య దూరం 1.2-2.0 మీటర్లు.

*2. కాకర :* ఈ పంటను జూన్-జూలై మరియు డిసెంబర్-జనవరి మాసంలో పండించవచ్చును. మొక్కకు మొక్కకు మధ్య దూరం 1.2 నుండి 2.0 ఉండేటట్లు విత్తాలి. పాదుకు, పాదుకు మధ్య 0.60 నుండి 0.90 మీటర్లు ఉండాలి.

*3. దోస :* ఈ పంట జూన్-జూలై, డిసెంబర్-జనవరి నెలల్లో పండించవచ్చును. మొక్కకు, మొక్కకు మధ్య దూరం 1.0 నుండి 1.5 మీటర్లు, పాదుకు, పాదుకు మధ్య 0.75 నుండి 0.90 మీటర్లు ఉండాలి.



*4. గుమ్మడి :* ఈ పంట మే-జూన్ మరియు డిసెంబర్- జనవరి లో పండించవచ్చును. మొక్కకు మొక్కకు మధ్య దూరం 3.0 మీటర్లు పాదుకు, పాదుకు మధ్య 0.75 నుండి 0.90 ఉండేటట్లు చూడాలి.

*5. అనప :* ఈ పంట మే-జూన్, డిసెంబర్ - జనవరి నెలల్లో పండించవచ్చును. మొక్కకు, మొక్కకు మధ్య దూరం 3.0 మీటర్లు, పాదుకు, పాదుకు మధ్య 0.75 నుండి 0.90 మీటరుఉండేటట్లు చూడాలి.

*6. బూడిద గుమ్మడి :* ఈ పంట జూన్-జూలై, డిసెంబర్-జనవరి నెలల్లో పండించవచ్చును. మొక్కకు మొక్కకు, మధ్య దూరం 3.0 మీటర్లు, మరియు పాదుకు, పాదుకు మధ్య 0.75 నుండి 0.90 ఉండేటట్లు చూడాలి.

*7. పొట్ల :* ఈ పంట మే -జూలై, డిసెంబర్ -జనవరి నెలల్లో పండించవచ్చును. మొక్కకు మొక్కకు మధ్య దూరం 1.5 నుండి 1.8 మీటర్లు, పాదుకు, పాదుకు మధ్య దూరం 1.50 నుండి 1.80 మీటర్లు ఉండేటట్లు చూడాలి.

*8. దొండ :* (పందిరి ఎక్కించాలి) ఈ పంట మే - జూలై, డిసెంబర్ - జనవరి నెలల్లో పండించవలెను. మొక్కకు, మొక్కకు మధ్య దూరం 1.5 నుండి 2.0 మీటర్లు, పాదుకు పాదుకు మధ్య దూరం 1.0 నుండి 1.50 మీటర్లు ఉండాలి.



అన్ని రకాల పాదులకు 3-5 విత్తనాలను, 45 X 45 X 45 సెం.మీ లోతు తీసిన గుంతలో 1-2 సెం.మీ లోతులో నాటాలి. నాటిన తర్వాత నీరు పెట్టాలి. విత్తనాలన్నీ 3-7 రోజుల లోపల మొలకెత్తుతాయి. వీటిలో బలమైన మొక్కల ను 1 నుండి 2 వరకు ఉంచి మిగిలిన వాటిని పెరికి వేయాలి. దొండ పాదు కొరకు చూపుడు వేలు లావుగల కొమ్మలు 4 కనుపులు గలవి గుంతకు 2 నాటుకోవాలి.

వర్షాధారంగా పండించేటప్పుడు 15 X 10 సెం.మీ కొలతలు గల పాలిథిన్ సంచుల్లో నాటుకొని 15-20 పెరగనిచ్చి, అదను చూసుకొని చేలో మొక్కలు నాటుకోవచ్చును.

## ఎరువులు

విత్తనానికి ముందు హెక్టారుకు 15-20 టన్నుల పశువుల ఎరువు పాదులలో వేయాలి. హెక్టారుకు 80-100 కిలోల నత్రజని రెండు సమపాళ్ళుగా చేసి మొదటి దఫా, విత్తన 25-30 రోజులకు రెండవ దఫా, పూత, పిందెమీద దిగినప్పుడు వేయాలి. మొక్కకు దగ్గరలో ఎరువును వేయకూడదు. ఎరువు వేసిన వెంటనే నీరు పెట్టాలి. వర్షాధారపు పంటకు భాస్వరం, నత్రజని మోతాదులు సగానికి తగ్గించుకోవచ్చు.

## అంతర కృషి

కలుపుమొక్కలను ఎప్పటికప్పుడు తీసివేయాలి. మొక్కలు బలంగా పెరగటానికి గాను 2-3 తడులు యిచ్చినా తరువాత ఒకటి లేదా రెండుసార్లు తేలికగా మట్టిని గుల్ల చేయాలి. మొక్కలు 2 లేక 4 ఆకుల దశలో నున్నప్పుడు 3 మి.గ్రా బోరాక్స్‌ను లీటరు నీటిలో కలిపి ఆకులపై చల్లటం వలన ఆడపూలు సక్రమంగా పూసి పంట దిగుబడి బాగుంటుంది.

## నీటి యాజమాన్యం

పాదు చుట్టూ 3-5 సెం.మీ మందం మట్టి ఎండినట్లుగా ఉన్నప్పుడు నీరు పెట్టాలి. సాధారణంగా వారానికొక తడి సరిపోతుంది. నీరు ఎక్కువ కాలం పాదు చుట్టూ నిల్వ ఉండకుండా చూడాలి.

## ఎగ ప్రాకుట (ప్రేలాడు)

దోస, గుమ్మడి, బూడిద గుమ్మడి, బీర మొదలైన పాదులు పందిరి అవసరం లేకుండా భూమి మీద పాకుతాయి, ఆనప, కాకరలను పందిరి మీద గాని, పొదలమీద గాని పాకించాలి. పొట్లకాయ పాదులకు పందిరి లేక పోయినట్లయితే కాయలు పొడవుగా పెరగవు. దొండకు తప్పనిసరిగా పందిరి అవసరం. ఆనప, బీర, కాకర పంటలకు పందిళ్ళు వేసి పెంచితే నాణ్యతగల కాయలు వచ్చి, మార్కెటు రేటు పెరుగుతుంది.

## సస్యరక్షణ

*1) గుమ్మడి పెంకు పురుగు - నివారణ :* కార్బరిల్ 3 గ్రా/ మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

*2) పొట్ల ఆకు పురుగు- నివారణ :* పూతకు ముందు దశలో క్వినాల్‌పాస్ 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

*3) పండు ఈగ - నివారణ :* పూత, పిందె దశలో 100 మి.లీ. మలాథియాన్ 100గ్రా చక్కెర లేదా బెల్లం పాకం లీటరు నీటిలో కలిపి మట్టి ప్రమిదల్లో పోసి, అక్కడక్కడ పొలంలో పెట్టాలి.

## తెగుళ్ళు

*1) బూజు తెగులు - నివారణ :* మాంకోజెబ్ 2. 5 గ్రా/ మెటలాక్సికల్ 2 గ్రా లీటరు నీటికి కలపి పిచికారి చేయాలి.

*2) బూడిద తెగులు - నివారణ :* ట్రేడ్ మార్ఫ్/ డైనోకాప్ 1 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

*3) ఫ్యుజేరియం వేరు కుళ్ళు తెగులు (ఎండుతెగులు)* : పంట మార్పిడి చేయాలి. ఆఖరి దుక్కిలో వేపపిండి 250 ఎకరాకు వేసి కలియదున్నాలి. కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రా॥ లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని మొక్క మొదలు చుట్టూ నేల తడిచేలా పోయాలి. పది రోజుల వ్యవధిలో 2-3 సార్లు పోయాలి.

*4) వెర్రి తెగులు - నివారణ :* తెగులు సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. తెగులును వ్యాప్తి చేసే పేనుబంక పురుగులను లీటరు నీటికి 2 మి.లీ. చొప్పున డైమిథోయేట్ / మిథైల్ డెమటాన్ కలిపి పిచికారి చేసి నివారించవచ్చును.

**- ఎమ్. మొగలయ్య**
*ఫ్యాకల్టీ మెంబర్, సిఎన్ఆర్ఎమ్, అపార్డ్*

# గ్రామ పంచాయతీ ఆదాయ వనరులను పెంపుకు ప్రయత్నించాలి

## ఒక రోజు వర్క్ షాప్ జి.పి. పన్ను విధానం

**గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచుకుంటూ ప్రజావసరాలను తీర్చటానికి ప్రయత్నం చేయవలసిన అవసరం ఎంతైన ఉందని రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ వి. నాగిరెడ్డి ఐ.ఎ.ఎస్. అన్నారు. ఆయన రాజేంద్ర నగర్‌లోని ఎ.ఎం. ఆర్. అపార్డు శిక్షణా అధ్యయన సంస్థలో గ్రామ పంచాయతీ ఆదాయం పన్నుల విధానంపై ఒక రోజు వర్కు షాప్‌ను ప్రారంభించి ప్రసంగించారు.**

పంచాయతీ అధికారులు నాలుగు ప్రధాన విధులను నిర్వహించాలని అవి (1) రెవెన్యూ సేకరణ (2) ఆదాయ వినియోగం (3) వనరులు (4) బడ్జెట్ మరియు జవాబుదారితనంతో పని చేయాలని అన్నారు. స్థానిక పాలనలో ఉత్తేజం కల్గించి ప్రజా అవసరాలను తీర్చటానికి అంకిత భావంతో పనిచేయాలన్నారు.

కాని పంచాయతీలు ప్రజలు ఆశించిన సేవలను అందించడంలో మంచి పేరును సంపాదించాలే గాని, ప్రజలలో పంచాయతీలపై ఉన్న అన్యూహత భావాన్ని చెరిపేయటానికి ప్రతి అధికారి పని చేయవలసిన అవసరం ఉందన్నారు.

గ్రామాలలో సేకరించిన ఆదాయ వనరులను పారదర్శకతో ఖర్చు చేసి అభివృద్ధికి దోహదం చేయాలని శ్రీ నాగిరెడ్డి సూచించారు. మన దేశ ఆదాయవనరులలో స్థానిక పాలన భాగం 2.5% గా ఉందని మొత్తం మన రాష్ట్రంలో రూ.25000 కోట్ల ఆదాయ వనరులున్నాయని వాటిని తగిన రీతిలో వినియోగించి మంచి ఫలితాలను సాధించాలని సూచించారు.

గ్రామ పంచాయతీలు ప్రధానంగా రోడ్ల నిర్మాణం, కొనసాగింపు, త్రాగునీరు, శానిటేషన్, విద్యుత్ సరఫరా తదితర పనుల ను సమర్థవంతంగా నిర్వహించాలని శ్రీ నాగిరెడ్డి చెప్పారు.

పంచాయతీ రాజ్ శాఖ కమీషనర్ శ్రీ డి. ప్రసాదరావు ఐ.ఎ.ఎస్. మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ పనితీరు, సేవల రంగాన్ని విస్తరించి మంచి పేరును కూడగట్టుకోవాలని వివరించారు.

పంచాయతీ రాజ్‌శాఖ అడిషనల్ సెక్రటరీ శ్రీ భాస్కర్ మాట్లాడుతూ, గ్రామ ఆదాయ వనరులను పారదర్శకతతో ఖర్చు చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.

అపార్డు సి.డి.పి.ఎ. హెడ్ ప్రొఫెసర్ సూర్య నారాయణ్ రెడ్డి మాట్లాడుతూ, కేరళ, మహారాష్ట్రలో పనిచేస్తున్న గ్రామ పంచాయితీల వలే ఫలితాలను సాధించి చూపించాల్సిన అవసరం ఉందని తన స్వాగతోపన్యాసంలో చెప్పారు.

ఈ కార్యక్రమంలో డి.పి.ఓ.ఎస్, డి.ఎల్.పి.ఓ.ఎస్, అకౌంట్స్ అధికారులు ఒకరోజు వర్క్స్‌షాప్‌లో పాల్గొన్నారు.

*- సి.ఎం.పి.*





# ప్రపంచ బ్యాంకు అధికారులు అపార్డు సందర్శన

## అపార్డును పరిశోధక ఏజెన్సీగా ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న ప్రపంచబ్యాంకు పథకాలైన ఆరోగ్యం, త్రాగునీరు, మహిళా సాధికారికత అమలు తీరును మానిటరింగ్, పరిశోధన అధ్యయనాలపై ప్రాజెక్టు నివేదికలను తయారు చేయుటకు గాను ఏఎంఆర్-అపార్డ్ సంస్థను నోడల్ ఏజెన్సీగా ఎన్నికొని, తగిన పద్ధతులలో వాటిని మానిటర్ చేయించుటకు ప్రపంచ బ్యాంకు సంకల్పించింది. అందులో భాగంగా ప్రపంచ బ్యాంకు ప్రతినిధి ఎం.ఎస్. మేఘ్నా 25-10-2013 అపార్డ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ డైరెక్టర్ జనరల్ కె. చంద్రమౌళి, ఐఎఎస్ (రి) అపార్డ్‌లో జరుగుతున్న పరిశోధన, టీచింగ్, మానిటరింగ్, శిక్షణ వివరాలను సందర్శకుల టీమ్‌కు వివరించారు. సెంటర్ ఫర్ డీసెంట్రలైజేషన్ ప్లానింగ్ & అడ్మినిస్ట్రేషన్ హెడ్ ప్రొఫెసర్ సూర్యనారాయణ రెడ్డి పంచాయితీ సర్పంచులకు శిక్షణ, ఎన్నికైన స్థానికపాలన సంస్థల అధ్యక్షులకు, ప్రతినిధులకు శిక్షణా మాడ్యుల్సును గూర్చి వివరించారు.

ఎం.ఎస్ మెఘ్నా మాట్లాడుతూ ప్రపంచ బ్యాకు అమలు చేస్తున్న మహిళా సాధికారికత కార్యక్రమాలను ప్రత్యేకమైన పార్టిసిపేటరీ అప్రోచ్‌తో వైవ్యక్తీకరణ పద్ధతుల ద్వార అమలు తీరు, కమ్యూనిటీల భాగస్వామ్యంను స్వచ్ఛందసేవా సంస్థల తీరును పరిశీలించి తగిన డేటాను సృష్టించి నివేదిక రూపంలో అందజేయుటకు, మరియు ఎస్.సి, ఎస్.టి. లకు ప్లాగ్‌షిప్ కార్యక్రమాలు ఏ విధంగా ఉపయోగపడు తున్నాయనే విషయాలను గూర్చి నివేదికలు తయారు చేయాలని కోరారు. అందుకు అపార్డు విభాగాలను ఎంపిక చేసుకొన్నట్టు ఆమె తెలిపారు. ఈ ప్లాగ్‌షిప్ అమలు కార్యక్రమాల అమలులో బిఎన్‌విల పాత్రను గూర్చి, వారి చేస్తున్న సేవలను గూర్చి శ్రీ చంద్రమౌళి వివరంగా వీడియో క్లీప్పింగ్స్ ద్వారా అందించడం జరిగింది. ప్రపంచ బ్యాంకు అధికారి మూడోవక్తుల సహాకారంతోను, సాంకేతిక పరిజ్ఞానంను, సోషల్ ఆడిట్ ద్వారా మానిటరింగ్‌ను చేయాలనున్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ సి.డబ్ల్యు.ఎస్. శ్రీ ఎ. నాగేశ్వరరావు, సిఎన్‌ఆర్ఎం సెంటర్ హెడ్ హెచ్. కూర్మారావు తదితరులు పాల్గొని ఆయా సెంటర్స్‌లలో జరుగుతున్న పరిశోధనలు శిక్షణ, మానిటరింగ్ కార్యక్రమాలను గూర్చి వివరించారు. సెర్ప్ ప్రతినిధి శ్రీ రంగారావు కూడ పాల్గొన్నారు. ■

# ఆధునిక సాంకేతిక భారతీయ నాగరికత పోకడలు, కుటుంబ వ్యవస్థపై వాటి ప్రభావం

**భారతదేశం సంప్రదాయాలకు, కట్టుబాట్లకు, విలువలకు నిలయం. మన కుటుంబ వ్యవస్థ ఎంతో ప్రాచీనమైనది. దాన్ని పరిరక్షించుకొనుట వలన ఎన్నో ఉపయోగాలున్నాయి. మన ఉమ్మడి కుటుంబ వ్యవస్థే సమాజ శ్రేయస్సుకు పునాది అలాంటి మహత్తు గల వ్యవస్థకు తూట్లు పొడిచి విచ్ఛిన్నం చేయడానికి పరోక్షంగా దోహదపడుతోంది మన ఆధునిక సాంకేతిక పరికరాల వాడకం. ఈ ఆధునిక పరికరాలను సరైన రీతిలో సరైన మోతాదులో వాడితేనే భారతీయ సాంస్కృతిక వ్యవస్థను కాపాడుకొనే వీలుంటుంది.**

అమ్మా నాన్నలను వదలేసి, చిన్నపిల్లలను కూడా క్రెచీలలో చేర్చడం మంచి సంస్కృతా ? వృద్ధాశ్రమాలు మన దేశానికి అవసరమా ? మన కుటుంబ వ్యవస్థలో పెద్దలకు ఓ దార్పు నిచ్చేది మనుమలు, మనుమరాళ్ళు, వారి బాగోగులను చూచెది పెద్దలైన తల్లిదండ్రులు తాతా, మామ్మలు. అలాంటి ఎంతో గుణాత్మకమైన స్థితిని వదిలి పశ్చిమ దేశాలలో వలెన్యూక్లియర్ కుటుంబాల పద్ధతినవలంబింస్తే ఎన్ని అనర్థాలున్నాయో గ్రహించాలి. అమ్మ పిల్లలు, నాన్న పిల్లలు పార్కులో ఆడుకొనే సంస్కృతి అమెరికాదేమో కాని మన దేశానిదే కాదు. అదే సరైనదని చూపుతున్న టెలివిజన్ / ఇడియట్ బాక్స్ ఎన్నో అనర్థాలకు దారి తీస్తోంది.






సీరియళ్ళు చూచి అదే నిజమని నేటి మహిళలు అనుకోడం టి.వి. చూస్తున్నాం. సినిమా అబద్దం. అబద్దం అందర్ని ఆడిస్తుంది. అందలం ఎక్కించి ఎక్కిరిస్తుంది. అటులనే టెలివిజన్ కూడా భారతీయ సమాజానికి అబద్ధాలను చూపిస్తూపోతే నిబద్ధతనే మరచిపోతుంది. ఈనాటి టెలివిజన్ రెండు పార్శ్వాలు కలది. ఒక పార్శ్వం విజ్ఞానాన్ని, ఆరోగ్యకరమైన వినోదాన్ని అందివ్వటం. రెండోవ పార్శ్వం అనారోగ్యకరమైన సంఘంలో చెడును రేకెత్తించే ధోరణులను వినోదం పేరిట చూపించటం. ఆధునికత పేరుతో విలువలను తుంగలో తొక్కింది. సినిమా రంగం యొక్క మాయాలోకం పంథాను టి.వి. రంగం కూడా చేపట్టింది. పెద్ద స్క్రీనులో ఉండే అవలక్షణాలన్నీ దూరదర్శన్ అనుసరించి గ్రామస్థులను ప్రభావితం చేస్తుంది. టెలివిజన్‌లో చూపేవి సగమే నమ్మవచ్చు. చాలా విచక్షణతో ప్రేక్షకులు చూడవలసి ఉంది.

ఆధునిక సాంకేతిక విజయానికి ధర్పణం అయిన సినిమా, దూరదర్శన్‌లు మన సమాజాన్ని వికృతం చేస్తుంది. ఎక్కడో హింస జరిగితే దానిని టెలివిజన్ తెరలపై పదేపదే చూపించి మనముందు జరుగుతున్నట్లు భావనను కల్గించి యువతను హింసవైపు మళ్ళించుతున్నాయి. వీటి వలన ఎంతో మంది జీవితాలు నాశన మవుతున్నాయి.

అయినా టెలివిజన్‌ను చూడకుండ వదిలి వేయలేము. అందులో



విజ్ఞానం ఉంది. మంచిని గ్రహించి చెడును వదిలి వేయవలయును. కాని అలా జరుగదు. చెడు మరింత చెడును చేస్తుంది. కనుక ఆధునిక సాంకేతికతను అవసరమైన మేరకు మాత్రమే వాడుకొనవలె.

అదే విధంగా ఆధునిక సమాచార విప్లవం వలన చిఫ్ సంస్కృతి వలన మన జీవితాలను ఎంతగానో ప్రభావితం చేసింది. సెల్‌ఫోను వలన సమాచారం ఎంతగా విస్తరించిందంటే క్షణాలలో దూరప్రాంతాలకు చేరుతుంది. అంతటి స్పీడు మన సమాజానికి అవసరమా ! అనేది ప్రశ్న ! నేడు మొబైల్ అతి పేదవానికి కూడ అందుబాటులోకి వచ్చింది. అతడు ఆ సెల్‌ను ఎందుకు ఉనయోగించుతాడు ? కేవలం నాకు ఈ రోజు కూలీ ఉందా ? లేదా? అని తెలుసుకొనడానికేనా ! ఇంకా ఎందుకైనా వాడుతున్నారు. కాని ఉపయోగించిన దాని వలన ఎన్నో అనర్థాలు కలుగుతున్నాయి. మొబైల్ వలన మానవ సంబంధాలు నాశనమౌతున్నాయి. వైయ్యక్తిక సంబంధాలు దెబ్బతింటున్నాయి. ఒకరిని ఒకరు కలుసుకొని యోగక్షేమాలు తెలుసుకొనే ఆత్మీయ సంప్రదాయంను మంట కలుపుతుంది. దూర ప్రాంతంలోనున్న వారిన మొబైల్‌లో పలుకరించుతూ వ్యక్తిగత సంబంధాలు పోతున్నాయి. అమ్మ బాగున్నావా? అని ఫోన్‌లో పలుకరించుతూ అమ్మ బాగోగులను చూచే వారు ఆమె యోగక్షేమాలను మరస్తున్నారు. వ్యక్తిగత సంబంధాలు కూడ లాభార్జన కొరకేనన్నట్లు భ్రమింప చేస్తున్నాయి.

సెల్‌ఫోన్‌ను పూర్తిగా ఉపయోగించుకొనడం తెలిసిన వారు పిల్లలు, యువత మాత్రమే వీరందరు కలిసి 30 - 40% మంది ఉంటారు. మిగతా వారందరికి అది ఒక సౌకర్యం మాత్రమే. ఈ సెల్‌ఫోన్





అనంతరం ఇప్పుడు ఐ - టాబ్లేట్ అని వచ్చింది. దీని తరువాత ఏమిటి? అనేది తెలియదు. మార్పు సహజం. ఆ సహజమైన మార్పు సామాన్యునికి అందుబాటులోకి వచ్చేప్పటికి దాని విలువను కోల్పోతుంది. ఐటాబ్లెట్ వలన దూరదర్శన్, సెల్‌ఫోన్‌లు కూడ వెనుక్కుపోతాయి. అది కాలక్రమం. ఆ క్రమంలో నువ్వు నేను మనమందరం కొట్టుకు పోవలసిందేనా ?

మరో మార్గం ఏమైన ఉందా ? మార్పు మానవునికి అవసరం. ఆ అవసరం మనిషిని మరో మనిషి దోచుకొనే విధంగా ఉండరాదు. అందుకే క్రొత్త ఒక వింత పాత ఒక రోత అంటారు. ఇవి అన్ని మన బ్రతుకులను మెరుగు పరచాలే తప్ప అధోగతికి నెట్టకూడదు. ఆధునిక సాంకేతికత మనిషి మనుగడకు ఉపయోగ పడవలె కాని వెర్రి తలలువేసె భయంకరమైన పోకడలకు దారితీయకూడదు. సామాన్యునికి నిజమైన ఆధారంగా మారినపుడే సాంకేతికతకు సార్థకత లభిస్తుంది.

మన కుటుంబ వ్యవస్థ మీద ఇంత వరకు ఎన్నో రకాలైన దాడులు జరిగాయి. కుటుంబం రూపాలు మారుతున్నాయి కాని కుటుంబం అదే రీతిలో చిన్నగానో పెద్దగానో కొనసాగుతుంది. ఆధునిక సంస్కృతి మన కుటుంబాన్ని విచ్ఛన్నం చేయలేదు. అదొక వ్రేళ్ళూనుకొన్న చెట్టు దాన్ని తొలగించాలంటే మరొక మెరుగైన వ్యవస్థ అందుకు ప్రత్యామ్నాయంగా రావాలి. అప్పుడే దానికొక రూపం ఏర్పడుతుంది.

**- సి.ఎం.పి.**





# గ్రామీణ చైతన్యానికి వారధులు బిఎన్‌విలు

### కర్నూలు జిల్లా ముడుమాల గ్రామంలో అపార్డు బృందం క్షేత్రస్థాయి పరిశీలన

**ఆంధ్రప్రదేశ్ యునిసెఫ్ అధికారుల సూచన మేరకు పిల్లల మనుగడ, ఎదుగుదల, త్రాగునీరు మరియు ఇతర పారిశుధ్య కార్యక్రమాలలో భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సహకారం, పాత్ర అనే అంశాల పై హైదరాబాద్ లోని అపార్డ్ కార్యాలయంలో ఒక సమావేశం జరిగింది.**

**పిల్లల మనుగడ, ఎదుగుదల, పారిశుధ్యం, తాగునీరు మొదలైన అంశాలపై గ్రామస్తులకొ అవగాహన**

ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 21 జిల్లాలలోని భారత్ నిర్మాణ్ వాలంటీర్లు పని చేస్తున్న 24 గ్రామాలను గుర్తించి, ఆయా గ్రామాలలో పైన పేర్కొన్న అంశాల గూర్చి 2012-13 సం॥ విషయ సేకరణ జరిగింది.

వచ్చే సంవత్సరం, అంటే 2013-14లో ఈ 24 గ్రామాలలో భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సహకారంతో పై తెలిపిన అంశాలలో ఏదైనా ప్రగతి సాధించగలమా అనే ప్రయత్నాన్ని 'అపార్డ్' చేపట్టింది. కార్యక్రమంలో

**0-1 సం॥లో శిశు మరణాలు- మొత్తం ఏడు -(7)**

| వ. నెం. | తల్లిపేరు | కులం | శిశువు జన్మించిన తేదీ | మరణించిన తేదీ | బ్రతికిన రోజులు | ఆడ/మగ | ఎన్నవ కాన్పు | కాన్పుఅయిన ప్రదేశం | తల్లి పెళ్ళి నాటికి వయస్సు | మరణానికి కారణాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | బెస్త మంజుల | బెస్త (బి.సి) | 16.9.12 | 03.10.12 | 17 | ఆడ | 1 | ఆసుపత్రి | 19 సం॥ | కవలలు 1+ 1 తక్కువ బరువు. |
| 2 | కురువ సరస్వతి | కురువ (బి.సి) | 11.2.12 | 13.12.12 | 2 | మగ | 3 | ఆసుపత్రి | 18 సం॥ | బరువు తక్కువ, పోషకాహార లోపం |
| 3 | కురువ ఈరమ్మ | కురువ (బి.సి) | 09.3.12 | 19.03.13 | 10 | ఆడ | 4 | ఆసుపత్రి | 19 సం॥ | 7 రోజులు జ్వరం. |
| 4 | మాల యశోద/ | మాల (ఎస్.సి) | 04.9.12 | 07.09.12 | 3 | ఆడ | 1 | ఇంటిదగ్గర | 18 సం॥ | కామెర్లు |
| 5 | మాల ఏసమ్మ | మాల (ఎస్.సి) | 28.2.12 | 17.07.12 | 135 | మగ | 4 | ఇంటిదగ్గర | 18 సం॥ | గుండె జబ్బు |
| 6 | కురువ యాదమ్మ | కురువ (బి.సి) | 05.3.12 | 06.03.13 | 1 | ఆడ | 4 | ఆసుపత్రి | 18 సం॥ | ఆసుపత్రికి ఆలస్యంగా వెళ్లారు. ఉమ్మ నీరు త్రాగి శిశువు చనిపోయింది |
| 7 | బెస్త శారద | బెస్త (బి.సి) | 4.11.12 | 04.11.12 | - | మగ | 3 | ఆసుపత్రి | 20 | నెలలు నిండకనే 8వ నెలలో కాన్పు |

# ప్రాజెక్టు అనంత పై సమీక్ష



**రెవెన్యూ శాఖ మాత్యులు శ్రీ ఎన్. రఘువీరారెడ్డి అక్టోబర్ 23న లేక్వ్యూ అతిథి గృహంలో ప్రాజెక్టు అనంత పై సమీక్ష నిర్వహించారు. శ్రీ ఎస్.పి. టక్కర్ ఐఎఎస్, ప్రిన్సిపల్ సెక్రటరీ (ప్లానింగ్) అపార్డ్ సి.డి.ఎస్. డైరెక్టర్ జనరల్ శ్రీ కె. చంద్రమౌళి, ఐఎఎస్ (రిటైర్డ్), శాసన సభ్యులు మరియు అపార్డు సిబ్బంది సమీక్షా సమావేశానికి హాజరయ్యారు.**

రెవెన్యూ శాఖా మాత్యులు శ్రీ రఘువీరారెడ్డి మాట్లడుతూ గ్రామాల ఎంపిక పారదర్శకంగా చేపట్టి, ప్రధానంగా మార్కెట్ యార్డులలో రైతులు పండించిన పంటలన్నింటికి అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించి అక్కడ పండే వ్యవసాయ ఉత్పత్తులను అనంత బ్రాండ్‌పై వారే అమ్ముకొనే విధంగా తీర్చిదిద్దాలని, ప్రధానంగా ప్రాసెసింగ్, ఉత్పత్తి విలువలను గురించి శ్రద్ధ తీసుకోవాలని, ఈ రబీ నుండీ కార్యక్రమాలు ప్రారంభించాలని సూచించారు.

శ్రీ ఎస్.పి.టక్కర్, ఐ.ఎ.ఎస్ మాట్లాడుతూ, మార్కెట్ యార్డులలో మౌళిక సదుపాయాలు, పాలీహౌస్, నెటేలున్‌ల క్రింద కూరగాయలు, పూలతోటల పెంపకం పంటల వారీగా రైతుల సమాఖ్యలు ఏర్పాటు చేయటం, యువతకు మహిళా సంఘాల ద్వారా వ్యవసాయోత్పత్తుల కొనుగోలు, ప్రోసెసింగ్, మార్కెటింగ్ వంటి అంశాలలో శిక్షణ ఇచ్చి కేరళ వ్యవసాయ టెక్నాలజీ మిషన్ తరహాలో అభివృద్ధి చేయాలని సూచించారు.

శ్రీ కె. చంద్రమౌళి మాట్లాడుతూ, నవంబరు నుండి ప్రాజెక్టు అనంత క్రింద చేపట్టే కార్యక్రమాల గురించి ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్యంగా వ్యవసాయం, యువత, మహిళలు, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా చేపట్టబోయే వివిధ కార్యక్రమాల గురించి సవివరంగా తెలియచేశారు.

భాగంగా 'అపార్డ్' సలహాదారు జి. జయపాల రెడ్డి, కర్నూలు జిల్లా శిక్షణా మేనేజర్లు గిడ్డేశ్వరుడు, నిర్మల్ దాస్, స్థానిక ఎంపిడిఓ సిద్ధలింగ మూర్తి, ఇతర గ్రామస్థాయి అధికారులతో కలిసి ముడుమాల గ్రామాన్ని సందర్శించడం జరిగింది.

ఇందులో భాగంగా అతి ముఖ్య అంశాలైన 0-1 సం॥లోపు శిశు మరణాలు (ఐ.ఎమ్.ఆర్), బహిరంగ మల విసర్జన (ఓ.డి) అనే రెండు అంశాలపై గ్రామస్థాయి అధికారులు, బిఎన్‌విలు, గ్రామస్తులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి కూలంకుషంగా చర్చించడం జరిగింది.

పై రెండు అంశాలలో ఆయా అధికారులు, గ్రామస్తులు అందజేసిన సమాచారం మేరకు వివరాలు పట్టికలో వివరించిన విధంగా వున్నాయి.

రెండవ అంశంగా బహిరంగ మలవిసర్జనను పరిశీలి స్తే, గ్రామంలో గల 742 ఇళ్ళకు గాను 510 కుటుంబాల వారు వ్యక్తిగత మరుగు దొడ్లను నిర్మించుకుంటే, వాటిలో 390 మాత్రం వాడకంలో వుండగా, మిగతా 120 కుటుంబాలు వాడటం లేదని, మిగిలిన 232 కుటుంబాలు మరుగుదొడ్లను ఇంకా నిర్మించుకోలేదని తెలిసింది.

పై రెండు లోపాలకు గల కారణాలను లోతుగా పరిశీలిస్తే, మొదటి అంశమైన 0-1 సం॥లోపు శిశుమరణాలకు కారణాలు ఈ క్రింది విధంగా వున్నట్లు అవగతమైంది.

1. గ్రామంలో మెజారిటీ కులాలు కురువ, హరిజన, బెస్త, చాకలి, బోయ, ముస్లింలు వున్నారు. వీరిలో, ముఖ్యంగా స్త్రీలలో నిరక్షరాస్యత, అవగాహనా లేమి, పౌష్టికాహార లోపం, నిరాసక్తి, నిర్లక్ష్యం, అమాయకత్వం స్పష్టంగా కనిపిస్తాయి. వీరు రాబోయే ప్రమాదాలను ఊహించ లేరు. చెబితే అర్ధంచేసుకోరు. ముందస్తు సమాచారమిచ్చినా 104 వాహనం వస్తే, చూపించుకోరు. పనులకు వెళ్తారు. చూస్తాం, చేస్తాం అంటూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు.

ఆడపిల్లలకు 18 సం॥ నిండీ, నిండకనే పెళ్ళి చేస్తారు. ముందే నిరక్షరాస్యత, అపై అవగాహనా లోపం, మరో ప్రక్క నిర్లక్ష్యం, వెరసి ఒకే సంవత్సరంలో గ్రామంలో ఏడు శిశుమరణాలు సంభవించాయి.

2. ఇక బహిరంగ మలవిసర్జన విషయానికి వస్తే, గ్రామంలోని వ్యవసాయ పొలం మొత్తం దాదాపు నీటి పారుదల క్రింద వుంది. చాలా రోజుల పాటు ఉపరితలంలో నీరు లభిస్తుంది. సంవత్సరం పొడవునా పొలం పనులు వుంటాయి. గ్రామస్తులు అధిక సమయం పొలంలో వుంటారు. అక్కడే బహిరంగ మల విసర్జనకు అలవాటు పడ్డారు. వీరికి మరుగు దొడ్డి ఆవశ్యకత గురించి, అలాగే బహిరంగ మల విసర్జన వలన కలిగే అనర్థాల వివరంగా తెలిపాల్సిన అవసరం ఎంతైనా వుంది.

గ్రామంలో గల 25 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లు పై రెండు అంశాలతో పాటుగా ఇతర కార్యక్రమాల పట్ల గ్రామీణ కుటుంబాలకు అవగాహన కల్పించి, గ్రామీణులను చైతన్యపరిచి, ప్రగతి సాధన కోసం కృషి చేయడం నిజంగా అభినందనీయం.

*- జి. జయపాల్ రెడ్డి, సలహాదారు, సిఎస్ఆర్ఎం, అపార్డ్*




# సైకిలు ప్రయాణానికి పునరాహ్వానం

**నేటి యాంత్రిక ప్రపంచంలో సుఖవంతమైన ప్రయాణం చాల సులభం. కాని శారీరక శ్రమ లేకుండుటతో అనారోగ్యానికి కూడా అవకాశాలు పెరిగాయి. కాని వాహనపు ఇంధనం ఖర్చులు సామాన్యునికి అందుబాటులో లేకుండా పెరిగాయి. ఈ నేపథ్యంలో శారీరక శ్రమతో నడిచే యంత్రం సైకిలు తిరిగి వాహనంగా పెట్టుకో వలెనని వైద్యులు, వ్యాయమ బోధకులు సూచిస్తున్నారు. అందరు సైకిలును త్రొక్కడం ద్వారా జీరో బడ్జెట్‌తో ఆరోగ్యం చేకూరుతుందని అంటున్నారు. కనుక రాబోయే దశాబ్ధంలో తిరిగి సైకిలు వినియోగం పెరిగేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతే గాక ఏ ఖర్చు లేకుండా ప్రయాణం చేయవచ్చు.**




గతంలో కొబ్బరి నీళ్ళు వాడకం అంతగా ఉండేది కాదు. కూల్‌డ్రింక్‌లు త్రాగేవాళ్ళు ఇపుడు డాక్టర్ల సూచనతో కొబ్బరి నీళ్ళను వ్యాపారంగా మార్చేశారు. 1970 కు పూర్వం కొబ్బరి నీళ్ళు చాల తక్కువగా వాడే వారు. ఇపుడు ప్రతి డాక్టర్ జ్వరం వచ్చినపుడు కొబ్బరి నీళ్ళు త్రాగమని సలహాయిస్తున్నారు. అంటే యాంత్రిక స్థితి నుండి సహాజ వస్తువులవైపు ప్రపంచము పయనిస్తోంది.

యంత్రాలను ప్రతి సంఘటనలు గుర్తుగా ప్రోత్సహించడం జరగుతుంది. చక్రవాహాక జీవిత వ్యూహంలో ఒకటి దిగువ నుంటే మరోకటికి పైకి ఎగువకు వస్తుంది. అంటే సైకిలు వాడకం కూడ ఈ క్రమంలో తిరిగి పునఃప్రవేశం చేసి మనిషి ప్రయాణంతో పాటు ఆరోగ్యంను కూడ పెంచెందుకు మరింత ఉపయోగ పడుతుందని ఆశిద్దాం.

**- సి.ఎం.పి**



డ్రైనేజి పూడికను తీస్తున్న శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలస మండలం బొబ్బిలిపేట గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు




పిల్లల మనుగడ ఎదుగుదలపై ఒక్కరోజు శిక్షణ అనంతరం ర్యాలీ నిర్వహిస్తున్న తూర్పుగోదావరి జిల్లా కొత్తలంక గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు




డ్రైనేజిలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు మండలం కురెళ్ళగూడెం గ్రామ బి.ఎన్.వి.లు

# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల



ఆహార దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అమీర్‌పేట గ్రామ భారత్‌నిర్మాణ్ వాలంటీర్లు.



నిరుపేద కుటుంబాలకు నెలసరి నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం మండలం రావులపాడు గ్రామ బి.ఎన్.విలు



త్రాగునీరు, పారిశుద్ధ్యంపై క్షేత్రస్థాయి సిబ్బందికి మొయినాబాద్ మండల పరిషత్‌లో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న భారత్ నిర్మాణ్ వాలంటీరు.



గాంధీ జయంతి పురస్కరించుకుని మద్యపాన నిషేధంపై ర్యాలీ నిర్వహించిన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కొక్కరేణి గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.



రాజేంద్రనగర్ విస్తరణ కేంద్రం ఆధ్వర్యంలో గ్రామస్థాయి సిబ్బందికి మరియు భారత్‌నిర్మాణ్ వాలంటీర్లకు త్రాగునీరు, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న ఫ్యాకల్టీ సభ్యులు



మొక్కలు నాటేందుకు తీసుకెళ్తున్న మహబూబ్‌నగర్ కల్వకుర్తి భారత్ నిర్మాణ్ వాలంటీర్లు

# అపూర్వ విజయాలు



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో భారత్‌నిర్మాణ్ వాలంటీర్ల సహకారంతో బోర్లు వేస్తున్న దృశ్యం



మురుగు కాలవకు గొట్టాలు అమర్చుతున్న శ్రీకాకుళం జిల్లా బొబ్బిలిపేట గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు



సొంతఖర్చులతో రోడ్డుపై ఉన్న గుంతల్ని ఇసుకతో పూడ్చిస్తున్న కడవకుదురు గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు

# జవహర్ లాల్ నెహ్రూ విలక్షణ వ్యక్తిత్వం

**అకుంఠిత దేశభక్తితో స్వార్థరాహిత్యంలో పరాకాష్టను చేరుకొని తమ సిరిసంపదలను, సుఖ సంతోషాలను (కొందరు తమ ప్రాణాలను కూడా) తృణప్రాయంగా ఎంచి అలనాటి స్వాతంత్ర పోరాటంలో దూకిన ధీరులెందరో! వారిలోని నాయకత్వ శ్రేణులలో కొంతమంది స్వాతంత్రానంతరం తొలి దశలో అధికార పదవులు చేపట్టారు. తమలో తమకు కొన్ని విషయాలలో అభిప్రాయభేదాలు వచ్చినప్పటికీ, వారిలో కొందరి విధానాలు, నిర్ణయాలు తీవ్రమైన పొరపాట్లుగా వర్ణింపబడినా కూడా వారందరూ పరస్పర గౌరవాన్ని చూపించుకొంటూ, దేశశ్రేయస్సు, అభివృద్ధి, కొన్ని మౌళిక విలువల విషయంలో నిబద్ధతను వీడకుండా ఏకత్రాటిపై నడిచారు. అట్టి నాయకులలో అగ్రశ్రేణిలో ఉన్నవారు మన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ (1889-1964). ఆయన చూపించిన నిబద్ధతకు విలువల పట్ల గౌరవాన్ని తెలియచేసే కొన్ని ఘటనల గురించి తెలుసుకుందాం.**

## రష్యాకు భారత రాయబారి నియామకం

ఆనాటి రష్యన్ పాలకులకు భారత స్వాతంత్ర్య సమరమన్నా స్వతంత్ర భారత నాయకులన్నా అంతగా సుహృద్భావ ధోరణి ఉండలేదు. దీని దృష్ట్యా రష్యాలో మన రాయబారి కర్తవ్యం అతిసున్నితమైనదని, అమెరికా ఇంగ్లాండు దేశాలకు పంపే రాయబార్ల నియామకం కంటే రష్యాలోని రాయబారి నియామకం చాలా ముఖ్యమైనదని జవహర్ లాల్ నెహ్రూ గుర్తించి ప్రత్యేకంగా అంతర్జాతీయ ఖ్యాతి ఉన్న విద్యావేత్త ఆనాటి బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఒప్పించి రష్యాకు మన రాయబారిగా 1949 లో నియమించారు. రాధాకృష్ణన్ రష్యాలో రాయబారిగా చేరిన అనతికాలంలోనే రష్యన్ నాయకుల గౌరవాన్ని అభిమానాన్ని చూరగొని ప్రాముఖ్యతలో అమెరికా, ఇంగ్లండ్ రాయబారుల తరువాతి స్థానాన్ని పొందారు. రష్యాతో మన వాణిజ్య సంబంధాలను బాగా పెంచటంలో కృతకృత్యులై ఇండో-రష్యన్ సంబంధాలకు పటిష్ట పునాదులను వేశారు.

## 1922 కాంగ్రెస్ మహాసభలు కాకినాడ

1922లో భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలు కాకినాడ పట్టణంలో జరిగాయి. అందులో భాగంగా ఒక ఖాదీ ఎగ్జిబిషన్ నిర్వహించటం జరిగింది. అప్పటికే కాంగ్రెస్‌లో ప్రముఖస్థానాన్ని పొందిన జవహర్‌లాల్ నెహ్రూ ఎగ్జిబిషన్ తిలకించటానికి నేరుగా లోపలికి ప్రవేశిస్తుండగా గేటు వద్ద విధి నిర్వహణలో ఉన్న ఒక అమ్మాయి ఆయన్ని రెండు అణాల ప్రవేశ టికెట్టు కానీ, పాస్ కాని చూపించి మరీ లోపలి కెళ్ళాలని ఆపింది. ఇది గమనించిన నిర్వాహకులు ఆమెను మందలిస్తుండటం గమనించిన నెహ్రూ ఆమెను మందలించకూడదని పైపెచ్చు తన విధి నిర్వహణ సరిగా చేసిందానికి మెచ్చుకోవాలని వారిని ఉద్బోధించారు.

ఆ అమ్మాయే తదుపరి రోజులలో ప్రముఖ సంఘసేవకురాలిగా ఖ్యాతి కెక్కిన దుర్గాబాయ్ దేశ్‌ముఖ్. ఆమెను ప్రణాళిక సంఘం సభ్యురాలిగా నియమించటమే కాకుండా ఆమెకు ఆనాటి ఆర్థిక మంత్రి సి.డి. దేశ్‌ముఖ్‌తో పెళ్ళికుదిర్చి పెళ్ళి పెద్దగా వ్యవహరించాడు. (ఆ తరువాత ఒకానొక కేబినెట్ నిర్ణయంతో విభేదించిన సి.డి. దేశ్‌ముఖ్ అది తన శాఖకు సంబంధించినది కాకపోయినా కూడా కేబినెట్ సమష్టి బాధ్యతా సూత్రాన్ని పాటించి రాజీనామా చేయటం వేరే విషయం).



# విజయవంతమైన తాండా కథ

ఆంధ్రప్రదేశ్‌లోని వరంగల్ జిల్లా సామ్యతా తండా గిరిజన తాండాలన్ని అవసరాలను తీర్చుకొని పట్టణ జీవితంగా రూపొందింది. ఈ తాండాలో 150 మంది ఉన్నారు. నిశబ్దమైన కురివి మండలంలో శివారు గ్రామం సిరోల్ గ్రామంలో పలు విజయవంతమైన సంఘటనలు చోటుచేసుకున్నాయి.

ఈ చిన్న తాండాలో దాదాపు 12 మంది డాక్టర్లు, 24 మంది పైగా ఇంజనీర్లు, ఫార్మాస్యూటికల్ సైంటిస్టు, సూపరెండెంట్స్ ఎందరో వున్నారు. ఈ తాండాకు చెందిన వారు సామ్యతాండా లేదా రూప్లాతండా లేదా కలెక్టర్ల తాండా అంటారు. ఈ గ్రామం సుదూరంగా జిల్లా మారుముల గ్రామంలో ఉంటుంది.

ఐఏఎస్ ఆఫీసర్ తేజోవంత్ రామచంద్రు నాయక్, ఐఏఎస్ (ఆర్.ఏ.డి) ఒడిస్సా నవరంగ్‌పూర్ కలెక్టర్‌గా పని చేశారు.

తేజోవంత్ జగదీష్ ఆర్ఎమ్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రి. ఈయన ప్రతి వారం తాండాను సందర్శించి సమస్యల గూర్చి తెలుసుకుంటారు. ◆

మూడు సంవత్సరాలు పని చేసిన తరువాత రాధాకృష్ణన్ భారత దేశం తిరిగి వచ్చేటప్పుడు ఆ నాటి కరుడు గట్టిన రష్యా నియంత స్టాలిన్ ఆయనకు ప్రత్యేక ఇంటర్వ్యూ మరొక్క సారి ఇచ్చి ఆయన రష్యా విడిచి వెళ్ళటం బాధ కలిగిస్తోందని మరి కొన్నాళ్ళు ఉండి ఉంటే బాగుండేదని వాపోయారు.

## పదవీత్యాగంలో పోటీ

స్వాతంత్ర్యానంతరం జవహర్ లాల్ నెహ్రూ ప్రధాన మంత్రిగా వల్లభాయి పటేల్ ఉపప్రధాన మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. వారిద్దరి మధ్య తీవ్రమైన విభేదాలు తలెత్తాయి. ఈ విషయంలో జవహర్ లాల్ నెహ్రూ మహాత్మాగాంధీకి ఒక ఉత్తరం రాస్తూ భిన్న దృక్పథాలు వీటికి కారణమని, ఈ పరిస్థితులలో తామిద్దరమూ కేబినెట్‌లో కల సి కొనసాగటం కష్టమని, అందుకు పరిష్కారంగా తాను రాజీనామా చేయదలిచానని తెలిపారు. ఆ ఉత్తరాన్ని మహాత్మాగాంధి వల్లభాయి పటేల్‌కు పంపించారు.

దీనికి స్పందనగా వల్లభాయి పటేల్ మహాత్మాగాంధీకి ఒక ఉత్తరం వ్రాస్తూ "మా ఇద్దరిలో ఎవరైనా కేబినెట్ నుంచి వైదొలగాల్సి వస్తే నేను వైదొలగటమే ఉచితం. ఎందుకంటే వయసులో నా కంటే నెహ్రూ చిన్నవాడు. ప్రజలలో ఎక్కువ ఆదరాభిమానాలు పొందినవాడు. అంతర్జాతీయ సంబంధాలలో ఆరితేరిన వాడు" అని తెలిపారు.

ఇద్దరిలో ఎవరూ రాజీనామా చేయనవసరంలేదని మహాత్మాగాంధీ తేల్చి చెప్పారు. ఆ తరువాత మహాత్మాగాంధీ హత్యానంతరం నెహ్రూ, పటేల్‌లు దేశ శ్రేయస్సు దృష్ట్యా తమ విభేదాలు జాతి ముందడుగు వేయడానికి ఎటువంటి అవరోధం కాకుండా చూసుకొని కలసి పనిచేశారు.

## తొలి కేబినెట్ నిర్మాణం

పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఉండి కూడా, జవహర్‌లాల్ నెహ్రూ తన మంత్రివర్గంలో వివిధ రంగాలలో నిష్ణాతులైన కాంగ్రెసేతరులకు కూడా స్థానం కల్పించాడు. అట్టి వారిలో ప్రముఖులు, జాన్ మత్తై, బి.ఆర్. అంబేడ్కర్, సి.డి. దేశ్‌ముఖ్, కృష్ణమాచారి, షణ్ముఖం చెట్టి, సి.హెచ్. భాభా, శ్యాంప్రసాద్ ముఖర్జీ, కృష్ణమీనన్. కాని తరువాత వీరిలో చాలా మంది వివిధ కేబినెట్ నిర్ణయాలతో విభేధించి రాజీనామా చేశారు.

## కె.ఎస్. హెగ్డే

హెగ్డే 1952 నుండి 1957 వరకు రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు. అపుడొక సందర్భంలో ఆయన 'భారత్‌లో విదేశీ గూఢాచారి వ్యవస్థ పెరుగుదల' పై రాజ్యసభలో ఒక ప్రశ్నవేశారు. ఈ ప్రశ్న సున్నితమైన అంశానికి సంబంధించినది కావున ప్రధానమంత్రి నెహ్రూ హెగ్డేను తన గదికి పిలిపించి ఆ ప్రశ్నకు సంబంధించిన సమాచారాన్ని ఎవరి దగ్గర నుంచి సేకరించరాని అడిగారు. హెగ్డే దాన్ని బయటపెట్టలేనని నెహ్రూకు సమాధాన మిచ్చారు. నెహ్రూ దానిపై ఆయనను బలవంతపెట్టకుండా ఆయనను పంపివేసిన తరువాత ఆయనను మళ్ళీ పిలిపించుకొని "నీ స్వతంత్ర వ్యక్తిత్వం నాకు నచ్చింది. ఐక్యరాజ్యసమితికి భారత ప్రతినిధి బృందంలో సభ్యునిగా నిన్ను పంపిస్తున్నాను" అని చెప్పారు. ఆ తరువాతి కాలంలో హెగ్డే సుప్రీంకోర్టు జడ్జిగా పని చేసి కొన్ని చరిత్రాత్మక జడ్జిమెంట్లిచ్చిన ధర్మాసనాలపై ఉన్నారు.

1973లో భారత ప్రధాన న్యాయమూర్తి నియామకంలో సీనియారిటీని త్రోసిపుచ్చిన ప్రభుత్వ చర్యకు నిరసనగా ఇంకా ముగ్గురు జడ్జీలతో పాటు రాజీనామా చేశారు.

## నెహ్రూ ఉదారత్వం

1958లో ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ రాజ్యసభలోని తన ఛాంబర్‌లో ఉన్నపుడు తన అటెండర్‌ను పిలిచి ప్రధానమంత్రి తనను కలవ కోరుతున్నానని సందేశాన్ని పంపాల్సిందిగా తన సెక్రెటరీకి చెప్పమని ఆదేశించారు. కాని ఆ అటెండరు నేరుగా ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూనే కలసి సందేశాన్ని అందించాడు. ఆ తరువాత ఇది తెలుసుకొని రాధాకృష్ణన్ బాధపడ్డారు. కాని నెహ్రూ ఆయనతో ఇవి చిన్న విషయాలను వీటిని గురించి మనం పట్టించుకోకూడదని సూచించారు.

*- ఏ. నాగేశ్వర రావు*
*సెంటర్ హెడ్, సి.డబ్ల్యు.ఎస్, అపార్డ్*



# వరి పంట అనంతరం మెరక పంటల సాగు పద్ధతులు

## మొక్కజొన్న

*సిఫారసు చేయబడిన రకాలు*

దీర్ఘకాలిక హైబ్రిడ్‌లు : డి.హెచ్.ఎమ్.-103, 105, 113, బి.హెచ్.-2187

మధ్యకాలిక హైబ్రిడ్‌లు : డి.హెచ్.ఎమ్. - 107, 111, 1172

స్వల్ప కాలిక హైబ్రిడ్‌లు : డి.హెచ్.ఎమ్.- 1, 109, 115

తీపి మొక్కజొన్న : మాధురి, ప్రియ, విన్ ఆరెంజ్

పాప్ కార్న్ : అంబర్ పాప్‌కార్న్.

బేబి పాప్ కార్న్ : హెచ్.ఐ.యం. 129, వి.ఎల్. 49

పియం మొక్కజొన్న : అంబర్ శక్తి, హెచ్.క్యూ. పి.యం. -1

- ★ చవుడు నేలల్లో, మురుగు నీరు నిలవ వుండే నేలల్లో సాగు చేయరాదు.
- ★ ఎకరానికి 26,000 మొక్కల సాంద్రతను పాటించాలి.
- ★ ఒక కిలో విత్తనాన్ని 3 గ్రాముల మ్యాంకోజెబ్‌తో విత్తన శుద్ధి చేయాలి.
- ★ విత్తిన ఒక నెల వరకు కలుపు నివారణ చేపట్టాలి. విత్తుటకు ముందు కలుపు, నివారించటానికి ఒక ఎకరాకి 80 గ్రా. చొప్పున అట్రాజిన్ మందును వాడాలి.
- ★ భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల యాజమాన్యం చేపట్టాలి. ఖరీఫ్‌లో ఎకరాకు 60 కిలోల నత్రజని, 25 కిలోల భాస్వరం మరియు 16 కిలోల పొటాష్, రబీలో 70, 30, 20 కి॥ నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. మొత్తం భాస్వరం మరియు పొటాష్‌ను ఆఖరి దుక్కిలో మరియు నత్రజనిని మూడు సమభాగాలలో వాడాలి.
- ★ జింకు లోపమున్నచో ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేటును వాడాలి.
- ★ ఆహార పంటగా సాగుచేసిన మొక్కజొన్నలో అంతరపంటగా పశుగ్రాసానికై మొక్కజొన్నను ఒక మీటరు ఎత్తు పెరిగే వరకు సాగు చేయవచ్చును.
- ★ 2:1 నిష్పత్తిలో మొక్కజొన్నలో కందిని అంతర పంటగా వేయవచ్చును. మొక్కజొన్న తరువాత కంది లేక వేరుశనగ సాగు లాభదాయకం.
- ★ కాండం తొలిచే చారల పురుగు మరియు ఆకుమాడు తెగులు నివారణకై సమయానుకూల సస్యరక్షణ చర్యలను చేపట్టాలి.
- ★ గింజలలో 25-30 తేమ వాతం ఉన్నప్పుడు కోయాలి. వరి తరువాత జీరో టిల్లేజ్‌లో సాగు చేయవచ్చును.

## జొన్న

*సిఫారసు చేసిన రకాలు*

సి.ఎస్.హెచ్. 6, 9, 15, 16, 13, పాలెం-2, యస్.టి.జె. 13, 14, పి.యస్.వి.-1, సి.యస్.వి.-15, ఎమ్. 35-1, ఎన్.టి.జె.-1,2,3,4 కిన్నెర, సి.ఎస్.వి. 215 ఆర్.

- ★ మొవ్వు తొలుచు ఈగ మరియు కంకినల్లి రాకుండా ఉండటానికి జులై 1వ తారీఖుకి ముందే విత్తుకోవాలి.
- ★ కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్‌తో కాని, కాప్టాన్‌తో గాని విధిగా విత్తనశుద్ధి చేసుకోవాలి.
- ★ ఎర్రనేలల్లో, చదును మడుల మీద విత్తుకొని, 30 రోజుల తర్వాత మొక్కలకు మట్టి ఎగదోస్తే నేలలో తేమ సంరక్షించబడి దిగుబడులు పెరుగుతాయి.
- ★ సమతుల ఎరువుల యాజమాన్యం పాటించాలి. ఎకరాకు 24 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం, 12 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువుల్ని వాడాలి. నత్రజనిని రెండు భాగాలుగా, విత్తేటప్పుడు ఒకసారి, 30 రోజులకు మరొకసారి వేయాలి. నీటి పారుదల క్రింద 32-40 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు వేయాలి.
- ★ జొన్నను కందితో అంతర పంటగా 2:1 నిష్పత్తిలో వేస్తే, అధిక లాభం రావటమే కాకుండా జొన్నలో గింజ బూజు, కందిలో ఎండు తెగుళ్ళు తగ్గుతాయి.
- ★ మొవ్వు తొలుచు ఈగ, కాండం తొలుచు పురుగు మరియు కంకినల్లి పురుగుల్ని, గింజ బూజు, బంక కారు తెగుళ్ళ నుంచి పైరుని కాపాడటానికి అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

## సజ్జ

*సిఫారసు చేసిన రకాలు*

మెరుగైన ఐ.సి.ఎమ్.హెచ్ 356, ఐ.సి.టి.పి. 8203, ఐ.సి.ఎమ్.వి. 221 రకాలు.

- ★ 2% ఉప్పునీటి ద్రావణంలో విత్తనాలను 10 నిమిషాలు ఉంచటం ద్వారా ఎర్గాట్ శిలీంద్రపు శేషాలు తేలి తొలగిపోతాయి. ఆ తర్వాత, ఆరిన కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్‌ని కలిపి విత్తనశుద్ధి చేయాలి. విత్తనాన్ని గట్లు, కాలువల పద్ధతిలో విత్తుకోవాలి. సజ్జను కంది పంటతో 2:1 నిష్పత్తిలో అంతరపంటగా వేస్తే అధిక లాభాలు వస్తాయి.
- ★ ఎకరాకు 24 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం మరియు 8 కిలోల పొటాష్ నిచ్చే ఎరువుల్ని వేయాలి. అందులో నత్రజనిని రెండు సమభాగాలుగా, ఒక భాగం విత్తేటప్పుడు మరొకటి విత్తిన 3-4 వారాలకి వేయాలి. నీటి వసతి క్రింద పంటకు 32 కిలోల నత్రజని వేయాలి.
- ★ చెదలు, వేరుపురుగులు మరియు పచ్చకంకి, పేనుబంక తెగుళ్ళ అదుపునకు అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.



## రాగి

*సిఫారసు చేసిన రకాలు*

గోదావరి, రత్నగిరి, గౌతమి, చంపావతి, భారతి, సప్తగిరి, మారుతి, శ్రీ చైతన్య మొదలైనవి.

- ★ కిలో విత్తనానికి 3 గ్రా. మాంకోజెబ్ లేక 2 గ్రా. కార్బండజిమ్‌తో విత్తనశుద్ధి చేయాలి.
- ★ నారుమడిలోనూ, నాటిన 3 వారాల వరకు కలుపు లేకుండా చూడాలి.
- ★ ఎకరాకు 24 కిలోల నత్రజని, 15 కిలోల భాస్వరం మరియు 8 కిలోల పొటాష్ నిచ్చే ఎరువుల్ని వాడాలి. నత్రజనిని రెండు సమభాగాలుగా ఒక భాగం నాటేటప్పుడు, రెండో భాగం నాటిన 3-4 వారాలకు అందిచాలి.
- ★ అగ్గితెగులు నివారణకు, లీటరు నీటికి 1 గ్రా. కార్బండజిమ్ కలిపి, 50 శాతం కంకి వచ్చు సమయంలో ఒకసారి, పూర్తిగా కంకి వచ్చిన తరువాత మరోసారి పిచికారి చేయాలి.

## కంది

*సిఫారసు చేసిన రకాలు*

పల్నాడు, మారుతి, లక్ష్మి, దుర్గ, ఆశ, అభయ, పాలెం కంది, యల్.ఆర్.జి.-41, యమ్,ఆర్.జి.-66, డబ్ల్యూ.ఆర్.జి.-36

- ★ రైజోబియంతో విత్తనశుద్ధి చేయాలి.
- ★ కందిని శనగపచ్చ పురుగుబారి నుండి తప్పించాలంటే, నెల్లూరు, ప్రకాశం కృష్ణా మరియు గుంటూరు జిల్లాల్లో రబీలోనూ, అలాగే ఖరీఫ్‌లో ఉత్తర తెలంగాణా ప్రాంతంలో తక్కువ కాల పరిమితి గల రకాలను వేయాలి. అధిక దిగుబడి నిచ్చే వంగడాలను వాడాలి.
- ★ కందిపై ఆశించే కాయ తొలుచు పురుగు నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు ఆచరించాలి.
- ★ కందితో పాటు అంతర పంటగా పెసర / మినుము / వేరుశనగ / నువ్వులు / సోయా చిక్కుడు / జొన్న లేక మొక్కజొన్న పంటల్ని వేసుకోవాలి.
- ★ వర్షాలు ఆలస్యమైనప్పుడు కందిని ఏక పంటగా సాగుచేయాలి. అలాంటప్పుడు అధిక విత్తనం వాడాలి.
- ★ ఎండుతెగులు తీవ్రంగా ఆశించే మహబూబ్ నగర్ లాంటి జిల్లాల్లో పి.ఆర్.జి. 158 (పాలెం కంది) రకాన్ని సాగు చేయాలి.

శనగపచ్చ పురుగు నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు

*1. యాజమాన్య పద్ధతులు*

- ☆ వేసవి దుక్కులు
- ☆ ఒకే పంట పదే పదే వేయకూడదు
- ☆ పంట మార్పిడి
- ☆ చాళ్ల మధ్య ఎక్కువ దూరం ఉంచటం
- ☆ సిఫార్సు చేసిన ఎరువుల్ని వాడటం
- ☆ పురుగుని తట్టుకునే లేక పురుగు ఆశించినా తిరిగి త్వరగా చిగురించే లక్షణాలున్న రకాలను ఎంచుకోవాలి (ఐ.సి.పి.యల్. 332, ఎల్.ఆర్.జి. 38, యమ్.ఆర్.జి.-66, యల్.ఆర్.జి. -41, డబ్ల్యూ.ఆర్.జి. 53)
- ☆ అంతర పంటలుగా ఖరీఫ్‌లో జొన్న, సోయాచిక్కుడు, నువ్వులు, పెసర, మినుము, వేరుశనగ లేక సజ్జ, రబీలో ధనియాలు, అలసంద, పెసర సాగు చేయాలి.
- ☆ సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 15 వరకు రబీ కందిని విత్తుకోవాలి.

*2. యాంత్రిక పద్ధతులు*

- ☆ ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలతో నిఘా పెట్టాలి.
- ☆ మొక్కలను ఊపి పురుగులు కిందపడేపట్లు చేసి వాటిని పోగుచేసి నాశనం చేయటం.

*3. జీవ నియంత్రణ పద్ధతులు*

- ☆ ఎకరాలకు 20 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయటం
- ☆ ఎకరాకు 200 లార్వాలకి సమానమైన యన్.పి.వి. ద్రావణాన్ని అలాగే ఎకరాకి 400 గ్రా. బ్యాక్టీరియా సంబంధమైన మందుని పిచికారి చేయాలి.

*4. వృక్ష సంబంధిత మందులు*

- ☆ లీటరు నీటికి 5 మి.లీ. వేపనూనె గాని, 5 శాతం వేపగింజల కషాయం గాని పిచికారి చేయాలి.

*5. రసాయన పురుగు మందులు*

- ☆ అవసరాన్ని బట్టి మాత్రమే వాడాలి.
- ☆ రెండు అంత కంటే ఎక్కువ పురుగు మందుల్ని కలపటం మానుకోవాలి.
- ☆ పురుగు తొలిదశల్లోనే ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి.
- ☆ ఎండోసల్ఫాన్ 2 మి.లీ. క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ., క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేక ఎసిఫేట్ 1.5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి మందును పూత, కాయ దశల్లో స్ప్రే చేయాలి.
- ☆ చెట్టు పూర్తిగా తడవాలి. హ్యాండ్ కంప్రెషన్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయాలి. సింథటిక్ పైరిత్రాయిడ్‌లను వాడరాదు.
- ☆ సామూహికంగా పిచికారి చేపట్టాలి.

*మారుక మచ్చల కాయ తొలుచు పురుగు*

ఎన్.ఎస్.కె.ఇ. 5% లేదా వేపనూనె 5 మి.లీ. నీటిలో కలిపి పువ్వు, మొగ్గ వచ్చే దశల్లో చల్లాలి. దీని నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా నోవాల్యూరాన్ 0.75 మి.లీ., స్పైనోసాడ్ 0.75. మి.లీ. లేదా ల్యాండా సైహలోత్రిన్ 1 మి.లీ. తో పాటు డైక్లోరోవాస్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి మందులు మార్చి మార్చి పిచికారి చేయాలి.



## సోయాచిక్కుడు

- ☆ రైజోబియం జపానికమ్‌తో విత్తనశుద్ధి చేయాలి. 8 నుంచి 10 కిలోల విత్తనానికి 200 గ్రా. రైజోబియం సరిపోతుంది. ఆ తర్వాత కిలో విత్తనానికి 2 గ్రా . థైరమ్ + 1 గ్రా. కార్బండజిమ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.
- ☆ చదరపు మీటరుకు 40 మొక్కలు ఉండేటట్లు చూడాలి.
- ☆ సోయాచిక్కుడు ప్రత్తితో (1:1) కందితో (7:1) మొక్కజొన్నతో (1:1) అంతర పంటగా సాగు చేయవచ్చు. ఎకరాకు 12 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం మరియు 16 కిలోల పొటాష్ చివరి దుక్కిలో వేయాలి.
- ☆ విత్తే ముందు ఫ్లూక్లోరాలిన్ 43% ఎకరాకు లీటరు చొప్పున పిచికారి చేసి, భూమిలో కలియదున్నాలి. లేదా పెండిమిథాలిన్ 30% 1.4 లీటర్లు చొప్పున విత్తిన వెంటనే, మరుసటి రోజున కాని పిచికారి చేయాలి.

*సిఫారసు చేయబడిన రకాలు*

పి.కె. -472, హర్డీ, యమ్.ఎ.సి.యస్ - 201, జె.యస్.-335, యల్.యస్.బి. -1, పి.కె. -1029, ఎమ్.ఎ.సి.యస్. 58, 124, 330, 450, జె.యస్. 93-05, యమ్.ఎ.సి.యస్. -47, జె.యస్. (యస్.హెచ్.) - 93-97, ఎన్.ఆర్.సి. -37, డి.ఎస్.బి. 1.

- ☆ ఉత్తర మరియు మధ్య తెలంగాణా మండలాల్లో కేవలం నల్లరేగడి నేలల్లో మాత్రమే సోయా చిక్కుడును జూలై మొదటి వారంలోపు విత్తుకోవాలి.

*(వ్యవసాయ విశ్వవిద్యాలయం సౌజన్యంతో...)*



# భారతీయ గ్రామాలలో కాలుష్య నియంత్రణ

**భారతదేశం గ్రామాలలో జీవిస్తుంది. ఇప్పటికీ 77% జనాభా గ్రామాలలో ఉంటున్నారు. వీరు గతంలో ఉన్న స్వయం సమృద్ధ జీవనం నుండి ఆధార భూతమైన జీవనం వైపు అడుగులు వేస్తున్నారు. గతంలో చెరువు నుండి నీటిని ఎప్పుడు అవసరమో అపుడు తెచ్చుకొని వాడుకొనే వారు. ఇపుడు గ్రామాలలో కూడా కుళాయి నీటి మీద ఆధార పడ్డారు. కుళాయి వేస్తే విద్యుత్తుండదు. విద్యుత్ వచ్చేవరకు వేచి ఉంటారు. కుళాయి నీటిలో బ్లీచింగ్ కలిపే వారిపై ఆధారపడుతున్నారు.**

విద్యుత్ కోసం పడి గాపులు పడి వేచి ఉంటారు. టెలివిజన్ చూడాలంటే కరెంట్ ఉండాలి. అది ఎప్పుడు వస్తుందో తెలియదు. పాలు ఉదయాన్నే పాల కేంద్రాలకు, పట్టణాలకు తరలి వెళ్ళిపోతాయి. ఉదయం 7 గంటల తరువాత గ్రామంలో పాలు లభించని స్థితి నెలకొంది.

పారిశుధ్యానికి వస్తే, ప్రతి ఇంటి వారు తమ గుమ్మంతో సహా వీధులను కూడా శుభ్రం చేసుకొంటారు. ఇంటి పరిసరాల చుట్టూ గోవులపేడతో కళ్ళాపి జల్లి ముగ్గులు పెడుతుంటారు. ఉదయం ఇంటి నుండి పశువులు బయటికెళ్ళినా, ఎడ్లు లోపలికి వచ్చినా వాటి ద్వారా క్రిమికీటకాదులు ఇంటిలో ప్రవేశించకుండా, ఆ కళ్ళాపి జల్లు నిరోధిస్తుంది. గడపకు పసుపు పూయడం ద్వారా దాని గాలి వాసనకు కీటకాలు ఇంటిలో ప్రవేశించకుండా ఉంటాయి. నీటిని వాడేటప్పుడు కూడా పలు జాగ్రత్తలు తీసుకొని పశువులను మేపుతుంటారు. గ్రామంలో ప్రతి రైతు ఇంట్లో ఏకాలంలో ఏ విధమైన సురక్షిత చర్యలు చేపట్టాలో ఆ ఇంటి మహిళలకు తెలుసు. ఇంటిలో పెద్దావిడ మిగతా స్త్రీలందరికీ ఆయా పనులు ఏ విధంగా చేసుకోవాలో బోధిస్తుంది. పాలు, వెన్న, మజ్జిగ వంటివి ఏ విధంగా ఉపయోగించాలో, ఇతర అనేక అంశాలు ఎన్నో పెద్దల నుండి పిల్లలకు తెలుస్తాయి. (లేదా) వారు చేసిన పనులను పిల్లలు కూడా చేస్తారు.

గ్రామాలలో ఉమ్మడి కుటుంబాల వలన ఎన్నో లాభాలుండేవి. 'కలిసి ఉంటే కలదు సుఖం' అని, 'విడిపోతే అంతా విచ్ఛిన్నం' అని అనేవారు. కనుక కుటుంబాలు గ్రామ ఆర్థిక వ్యవస్థలో పునాదులు. ఏ విధమైన ఒడిదుడుకులు వచ్చినా నిలబడే స్థితిని కలిగిస్తాయి. పారిశుధ్యం విషయంలో కూడా బామ్మ ఇంటిలో అందరు ఆడవాళ్ళకు వారు చేయవలసిన పనులు వివరించేవారు. మరుగుదొడ్లను ఆనాడే నిర్మించుకొని డ్రైలెట్రిన్‌లను కూడా ఉపయోగించడం జరిగేది. బహిర్భూమికి వెళ్ళే ప్రాంతాన్ని పందులు శుభ్రపరచేవి. కనుక ప్రతి విషయానికి, సమస్యకు పరిష్కార మార్గాన్ని కనుగొనేవారు.

ఎందుకంటే, గ్రామంలో ప్రతి కుటుంబం ఒక స్వతంత్ర వ్యవస్థ. ఏవో కొన్ని విషయాలలో తప్ప, ప్రతి కుటుంబం స్వతంత్రంగా

వ్యవహరించేది. యజమానురాలు మొత్తం ఇంటి విషయాలను చూచుకొంటుంది. ముఖ్యంగా ఆ యింటి పెద్ద మహిళ కుటుంబంలో జరిగే అన్ని విషయాలు తెలుసుకొని ఇంటి పరిసరాలను ఎంతో శుభ్రంగా ఉంచుకొనే వారు.

అలాంటి స్వతంత్ర వ్యవస్థ నుంచి ఇప్పుడు ఆధార భూతమైన స్థితికి గ్రామాలు చేరుకొన్నాయి. కారణం 'కాలం', పరిస్థితుల ప్రభావం. గ్రామంలో ఒకప్పుడు ఎవరి వృత్తిని వారు చిత్తశుద్ధితో నిర్వహించేవారు. దానితో గ్రామాలు స్వయం సమృద్ధిగా ఉండేవి. కాని నేడు వ్యక్తిగత కుటుంబాలు ఏర్పడటం వలన ఎవరి సుఖం వారే చూసుకొంటున్నారు. సమిష్టి సహకారం దెబ్బతిన్నది. వ్యక్తిగత ప్రాయోజిత కుటుంబ వ్యవస్థ గ్రామాలలో కూడా వచ్చి చేరింది. ఎవరెట్లాపోతే మనకేం, మనం బాగుంటే చాలు అనే స్థితిలో ఉన్నారు. ఊరు బాగుపడితే ప్రజలు బాగుపడతారనే నానుడి దెబ్బతింది.

పంచాయతీ అధ్యక్షులు, మున్సబు, కరణాలు పదవులు వంశపారంపర్యంగా ఉండేవి. వారే గ్రామ అవసరాలను, పారిశుధ్యం పర్యవేక్షించే వారు. కాని నేడు పంచాయతీ అధికారుల పాలన వచ్చింది.



జీతానికి పనిచేయడం తప్ప గ్రామ క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పనిచేసేవారు కరువయ్యారు. దానితో గ్రామం తన స్వయం సమృద్ధతను కోల్పోయి, ఆధార భూతమైన స్థితికి నెట్టి వేయబడింది. ఏ ఇంటిలో ఏ సంఘటన జరిగినా మొత్తం గ్రామం అంతా తెలిసిపోయేది. అందువలన తప్పులు చేయడం జరిగేది కాదు. ఇప్పుడు ఉమ్మడితత్వం తరిగి పోయింది. విచ్చలవిడితనం పెరిగి, గ్రామాలలో కక్షలు, కార్పణ్యాలు, ద్వేషాలు ఏర్పడ్డాయి.

ఒక గ్రామంలో గతంలో ఒకే పార్టీకి మద్దతుగా ఉండి గ్రామావసరాల కోసం కలిసికట్టుగా ఓటు వేసేవారు. నేడు పలువురు పలు రకాలుగా ఎవరికి వారే మద్దతు తెలుపుకోవడం చేస్తున్నారు.

గ్రామంలో మంచినీటి సరఫరా, పారిశుధ్యపు పనులు అన్నీ పంచాయతీ చూచుకొనేది. చివరకు శ్మశానవాటిక ఊరికి వాస్తు ప్రకారం ఉండాలని అది గ్రామస్తులకు ఏ హానీ చేయకుండా ఏర్పాటు చేసేవారు. ఆ విధంగా అన్నీ శ్రద్ధగా చూచేవారు. వ్యక్తిగతంగా మరుగుదొడ్లు ఎవరి దొడ్లలలో వారు ఉపయోగించుకొని పరిశుభ్రంగా ఉంచుకొనేవారు. పంట కాలువల నీరు, మురుగు కాలువల నీటి వల్ల గ్రామాలలోని ఇండ్లకు హాని కలుగకుండా నిర్మించుకొని వాటిని ఎవరికి వారే పరిశుభ్రంగా ఉంచుకోవడం జరిగేది.

ఇప్పుడు గ్రామంలో ఎవరి పనులు వారికి సరిపోతున్నాయి. గ్రామ సమిష్టి సౌకర్యాన్ని చూసే సమయం ఉండడం లేదు. కేవలం వ్యక్తిగతంగా తమ పనులను తాము చూసుకునే స్థితికి పరిస్థితులు దిగజారిపోయాయి. గ్రామ ప్రజలు కూడా చెరువు నీటి స్థానంలో కుళాయి నీటిని అలవాటు చేసుకొన్నారు. కాలం, పరిస్థితులు గ్రామాలను ఆధార భూతంగా మార్చి వేశాయని చెప్పవచ్చును. అందుకు మన ఇడియట్ బాక్స్ అయిన టెలివిజన్ ప్రసారాల విస్తరణ కొంత వరకు కారణం.

సెల్‌ఫోన్ల పెరుగుదల కలిసి కట్టు జీవితాన్ని దెబ్బ కొట్టింది. ఒకే ఊరిలో ఉండి కూడా వ్యక్తులు కలుసుకొనడం తగ్గించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడం జరుగుతుంది. ఈ విధమైన మార్పులు గ్రామాలను ఆధార భూతంగా మార్చి వేస్తున్నాయి. నేడు పశువులను వ్యవసాయానికి వాడడం తగ్గింది. ట్రాక్టర్ల ఉపయోగం పెరిగింది. అందుకు ఆధునికీకరణ దోహదం చేసిందని చెప్పవచ్చును. గ్రామాలలో కూడా ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై పోతున్నాయి. వ్యక్తిగత కుటుంబాలు వచ్చేశాయి.

'ఒకటి రెండు ముద్దు, మూడోది వద్దు' అనే స్థితికి వచ్చేశారు. ఆసుపత్రులను ఆశ్రయిస్తూ, స్వయం పోషక కషాయాన్ని ఉపయోగించటం మానేశారు. గత రెండు మూడు దశాబ్దాలలో అల్లోపతి మందుల వాడకం పెరిగింది. కాని ఆయుర్వేదం, యునాని మందుల వాడకం నిలకడగా ఉంది. ప్రతి చిన్న అనారోగ్యానికి సూది మందు వాడకం వలన ఆరోగ్యం కుదుటపడక, వ్యాధి నిరోధక శక్తి తగ్గి గ్రామీణులు, వారి అలవాట్లలో మార్పులు వచ్చాయి.

కాఫీ, టీల వాడకం ఎక్కువై చిరుతిండ్లు అందుబాటులోకి రావడంతో ప్రధాన భోజనం వాడకం తగ్గించడం వలన వ్యాధి గ్రస్తులౌతున్నారు. ఇలాంటి ఆధార భూత స్థితి నుండి తిరిగి 'గో బ్యాక్ టు ది' బేసిక్స్ పద్ధతిలో ఆయుర్వేద మందుల వాడకం పెరుగుతుంది. పరిశుభ్రత, నాణ్యత, కాలుష్య నియంత్రణ తదితర విషయాలలో జాగ్రత్తలు పాటిస్తున్నారు. నీటి కాలువల వలన కలిగే ఆరోగ్య రుగ్మతలను, ముఖ్యంగా అతిసార వ్యాధిని నియంత్రించ కలుగుతున్నారు.

ఆసుపత్రులకు ముందు గ్రామాలలో ఉండే ఆయాలు ఎంతో సమర్థవంతంగా కాన్పులు జరుపడం చేసేవారు. కేవలం ధనుర్వాతం వలన పిల్లని కనలేక బాలింతలు మరణించడం అరుదుగా జరిగేది. కాని నూతన పద్ధతులు అవలంబించటం వలన ప్రాణనష్టాన్ని అరికట్ట గలుగుతున్నారు.

ఇట్లా ఒకటేమిటి అన్ని రంగాలలో చెప్పుకోదగ్గ మార్పులు గ్రామాలలో చోటు చేసుకున్నాయి. యువత కొంత శ్రద్ధ తీసుకొని గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల పారిశుధ్యం పట్ల ప్రతి వారూ శ్రద్ధ తీసుకొన్నా, ప్లాస్టిక్ వాడకం పెరిగి దుష్ప్రభావాలు కలుగుతున్నాయి. ఏది ఏమైనా గ్రామాలు ఎప్పుడూ నివాస యోగ్యమైనవే. అన్నింటిలోను అవి శ్రద్ధ తీసుకొంటాయి.

*- సి.ఎం.పి.*



# ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణలు

### స్వాతంత్ర్యానికి పూర్వరంగం

**భూ సంస్కరణలు అనే మాటను విస్తృతార్థంలో వ్యవసాయ సంస్కరణలనే అర్థంలో కూడా వాడడం జరుగుతోంది. ఇందులోకి ఆస్తి సంబంధాలు లేదా భూమికి సంబంధించిన ఉత్పత్తి సంబంధాలు కూడా వస్తాయి. భూ సంస్కరణలను మరింత నిర్దిష్టంగా నిర్వచించాలంటే, భూమి లేని నిరుపేదలకు భూమి హక్కును, భూమి వల్ల కలిగే ప్రయోజనాలను పునఃపంపిణీ చేయడమే.**

మన దేశంలో భూ సంస్కరణలపట్ల విధానాన్ని, శాసన నిర్మాణాన్ని అమలును చారిత్రకంగా విశ్లేషిస్తూ, భూ సంస్కరణలు మానవాళి అజెండాలో అతి పురాతన కాలం నుంచి ఉన్నాయంటారు పి.ఎస్ అప్పు. క్రీస్తు పూర్వం 6వ శతాబ్దిలో ఏథెన్స్‌కు చెందిన రాజనీతివేత్త సోలోన్ సంపన్నుల చేతిలో భూమి కేంద్రీకృతం కాకుండా నియంత్రించడానికి ప్రయత్నించాడు. క్రీస్తు పూర్వం ఏడవ శతాబ్దిలో చైనా రాచరికం భూ సంస్కరణలను ప్రవేశపెట్టడానికి ఎన్నో విఫల యత్నాలు చేసింది. తర్వాత మరో నాలుగు శతాబ్దాలకు రోమ్ రాజనీతివేత్త టిబిరియస్ ఇందుకు చేసిన ప్రయత్నాలు, కూడా ఫలించలేదు. చైనా (1949-52)లో మాదిరిగా విప్లవ పరిస్థితులు ఉన్నప్పుడు, లేదా రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జపాన్, తైవాన్‌లలో అనివార్య పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడే భూ సంస్కరణలను విజయవంతంగా అమలు చేయగలిగారంటారు.

మన దేశంలో భూ యాజమాన్యంలో విపరీతమైన వ్యత్యాసాలు నెలకొన్నాయి. కొద్దిమంది భూస్వాముల చేతుల్లో ఎక్కువ వ్యవసాయ భూమి కేంద్రీకృతం కాగా, చిన్న చిన్న ముక్కలను సాగు చేసుకుంటూ నిరంతరం అప్పులతో అణగారిపోయే చిన్న రైతులు లక్షల సంఖ్యలో ఉన్నారు సాగయ్యే భూమిలో సగానికి పైగా కౌలు కింద ఉండేది. కౌలు దారులలో చాలా మందికి స్థిరమైన కాలపరమితి కానీ, నిర్ణీతమైన కౌలు మొత్తం కానీ ఉండేవికావు. వీరి కంటే అట్టడుగున, మరింత అధ్వాన్నమైన ఆర్థిక, సాంఘిక పరిస్థితులలో అసంఖ్యాక వ్యవసాయ కూలీలు ఉన్నారు. భారతదేశ వ్యవసాయ రంగంలో మరో విలక్షణత, హిందూ కులవ్యవస్థకు, వ్యవసాయ సంబంధాలకు గాఢమైన అంతర్గత సంబంధం ఉండడం. భూస్వాములు అగ్రవర్ణాలకు చెందినవారూ సాగు చేసేది మధ్యకులాల వారు కాగా వ్యవసాయ కూలీలు షెడ్యూల్డు కులాలు, తెగలు, ఇతర వెనకబడిన వర్గాలకు చెందినవారు..

స్వాతంత్ర్యానికి ముందు మంచే వ్యవసాయాభివృద్ధికి, సమతా సమాజ సాధనకుగాను భూ సంస్కరణలు ప్రధాన రాజకీయ పక్షాల అజెండాలో ఉంటూ వచ్చాయి. స్వాతంత్ర్యం తర్వాత దీని పట్ల రాజ్యానికి ఉండవలసిన నిబద్ధతను ఒక విధంగా రాజ్యాంగమే నొక్కి చెప్పింది. భూమిపై, భౌతిక వనరులపై యాజమాన్యం సమిష్టి శ్రేయస్సుకు తోడ్పడేలా, పంపిణీ అయ్యేలా, సంపదకానీ, ఉత్పత్తి సాధనాలు కానీ కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమై. ఉమ్మడి ప్రయోజనానికి భంగం కలిగించని విధంగా రాజ్య విధానాలు ఉండాలని రాజ్యాంగ ఆదేశిత సూత్రాలలో భాగమైన ఆర్టికల్ 39


స్పష్టం చేసింది. ఆర్టికల్ 38 సాంఘిక ప్రతిపత్తిలో అవకాశాలలో వ్యత్యాసాలు తొలిగించి, ఆదాయాల మధ్య తేడాలను తగ్గించే విధంగా సాంఘిక వ్యవస్థను నెలకొల్పాలని చెప్పింది. రాజ్యాంగానికి చేపట్టిన తొట్టి తొలి సవరణ 1950 నాటి బీహార్ భూ సంస్కరణల చట్టానికి చెల్లుబాటు తేవడం కూడా ఒకటి..

### స్వాతంత్ర్యం (1947) వచ్చిన తర్వాత....

యాభైయవ దశకంలోనే కేంద్రప్రభుత్వ స్థాయిలో భూ సంస్కరణల విధాన రూపకల్పన జరిగింది. తొలి పంచవర్ష ప్రణాళిక (1951-56) లోనే వ్యవసాయ భూ పరిమితితో సమా భూ సంస్కరణల జాతీయ విధానానికి తొలిసారి అధికారిక రూపు రేఖలను స్పష్టం చేయడం జరిగింది. భూమి హక్కును జాతీయాభివృద్ధిలో ప్రాథమికాంశంగా పరిగణించడమేకాక, సంపదలో ఆదాయంలో వ్యత్యాసాల తగ్గింపు, దోపిడీ నిర్మూలను, కౌలుదార్లకు, కూలీలకు స్థిరమైన కాలపరిమితి. వివిధ వర్గాల గ్రామీణులకు సమానహోదా, సమాన అవకాశాల వంటి భూ విధానంతో ముడిపడిన సాంఘిక కోణాలను పంచవర్ష ప్రణాళిక నొక్కి చెప్పింది. తదుపరి ప్రణాళికలలో కూడా వీటిని పునరుద్ఘాటించడమే కాక, మధ్య దళారీల రద్దు, కౌలుదారీ సంస్కరణలు, భూ పరిమితి విధింపు, మిగులు భూములు పంపిణీ, ప్రభుత్వ భూముల కేటాయింపు, ఎస్.సి/ ఎస్.టి.ల భూముల రక్షణ తదితర అంశాలలో క్రమంగా ఒక సమగ్ర విధానం రూపుదిద్దుకుంది.

దేశంలోని మిగతా ప్రాంతాలలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా మొదట రాజ్యానికి రైతుకీ మధ్య అంచెలంచెలుగా ఏర్పడిన దళారీల తొలగింపునకే భూ సంస్కరణలు ప్రాధాన్యమిచ్చాయి. ఈ దళారీలు ఉత్పత్తికి ఏ మాత్రం దోహదపడకుండా వాస్తవంగా సాగుచేసేవారిని అనేక రకాలుగా వేధిస్తూ పంటలో గణనీయమైన వాటాను హరిస్తూ పరాన్నభుక్కులుగా జీవించే స్థితికి తోసేశాయి. స్వాతంత్ర్య స్ఫూర్తితో బ్రిటిష్ కాలం నాటి జమీందారీలను రద్దు చేయడం బహుశా తేలికయింది. కానీ వారికి పెద్ద మొత్తాల్లో నష్ట పరిహారంతో పాటు సొంతానికి విస్తారమైన భూములు వదిలిపెట్టారు. దళారీల రద్దు వల్ల గ్రామీణ సమాజంలో ఉన్నత, మధ్య వర్గాలు లాభపడ్డాయి. అత్యధిక సంఖ్యలో ఉన్న సన్నకారు రైతులకు, పాలికాపులకు, కూలీలకు దళారీల రద్దు వల్ల దక్కింది చాలా స్వల్పం. భూ సంస్కరణల వల్లనే వీరికి న్యాయం జరగవలసి ఉంది. భూ సంస్కరణలు భూ గరిష్ట పరిమితి విధింపు, భూమి పునఃపంపిణీ, కౌలు సంస్కరణలు, కౌలు రక్షణలాంటి చర్యలు.

ఆంధ్రప్రదేశ్ లేదా ఇతర రాష్ట్రాలలో భూ సంస్కరణలు దేశీయ విధానాన్నుంచి స్థూలంగా తెలుసుకోవచ్చు. కాని, ఇదే సమయంలో భూ సంస్కరణలు ఆయా ప్రాంత, ఆర్థిక, రాజకీయ, సాంఘిక పరిస్థితులను బట్టి తీర్చిదిద్ది అమలు చేయాల్సి వుంటుంది. తెలంగాణలో నిజాం వశంపారంపర్య జమీ హక్కులిచ్చిన ప్రాంతాల్లో దోపిడీ, అణచివేత చాలా తీవ్రంగా ఉండేవి. రైతులు దేశ్‌ముఖ్‌లకు/ దొరలకు అణగిమణిగి ఉండేవారు. వెట్టి సర్వసాధారణం. ముఖ్యంగా తెలంగాణలో, కొంతవరకు కోస్తా ఆంధ్రలో వ్యవసాయిక సాంఘిక సంబంధాలలో పరివర్తన కోసం తీవ్రవాద ఉద్యమాలు సాగిన విశిష్ట చరిత్ర ఆంధ్రప్రదేశ్‌కు ఉంది. ఉద్యమాన్ని అణచడానికి ప్రయత్నిస్తూనే, రైతులను ఆ పోరాట మార్గం నుంచి తప్పించడానికి ప్రభుత్వం భూ సంస్కరణల వైపు మొగ్గు చూపక తప్పలేదు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించేయత్నంలో భూదానోద్యమం పట్టింది. తెలంగాణలో దళారీల రద్దు రైతు పోరాట ఫలితమే. రాష్ట్రంలోనే కాదు. కేంద్రస్థాయిలో కూడా భూ సంస్కరణల అమలును తెలంగాణ రైతాంగ పోరాటం ప్రభావితం చేసి, దానికి ప్రాముఖ్యాన్ని తెచ్చి పెట్టింది.



తెలంగాణలో గైరుహాజరీ భూస్వామ్యం విస్తృతంగా ఉండడం వల్ల కౌలుదారీ భూములు ఎక్కువ. జనసాంద్రత అత్యధికంగా ఉండి కాలువ కింద సేద్యం జరిగే కోస్తా ఆంధ్రలో భూ యాజమాన్యం సగం కంటే తక్కువ కుటుంబాల అధీనంలో ఉంది. ఇక్కడ వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో ఉన్నారు. రాయలసీమలో కూలీలు అధిక సంఖ్యలో ఉన్నారు. రాయలసీమలో కౌలుదారీ భూములు ఎక్కువ. చిన్నపాటి చెక్కలను సాగుచేసుకునే పేదలు అత్యధికంగా ఉన్నారు.

ఆంధ్రప్రాంతం మద్రాస్ ప్రెసిడెన్సీ కింద ఉన్నప్పుడు 1908లో మద్రాస్ ఎస్టేట భూమి చట్టం, 1947లో మద్రాస్ ఎస్టేట్స్ భూమి (కౌలు తగ్గింపు) చట్టం వచ్చాయి. స్వాతంత్ర్యం రాగానే 1948లో భూ సంస్కరణలలో తొలి అడుగుగా దళారీల తొలగింపు ఉద్దేశంతో మద్రాస్ ఎస్టేట్స్ (రద్దు - రైత్వారీలోకి పరివర్తిన) చట్టం వచ్చింది. ఎస్టేట్లన్నిటిని రద్దు చేసి, భూమిని రైత్వారి పద్ధతిలోకి మార్చి మధ్య దళారీల నిర్మూలనే ఈ చట్ట ఉద్దేశం 1956లో ఆంధ్రలో కౌలుదారుల ప్రయోజనాలకు రక్షణ కల్పిస్తూ కౌలుదారీ చట్టం వచ్చింది.

### తెలంగాణ అనుభవం

తెలంగాణ విషయానికొస్తే 1907లో వచ్చిన మలఘుజారీలాండ్ రెవెన్యూ చట్టం ప్రకారం 12 ఏళ్ళుగా సాగుచేస్తున్న వారిని శాశ్వత కౌలుదారులు (షిక్‌మిదార్లు)గా గుర్తించింది. 1939 వ్యవసాయ భూములు అన్యాక్రాంత నిరోధ చట్టం ప్రకారం వ్యవసాయ కుటుంబానికి చెందిన వారికి తప్ప మరెవరికీ భూమిని బదలాయించకూడదు. 1944లో చేసిన అసామి షిక్మిచట్టం ప్రకారం ఆరేళ్ళపాటు సాగుచేసిన వారికి రక్షణ లభిస్తుంది. 1949నాటి జాగీర్థారీల రద్దు చట్టం ప్రకారం 1464 జాగీర్దారీలు రద్దయి 20 ఏళ్ళ కాల వ్యవధిలో నష్టపరిహారంగా 18 కోట్లు చెల్లించే ఏర్పాటు జరిగింది. కౌలు చెల్లింపును క్రమబద్ధీకరిస్తూ కౌలుదార్ల తొలగింపును నిషేదిస్తూ 1950లో

హైదరాబాద్ కౌలుదారీ-వ్యవసాయ భూముల చట్టం వచ్చింది. ఈ చట్టమూ ఇందులో అనంతర కాలంలో చేసిన సవరణల వల్ల 75 లక్షల ఎకరాలను సాగు చేస్తున్న 6 లక్షల మంది కౌలు దార్లకు రక్షణ లభించిందని అందునా, మొత్తం సాగుభూమిలో ఇది 33 శాతం. కౌలుదార్ల రక్షణకు ఉద్దేశించి సవరణ తెచ్చిన ఈ చట్టంలో 38 సెక్షన్ ఈ చట్టానికి గుండెకాయలాంటిది. తెలంగాణలో కౌలుదారీ శాసన నిర్మాణంలో ఇదొక విశిష్టాంశం.

భూ పరిమితుల విషయానికొస్తే, ఈ దిశగా శాసనపరంగా జరిగిన తొలియత్నం 1961 నాటి ఎ.పి. వ్యవసాయ భూపరిమితి చట్టం 27 నుంచి 324 ఎకరాల వరకు ఇది పరిమితి నిర్దేశించింది. ఈ చట్టం 1958లో ప్రచురితమైనా 1961లో కానీ ఆమోదానికి నోచుకోలేదు. జాతీయ స్థాయిలో మార్గదర్శకాలు రూపొందడంతో తదనుగణంగా ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయ భూముల పరిమితి) చట్టం 1973లో ఆమోదం పొంది, అదే సంవత్సరం జూన్ 1న అమలులోకి వచ్చింది. దీనికి ముందు 1972లో జారీ అయిన ఆర్డినెన్స్ పదిఎకరాలు దాటిన మాగాణి, పాతిక ఎకరాలు దాటిన మెట్టభూముల విషయంలో లావాదేవీలను నిషేదించింది. రెండు పంటలు పండే మాగాని విషయంలో 18 ఎకరాలు, మెట్టభూముల విషయంలో 54 ఎకరాల మేరకు పరిమితి విధించడం జరిగింది.

ఆంధ్రప్రదేశ్ తొలివిడత భూపరిమితి అమలు ఓ దారుణ వైఫల్యం భూ పరిమితుల విధింపు విషయంలో దేశవ్యాప్తంగా మాటకీ, చేతకీ మధ్య విస్తరించిన ఆగాధానికి ఆంధ్రప్రదేశ్ మినహాయింపుకాదు, మొదట్లో 30 లక్షల ఎకరాల మేరకు మిగులు భూమి లభిస్తుందని అంచనా వేశారు. కానీ దక్కింది 7,400 ఎకరాలు మాత్రమే. అందులో పేదలకు పంపిణీ అయింది మరింత తక్కువ 1973 చట్టం వచ్చాక తీసుకున్న రెండో విడత చర్యలు కొంతమేరకు మెరుగైన ఫలితాలనే ఇచ్చినా ఈసారి కూడా భూస్వాములు రకరకాలుగా తప్పుడు డిక్లరేషన్లు ఇచ్చి బినామీ, కూట లావాదేవీలు జరిపి అదనపు భూమిని నిలుపుకోవడంలో విజయం సాధించారు. 20 లక్షల ఎకరాలుగా మిగులు భూములను అంచనా వేస్తే, 1992 నాటికి అవి ఎనిమిది లక్షల ఎకరాలుగానే తేలగా అందులో 5.11లక్షల ఎకరాలనే పంపిణీ చేయడం జరిగింది. పంపిణీ అయిన భూమి కూడా చాలా వరకు నాసిరకం మెట్టభూమి.

## ఇతర దేశాలలో భూ సంస్కరణల అమలు

భారతదేశంలో భూపరిమితి చట్టాల అమలును అరకొర విధానం, అసమగ్ర శాసన నిర్మాణం, అసమర్థమైన అమలుకు ఉదాహరణ అని చెప్పుకోవచ్చు. ఈ విషయలో ఇతర దేశాలతో పోల్చి చూసుకుంటే మన ఘనత అర్థమవుతుంది. వ్యవసాయ భూముల పునఃపంపిణీ చైనాలో 43 శాతం, తైవాన్‌లో 37 శాతం, దక్షిణ కొరియాలో 32 శాతం, జపాన్‌లో 33 శాతం జరిగితే మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూ సంస్కరణలు చట్టాలు, వాటికి మళ్ళీ సవరణలు, భూ పరిమితి అలు లాంటి చర్యలతో 35 ఏళ్ళ సుదీర్ఘ కాలంలో పునఃపంపిణీ చేసిన భూమి కేవలం 1.25 శాతం. రాజకీయ సంకల్ప లోపం, శాసన నిర్మాణ ప్రక్రియలో విపరీతమైన సాచివేత ధోరణి, అయిష్టంగా, అసమర్థంగా జరిగిన అమలు, కింది నుంచి తగినంత ఒత్తిడి లేకపోవడం, పాలనాయంత్రాంగంలో జీర్ణించుకున్న లోపాలు, విచక్షణ లోపించిన న్యాయస్థానాల జోక్యం, ఖచ్చితమైన, తాజా వివరాలతో కూడిన భూమి రికార్డులు లేకపోవడం వైఫల్యానికి ప్రధాన కారణాలు. ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు చాలా మందికి భూస్వాముల పట్ల సానుభూతి లేదా స్నేహభావం ఉండడాన్నీ, కింది స్థాయిలోని రెవెన్యూ సిబ్బందిలో అవినీతి, వారు రాజకీయ అధికారం కూడా కలిగిన పెద్ద భూస్వాములు చెప్పు చేతల్లో పని చేస్తూ రావడాన్ని కూడా కాదనలేం, అసలు చట్టమే అస్పష్టంగా, ఓ చిక్కుముడిగా, తప్పించుకోవడానికి వీలు కల్పించే లొసుగులతో ఉంటూ వచ్చింది.

ఉద్దేశపూర్వకంగానే శాసనం ఆమోదంలో కూడా అపారమైన జాప్యం జరిగింది. ఈ అసాధారణ సాచివేతకు, దశలవారీగా చట్టాన్ని అమలు చేసే వైఖరి కూడా తోడై కూడా తోడై ఉన్న కొద్దిపాటి చట్టాల అమలునూ నీరుకార్చి భూస్వాములు ముందే జాగ్రత్త పడడానికి అవకాశమిచ్చింది. డేనియల్ థోర్నర్ వ్యాఖ్యానించినట్టుగా భూ సంస్కరణల ఆలోచనకూ, ఆచరణకూ మధ్య కాలాన్ని ఏ మాత్రం సాగదీసినా అది భూ యాజమానాల ప్రయోజనాలకే అనుకూలించి, పేదల ప్రయోజనాలకు భంగం కలుగుతుంది. ఈ వ్యవధిని అవకాశంగా తీసుకుని భూస్వాములు కాగితాల మీదే ఉమ్మడి కుటుంబ ఆస్తుల విభజన జరపడం, గ్రామాధికారుల చేత కీలక పత్రాలను తారుమారు చేయించడం, కౌలుదార్లను, పాలికాపులను, వ్యవసాయ సేవకులుగా కూలీలుగా నమోదు చేయించడం చేశారు. రాష్ట్ర రాజధానిలో ఏం జరిగినా, ఊళ్ళల్లో మాత్రం మా పెత్తనమే చెల్లుతుందని చెప్పి గ్రామాల్లోని పేదలను అనేక విధాలుగా లోబరచుకున్నారు.

ప్రభుత్వ ఆధీనంలో ఉన్న బంజరు భూములను పేదలకు పంపిణీ చేయడం రాష్ట్రంలో భూసంస్కరణల కార్యక్రమంలో ఒక ముఖ్యమైన భాగం. 1992 చివరినాటికి 37.29 లక్షల ఎకరాల మేరకు బంజరు భూమిని పేదలకు పంచినట్లు, ఇందువల్ల 19.13 లక్షల మంది లబ్ధిపొందినట్లు అంచనా, ఇందులో 11.24 లక్షల ఎకరాలను షెడ్యూల్డు కులాలాకు, 6.06 లక్షల ఎకరాలను షెడ్యూల్డు తెగలకు పంచారు. భూ పరిమితిని అమలు చేయడం, భూ సంస్కరణలు తేవడం అంటే ప్రాబల్య వర్గాల చేతుల్లోంచి భూమిని స్వాధీనం చేసుకుని, దానిని బలహీనులకు పంచి పెట్టడం కనుక ఆ ప్రక్రియ కొంతమేరకు కష్టంతో కూడుకున్నదే. దానితో పోల్చితే ప్రభుత్వ భూముల పంపిణీ కొంత సులువైనదే. కానీ వాస్తవంలో జరిగిందేమింటంటే ప్రభుత్వ భూముల్లో ఎక్కువ భాగాన్ని, అందులోనూ నాణ్యమైన భూమిని సంపన్న

భూస్వాములే కబ్జా చేశారు. వాళ్ళను తొలగించి, ఆ భూమిని పేదలకు కేటాయించడం చిత్తశుద్ధిలేని ప్రభుత్వానికి అసాధ్యం. ఒకవేళ పేదలకు కేటాయించినప్పటికీ దానిని వారికి స్వాధీనం చేయడమెలాగన్నది మరో గడ్డు సమస్య. ఎందుకంటే, పేదలకు కేటాయించిన భూముల్లో వారిని సాగుచేసుకోనివ్వకుండా భూస్వాములు వారిని ఏదో వ్యాజ్యంలో ఇరికించడమో, బెదిరించడమో, దౌర్జన్యానికి పాల్పడడమో పరిపాటిగా మారింది. ఇటువంటి ప్రభుత్వ భూముల కేటాయింపునకు సంబంధించిన కేసులు రెండు, మూడు దశబ్దాలుగా 'పెండింగ్'లో ఉన్నాయి.

ఈ సందర్భంలో ఒక ఆసక్తికరమైన విషయం చెప్పుకోవాలి. బ్రిటిష్ హయంలో కూడా వ్యవసాయ కూలీలైన షెడ్యూల్డు కులాలలోని భూమిలేని పేదలకు ఇవ్వడం కోసమే గ్రామాల్లోని కొంత ప్రభుత్వ భూమిని ప్రత్యేకంగా రిజర్వే చేసి ఉంచేవారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఇటువంటి భూమిని డిప్రెస్డ్‌క్లాస్ రిజర్వ్‌లాండ్ (అణగారిన వర్గాల కోసం రిజర్వ్ చేసిన భూమి) అనేవారు. ఇలా చేయడంలో కూలిపనులు చేసుకునే వారికి కొంత భూమి వనరును సమకూర్చాలన్న సూత్రం ఇమిడి ఉంది. అయితే కాలగతిలో ఈ భూమి, ఈ సూత్రము కూడా ఆవిరైపోయినటుట కనిపిస్తోంది.

రాష్ట్రంలో గిరిజన భూములు రక్షణకు తీసుకున్న శాసన చర్యలకు 1917 నుంచి సుదీర్ఘ చరిత్ర ఉంది. వాటిని క్రమబద్ధీకరించి 1959లో ఆంధ్రప్రదేశ్ భూ బదలాయింపు నియంత్రణ చట్టం పేరుతో ఒకచోటికి తెచ్చారు. 1970లో, 1978లో వీటిని మరింత సంస్కరించారు. కొన్ని పరిమిత ప్రాంతాలలో ఈ చట్టాన్ని సమర్థంగా అమలు చేసిన ఉదాహరణలున్నా, ఈ చట్టానికి విరుద్ధంగా విస్తారమైన గిరిజన భూములు ఇప్పటికీ గిరిజనేతరుల ఆక్రమణలోనే ఉన్నాయి.

అలాగే, దేవాలయాలు, ఇతర వ్యవస్థల కింద కూడా భూములు అపారంగా ఉన్నాయి. వీటిని సంపన్న భూస్వాములు లీజుకు తీసుకుని, పేదలకు సబ్‌లీజుకు ఇవ్వడం పరిపాటిగా వస్తోంది. గ్రామాల్లోని పేదలకు ప్రయోజనం కలిగే విధంగా వీటిని వినియోగించడం గురించి ఇంతవరకు తగిన విధానమే రూపొందలేదు. ఒకవైపు నుంచి భూస్వాములు, మరోవైపు నుంచి రాజ్యమూ గ్రామీణ పేదల హక్కులను హరించి వేస్తుండడంతో ఉమ్మడి ఆస్తి వనరులపై పేదల అదుపు క్షీణించిపోతోంది. స్థానిక ప్రజల అవసరాలను పట్టించుకోకుండా, అటవీ భూముల్ని చిరకాలంగా స్థిరపడిన ఆక్రమణల నుంచి తప్పించి, విస్తారమైన బంజర భూముల్ని రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి తీసుకువచ్చారు. దీని వల్ల పేదలకు అటవీభూములు అందుబాటులో ఉండే అవకాశాలు తగ్గిపోయాయి.

### భూ వనరులపై పేదల అధికారం

ఇటీవలి సంవత్సరాలలో పేదలకున్న భూములు క్రమంగా తగ్గుతున్నాయి. గ్రామీణ పేదలు తమ సొంతంగా చెప్పుకునే ఏదైనా వనరులను సంపాదించుకోవాలన్న ఆశ సజీవంగా ఉండాలంటే ప్రభుత్వంలో పైన చెప్పిన ధోరణులు మారవలసి ఉంది.

శాసన నిర్మాణమూ, అమలు ఎంత దుర్బలంగా ఉన్నప్పటికీ గ్రామ ప్రాంతాల్లో అధికార నిర్మితిని సవరించడంలో, తీవ్రతనూ, వ్యవసాయ బానిసత్వాన్ని, ఇంకా రకరకాల రూపాలలోని అణచివేతలనూ, తగ్గించడంలో భూసంస్కరణలు పరిమితంగానైనా ప్రభావం చూపించాయి. భూ పరిమితి విధింపు వల్ల లభించే మిగులు భూమి గురించి మొదట్లో వేసిన అంచనాలకు, వాస్తవంగా జరిగిన దానికీ హస్తిమశ్కాంతర దూరం ఉన్నా, పంపిణీ చేసిన భూమి పరిమాణంలో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రాంతంలో కౌలుదారీ చట్టం ప్రభావం పెద్దగా లేకపోయినా, తెలంగాణా ప్రాంతంలోని కౌలుదారులు గణనీయంగా లబ్ధిపొందారు. పేదలకు కేటాయించిన ప్రభుత్వ భూముల పరిమాణం విషయానికొస్తే, బహుశా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. పరిమితి విధింపు వల్ల దక్కింది కేవలం 1.5 శాతం భూమే అయినా, ప్రభుత్వ భూముల పంపిణీని కూడా కలుపుకుంటే మొత్తం కేటాయింపు 12.5 శాతం వరకు ఉంటుంది. ఇదేమంత తీసిపారేయవలసింది కాదు.

### పశ్చిమబెంగాల్‌లో భూసంస్కరణలు - ఫలితాలు

ఈ భూ సంస్కరణల వల్ల భూమి లేని వారికి భూ పంపిణీ పెద్ద ఎత్తున జరగకపోయినా, ఇవి వ్యవసాయ కార్మికుల స్థితిగతులపై అనుకూల ప్రభావం, చూపించాయి. భూమి కొందరి చేతుల్లో కేంద్రీకృతమవడం తగ్గి గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై వారి గుత్తాధిపత్యం సడలింది. దీంతో శ్రామిక విఫణిలో, వ్యవసాయ కార్మికులకు మరిన్ని మెరుగైన ప్రయోజనాలకు ఆస్కారం కలిగింది. పశ్చిమబెంగాల్‌లో దీని ఫలితాలు మరింత కొట్టొచ్చినట్టు కనిపించాయి. అక్కడ భూముల పునఃపంపిణీ కార్యక్రమం సాంప్రదాయిక భూస్వామ్య వర్గాల అధికార చట్రాన్నే కదిలించి వేసింది. పెద్ద ఎత్తున పాలికాపుల నమోదు, దాదాపు సార్వత్రికంగా గృహవివరాల సేకరణ, పాలికాపులను, వ్యవసాయ కార్మికులను తొలగించనివ్వని పరిస్థితి, కనీస వేతనాల చట్టం అమలు పశ్చిమ బెంగాల్ గ్రామీణ జీవితంలో ప్రముఖంగా చోటు చేసుకున్న పరిణామాలు. గ్రామీణ శ్రామిక విఫణి మరింత వైశాల్యాన్ని, విస్తృతినీ పొందింది. వేతనాల స్థిరీకరణ జరిగింది. అన్నింటికన్నా ముఖ్యంగా చెప్పుకోవలసింది, పేద వర్గాలలో కొత్తగా పాదుకొన్న ఆత్మగౌరవ భావన, వారి సామర్థ్యాల పెంపు, స్వీయ సామర్థ్యాల పట్ల, సంఘటిత శక్తి పట్ల వారిలో ఇనుమడించిన విశ్వాసం. తక్షణ భౌతిక ఫలితాలకన్నా ఈ కోణం మరింత ముఖ్యమైనది. ఈ విధంగా భూ సంస్కరణలు గ్రామీణ సమాజపు సాంఘిక, ఆర్థిక పునాదిని ప్రజాస్వామీకరించడానికీ, శ్రామిక వర్గాలు తమ సాంఘిక ఆర్థిక ప్రతిపత్తిని మెరుగుపరచుకునే దిశగా పోరాడే అవకాశాన్ని అందిపుచ్చుకోడానికీ తోడ్పడ్డాయి.

అయితే, సాంఘిక పరివర్తనకు ఒక మౌలిక అంశంగా ఒకప్పుడు భావించిన భూ సంస్కరణల అంశం వివిధ కారణాల వల్ల క్రమంగా ప్రాధాన్యం కోల్పోతూ వచ్చింది. సోషలిజానికి తగిలిన ఎదురు దెబ్బలు, వెనుకటి సోషలిస్టు దేశాలు మార్కెట్ ఆర్థిక వ్యవస్థ వైపు మొగ్గడం భూ సంస్కరణల నినాదాన్ని మరింత నీరుగార్చాయి. ఆచరణలో కూడా భూ సంస్కరణల కార్యక్రమం ముందుకు పోలేనే స్థితికి చేరింది. భూ పరిమితి చట్టాల కింద స్వాధీనం చేసుకున్న మిగులు భూమి పంపిణీ పూర్తయ్యాక భూమి పునఃపంపిణీకి సంబంధించి కొత్త కార్యక్రమం దేనినీ చేపట్టే అవసరం ఉండదనీ కేవలం బంజరు భూములు పంపిణీకి కార్యక్రమం పరిమితమవుతుందనే భావన నెలకొంది. భూ సంస్కరణల అంశం మొక్కుబడిగా ప్రస్తావనకు వస్తుండడం, ఒక క్రియాశీలమైన కార్యక్రమం గాక ఊకదంపుడు ఉపన్యాసాలకు వస్తువుగా, మేధావి వర్గాలలో ఒక కాల్పనికాంశంగా, రాజకీయవాదులకు ఒక జనప్రియ నినాదంగా, భూమిలేని నిరుపేదల ఆశలకు ఒక నిరంతర అలంబనగా మారడం తప్ప అది ఇంకెంత మాత్రం కీలకమైన ఒక సాంఘిక రాజకీయాంశం కాదనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది.

సెకండరీ సమాచారాన్ని గనుక విశ్లేషిస్తే, ఇప్పుడున్న భూ పరిమితి చట్టం పరిధిలోనే, కొద్దిపాటి సవరణలతో మరింత విస్తారమైన మిగులు భూమిని స్వాధీనపరచుకోవచ్చునని అర్థమవుతుంది. అష్రవుద్దీన్ కేసులో సుప్రీంకోర్టిచ్చిన తీర్పును రాష్ట్ర చట్టంలో సవరణ ద్వారా అమలు చేస్తే కొన్ని లక్షల ఎకరాల మిగులు భూమి లభ్యమవుతుంది. భూమి వనరుల సమానత్వ ప్రాతిపదిక మీద పేదలకు పంపిణీ అయ్యేలా చూడడమే భూ సంస్కరణల లక్ష్యం. ప్రభుత్వ భూమికీ, వ్యవసాయ భూమి పరిమితికీ చెందిన చట్టాలు, కౌలు చట్టాలు, భూమిలేని పేదల హక్కుల ప్రయోజనాల రక్షణకు ఉద్దేశించిన శాసన చర్యలతో సహా అన్నింటిని క్రమబద్ధీకరించి ప్రజల క్రియాశీల భాగస్వామ్యంతో, పేదల పట్ల అనుకూల స్పందన గల అధికార యంత్రాంగం మద్దతుతో ఒక సమగ్ర సమన్వయ వ్యూహంతో పట్టుదలగా సంస్కరణలను అమలు చేయనిదేపై లక్ష్యాన్ని సాధించడం కష్టం.

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ సంబంధాల నిర్మితి భూమి లేని వ్యవసాయ కూలీల సంఖ్య పెరగడానికి అవకాశమిచ్చింది. స్థానిక జీవన పరిస్థితుల ఒత్తిడుల వల్లా, సామర్థ్యాన్ని పేద వర్గాలు తమంత తాముగా పెంచుకోవడానికి వీలైన పరిస్థితులను సృష్టించడం అవసరం అలాగే, రెవెన్యూ వ్యవహరాలు నిగూఢమైనవన్న అభిప్రాయాన్ని తొలగించి భూమి రికార్డులలోని సారాంశం ప్రజలందరికీ తెలియజెప్పడం, గ్రామస్తులు తమ భూమి సమస్యలపై చర్చించడం, గ్రామస్తులు తమ భూమి సమస్యలపై చర్చించడం. ఏకాభిప్రాయసాధన ద్వారా పరిష్కరించుకునేలా గ్రామస్తులందరికీ అందులో ప్రమేయం కల్పించడం, ఉద్యోగులు భూమి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించేలా చూడడం కూడా అవసరం.

భూ సంస్కరణలను కేవలం పరిమితిని మించి ఉన్న భూములను స్వాధీనం చేసుకోవడం, దానిని భూమిలేని పేదలకు పంచడం అనే ఏకైక కోణం నుంచే చూడకూడదు. భూమినే కాక అధికారాన్ని కూడా బదలాయించడంగా గుర్తించాలి. భూ సంస్కరణలు అధికారాన్ని, ఆస్తిని, సాంఘిక ప్రతిపత్తిని కూడా ఒక వర్గం నుంచి మరో వర్గానికి బదలాయిస్తాయిస్తాయి. సొంతమని చెప్పుకోదగిన చిన్నపాటి చెలక లభించినా, పేదవారిలో ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, తామెవరికీ తక్కువ కాదనే భావనకలుగుతాయి. పేదరికం, పరాన్నజీవనం, దోపిడి, దుఃఖం, సమత్వం లోపించిన మానవ సంబంధాలు - అన్నింటికీ కేంద్రస్థానం భూమే అయినట్టు కనిపిస్తోంది. పేదలకు భూమిని పునఃపంపిణీ చేయడం వల్ల వారికి దోపిడి నుంచి విముక్తి లభిస్తుంది. శ్రామిక, సరపతి విపణులు పటిష్టమవుతాయి. లబ్ధిదారుల మనుగడకు ఒక ఆధారం లభించడంతోపాటు, వారికి ఆర్థికంగా, సాంఘికంగా హోదా లభిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, సొంతభూమి గ్రామీణ పేదలకు ఆర్థిక, సాంఘిక నిర్మితిలో తగినంత అధికారం కల్పిస్తుంది. తనదైన చిన్నపాటి భూమికోసం గ్రామీణ పేదలు ఎన్నికలలు కంటున్నారో తెలియనిది కాదు. ఒక నిశిత పరిశీలకుడు చేసిన వ్యాఖ్యను ఇక్కడ గుర్తుచేసుకోవడం సముచితంగా ఉంటుంది.

'సమానత్వం కోసం, భూమి కోసం పేదలుపడే అమితమైన తపన కొత్త విషయమేమీ కాదు. ఏ భౌతిక వాస్తవికత అయితే తమకు సమానత్వాన్ని, భూమిని లేకుండా చేసిందో, ఆ భౌతిక వాస్తవికతతో వారు ముఖాముఖి తలపడే క్రమంలో తమలో పుంజుకుంటూ వచ్చిన దృక్పథాలనూ విలువలనూ వారు ప్రతిఫలింపచేస్తారు. వాళ్ళ దృష్టిలో భూమి మీద యాజమాన్యమనేది తమ సాంఘిక ప్రతిపత్తిని సూచిస్తుంది. కనుక సమానత్వమంటే భూ యాజమాన్యంలో సమానత్వమనే అర్థం.'

కనుక భూ సంస్కరణలంటే, ఈ దేశ ప్రజలందరికీ వాగ్దానం చేసిన, రాజ్యాంగ పీఠికలోనూ నిర్దేశించిన సమానత్వం కోసం సాగించే పోరాటంలో ఒక భాగం. ఆంధ్రప్రదేశ్‌లోనే అయినా, మరెక్కడైనా ఈ లక్ష్యాన్ని సాధించనంత వరకు భూ సంస్కరణల అజెండా అసంపూర్తిగానే మిగిలిపోతుంది.

(అష్రవుద్దీన్ కేసు : 1982లో సుప్రీంకోర్టు 1971వ సంవత్సరం (భూపరిమితి చట్టం 1972 నుండి అమల్లోకి వచ్చింది). దానికి ముందు భూస్వాములు చేసుకున్న బినామీ బదలాయింపులు, రిజిష్టర్ కాని అమ్మకపు ఒప్పందాలను రద్దు చేస్తూ ఆ భూములను భూస్వామి కమతంగా చూపాలని తీర్పు ఇచ్చింది.)

గమనిక : ఈ వాస్యంలోని భూమి లెక్కలు ప్రభుత్వ రికార్డుల నుండి సేకరించినవి.


**- ఎస్.ఆర్. శంకరన్, ఐ.ఎ.ఎస్**

**మాజీ ప్రధాన కార్యదర్శి, త్రిపుర ప్రభుత్వం**

# పంచాయితీ రాజ్ వ్యవస్థలో రూరల్ కమ్యూని కేషన్స్ వ్యూహం


**పంచాయితీ రాజ్ వ్యవస్థకు, కమ్యూనికేషన్లకు అవినాభావ సంబంధం ఉంది. గ్రామ పంచాయితీలలో రెండు మార్గాల కమ్యూనికేషన్స్ ఉపయోగపడుతాయి.**

**పటం - 1**




గ్రామాలలో చదువు కొన్నవారు తక్కువ. కనుక వారికి సమాచారం అందించేందుకు తగిన మార్గాలున్నాయి. 1. వాయిస్ కమ్యూనికేషన్స్, 2. వ్యక్తిగత కమ్యూనికేషన్స్, 3. దృశ్య కమ్యూకేషన్స్

**పటం - 2**





ఉపాధ్యక్షుడు ➡ పంచాయితీ సమన్వయ సంఘం

లేదా

వార్డ్ సభ్యులు ➡ మహిళాధికారులు

**గ్రామ పంచాయితీలలో అభివృద్ధి కార్యక్రమాలు**

**పటం - 3**




నేడు గ్రామాలలో కూడా కమ్యూనికేషన్ల వ్యవస్థ విస్తారంగా అభివృద్ధి చెందింది. అందులో ముఖ్యంగా సెల్‌ఫోన్లు. వీటి ద్వారా పలురకాలైన



మెసేజ్‌లు పంపించవచ్చు. గ్రామంలో 'మీ-సేవా' కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఆ పనుల గూర్చి చిత్రాల ద్వారా, మెసేజ్ పంపవచ్చును.

లేదా డ్రమ్ము వాయింపు ద్వారా గ్రామంలోని పనులను గూర్చి, రేషన్ పంపిణీని గూర్చి సమాచారంను చేరవేయవచ్చు. గ్రామ పంచాయితీలో అధికారులు - వార్డు మెంబర్ల ద్వారా కూడా పలు రకాల సమాచారాన్ని చేరవేస్తారు. ఇందుకు గాను గ్రామ సర్పంచులు రూరల్ కమ్యూనికేషన్స్ కమిటీని ఏర్పాటు చేసుకొని దానికి సర్పంచికి దగ్గర గల సభ్యుని ఇన్ చార్జిగా నియమించుకుని సమాచారాన్ని పంపడం, రాబట్టడం చేస్తారు. గతంలో ఓరల్ కమ్యూనికేషన్ల ద్వారా నిర్వహించిన విధులను పంచాయితీ రాజ్ చట్టం-1994ని అనుసరించి కమిటీల ద్వారా కూడా నిర్వహించవచ్చు. అందుకు అదనంగా బడ్జెట్‌ను కూడా కేటాయించవచ్చు.

పంచాయితుల పరధుల్లోనున్న టూరిజం స్పాట్‌లను అభివృద్ధి పరచి ఆదాయాన్ని పెంచుకొనవచ్చును.

ముఖ్యంగా పంచాయితీల పరిధుల్లో దేవాలయాలను మరింత అభివృద్ధి చేసి టెంపుల్ టూరిజంను ప్రోత్సహించ వచ్చును. తద్వారా వచ్చే ఆదాయాన్ని మరింత పెంచవచ్చు. చెరువులు, విహార యాత్ర స్థలాలను వృద్ధి చేసి, వాటిని సమాచార కేంద్రాలుగా వివిధ పథకాల ప్రచారానికి ఉపయోగించవచ్చును. పంచాయితీలలో గ్రంథాలయా లున్నాయి. వాటిని సమాచార స్పాట్ కేంద్రంగా ఉపయోగించవచ్చు. నోటీసులను అంటించి పథకాల సమాచారాన్ని గ్రామస్థులకు అందించి, వాటిపై మరింతగా గ్రామస్థుల మధ్య అవగాహన కల్పించే విధంగా ప్రోత్సహించవచ్చును.

నేడు గ్రామ పంచాయితీలు కూడా సమాచార హక్కు పరిధి క్రిందకు వచ్చాయి. కనుక పంచాయితీ ఆఫీసరే సమాచార హక్కుల ఇన్‌చార్జి కనుక, ఆ వ్యక్తిని కూడా కమ్యూనికేషన్స్ చేరవేతకు సర్పంచులు ఉపయోగించవచ్చు . గ్రామ పంచాయితీయే కమ్యూనికేషన్స్‌కు అట్టడుగు స్థాయిలో ఉన్న ఆఫీసు. కనుక ప్రజలకు సమాచార చేర వేతలో చురుకైన పాత్రను పోషించాలి. అప్పుడే కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు వలన గ్రామ ప్రజలు లబ్ధి పొందేందుకు అవకాశం ఉంటుంది.

కమ్యూనికేషన్ లేనందువలన ఎన్నో అనర్థాలు కలుగుతాయి. పథకాలకు ఖర్చు చేసే ధనం వృధా అవుతుంది. పారదర్శకతతో వ్యవహరించే సర్పంచ్‌లు పథకాల ఫలితాలను ప్రజలకు చేరవేయవచ్చు. కాని గ్రామాలలో స్పర్థలు (Prejudices) ఉంటాయి. నేనెందుకు చేయాలి అనే అపోహలుంటాయి. ఆ అపోహలను తొలగించేందుకు కమ్యూనికేషన్స్ చానల్స్‌ను ఉపయోగించుకొని సర్పంచ్‌లు విజయాలను పొందవచ్చును. ఇది పంచాయితీలు అవార్డులు పొందేందుకు మంచి మార్గం. సర్పంచ్‌లు మంచికి, చెడుకు కూడా ఈ రూరల్ కమ్యూనికేషన్స్ ఛానల్సు ఉపయోగ పడుతాయని చెప్పవచ్చు.

గ్రామీణ మహిళల స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సేవా సంఘాలను గ్రామంలో వైద్యసేవలను అందించేందుకు వాడుకోవచ్చు. వీరి ద్వారా సమాచారాన్ని పంపవచ్చు. వీరికి విషయం తెలిస్తే అది ప్రజలకు చేరుతుంది.

గ్రామంలో స్వయం సహాయక సంఘాల సభ్యులను మార్కెట్ సమాచారం చేరవేతకు ఉపయోగించవచ్చు. పాల ఉత్పత్తి, అమ్మకం ధరవరలు తెలియవచ్చును. గ్రామంలో పండే పంటలు, వాటి మార్కెటు ధరవరలు కూడా తెలియ జేయవచ్చును. ముఖ్యంగా చేపల పెంపకం దారులు, కోళ్ళ పెంపకం చేసే వారు, గుడ్ల ధరలను కూడా ప్రచారం చేసి మార్కెట్టు చేసుకొనవచ్చును. ఇందుకోసం గ్రామీణ వినియోగ దారుల సంఘాలను సమాచార చేర వేతకు సర్పంచ్‌లు ఉపయోగించి గ్రామస్థులకు మరింతగా సేవలు అందించవచ్చు.

గ్రామాలలో అపోహలు ఎక్కువ ప్రచారం అవుతాయి. వాటిని ఎప్పటికప్పుడు ఖండించాలి. వాస్తవాలను తెలిపేందుకు ప్రయత్నించి సర్పంచులు విజయవంతమౌతారు.

ఏదైన ఆలోచన ఉంటే, దాన్ని గ్రామ సభ ఆమోదం ద్వారా అమలు చేయవచ్చును. అందుకు సంకల్పం (will power) అవసరం.

**- సి.ఎమ్.పి.**

# ఎల్లనృపులు గొలువ ఎరుగవే బాసాడి...

**రాజకీయ, ఆర్థిక, సాంస్కృతికాది కారణాల వల్ల కొన్ని కాలాలలో కొన్ని భాషలు ప్రాచుర్యంలోకి వస్తాయి. అలా ప్రాచుర్యంలోకి వచ్చిన భాషలను మాట్లాడితే గౌరవాధికారాలు కలుగుతాయి. అంతమాత్రం చేత అవి గొప్ప భాషలని అర్థం కాదు. కొన్ని భాషలను మాట్లాడటం వల్ల అంతటి గౌరవం లభించకపోవచ్చు. అంతమాత్రం చేత అవి గొప్ప భాషలు కావనీ కాదు.**

భాషలన్నింటికీ వ్యాకరణం ఉంటుంది. పండితుల భాషలకే కాదు, పామరుల భాషలకీ వ్యాకరణం ఉంటుంది. పామరులభాష లక్షణ విరుద్ధమనీ దానిని గ్రామ్యమన్నారు. కానీ ఏ భాషా గ్రామ్యం కాదు. ఒక నియమబద్ధమైన వ్యాకరణం లేనిదే పామరుడే కాదు పండితుడు కూడా మాట్లాడలేడు అలాగే భాషకీ భాషకీ మధ్య వ్యాకరణం వైవిధ్యంగా ఉంటుంది. కానీ వ్యాకరణం లేకుండా ఉండదు. మాతృక భాషల ప్రభావం, భౌగోళికాది కారణం వల్ల కలిగే ప్రభావాలు భాషలమధ్య వ్యాకరణ వైవిధ్యాలకి కారణాలవుతాయి. వీటి ఆధారంగా వ్యాకరణం ఏర్పడుతుంది. అది కూడా ఒక సువ్యవస్థితమై ఉంటుంది. శాస్త్రీయమైన అవగాహనతో పరిశోధించినప్పుడే ప్రతిభాషనీ ఉపయోగించుకొనే అవకాశం ఏర్పడుతుంది.

### మాండలికం జీవనాడి

వలసలు, భౌగోళిక, రాజకీయ కారణాలు; వర్గ, ప్రాంత, వైయక్తిక భేదాలు మాండలికాలను ఏర్పరుస్తాయి. వ్యక్తి వ్యక్తికీ భాషా వైవిధ్యం ఉంటుంది. ఒకే వ్యక్తి - వ్యక్తుల్ని బట్టి, ప్రాంతాలను బట్టీ రెండు మూడు రకాల భాషల్ని మాట్లాడటాడు. ఒక్క మాటలో చెప్పాలంటే వైవిధ్యం భాషకుండే జీవలక్షణం. కాలక్రమంలో ఒక భాష నుండి అనేక మాండలికాలు పుడతాయి. ఇలా విడిపోయిన భాషలు అన్ని ప్రాంతాలవారికి అర్థమవుతున్నంత వరకూ మాండలికాలుగా ఉంటాయి. అర్థం కానప్పుడు ఆ మాండలికాలే స్వతంత్ర భాషలుగా రూపుదాలుస్తాయి. వీటిలో మళ్ళీ అంతర్గత భేదాలుంటాయి. వీటిలోనూ అందరూ అంగీకరించే ఒక ప్రామాణికత అవసరం. అదే ప్రామాణికత భిన్నమాండలికాలలోనూ ఉంటుంది. అన్ని మాండలికాల్ని కలుపుకొంటే ఒక ప్రామాణిక భాష ఏర్పడుతుంది. ఈ దశలో భాషకు మాండలికాలు ఏర్పడ్డానికి గానీ, మాండలికాలన్నీ కలసి ఒక ప్రామాణికభాషను స్వీకరించడానికి గానీ ఒక క్రమ పరిణామం ఉంటుంది. తెలుగులో 4 మాండలికాలకు కోస్తా మాండలికం ప్రామాణికభాషగా ఉండడంలో తప్పులేదు. అలాగే ద్రావిడభాషలన్నింటికీ తమిళమే (మూల ద్రావిడభాష) ప్రామాణిక భాష. అందువల్ల ఇక్కడ మాండలికాలలో ఏది గొప్ప ఏది గొప్ప, కాదని ఆలోచించడం ప్రస్తుతం కర్తవ్యం కాదు. ఒక మాండలికం ఇంకొక మాండలిక వ్యవహర్తలకి అర్థం అవుతున్నందువల్ల ఇవన్నీ ఒకే గూటికి చెందిన పక్షులని అర్థం. ఇక్కడ ఏ పక్షి గొప్పదనే వివాదం కన్నా అన్నీ ఒకటేననే ఐకమత్యంతో బయటినుండి వచ్చే ఉపద్రావం నుండి కాపాడుకోగలగాలి.

### అమ్మభాషకు ఎన్నాళ్ళీ చిమ్మచీకటి?

దశాబ్దాలు దొర్లిపోతున్నాయి. విద్యాసంవత్సరాలు ఆవిరైపోతున్నాయి. కొత్త కొత్త విద్యలెన్నో పుట్టుకొస్తున్నాయి. కానీ అమ్మ భాష చుట్టూ ఇంకా చిమ్మచీకట్లే. పూర్తిస్థాయి మాధ్యమంగా గానీ ద్వితీయభాషగా గానీ ఆదరణకు నోచుకోలేదు. పోటీ పరీక్షలలో అసలు ఉనికే లేదు. మాట్లాడే సంఖ్య ఉంది. దేన్నైనా చెప్పడానికి అనువైన శక్తిసామర్థ్యాలు, వనరులు ఉన్నాయి. అయినా ఇంటా బయటా వలుకుబడి కోల్పోతోంది. ఇది ముమ్మాటికీ మానవ నిర్లక్ష్యమే కానీ భాషాదోషం కాదు. భావప్రకటన, విద్య, విజ్ఞాన సముపార్జనలు పైకి కనిపించే ప్రయోజనాలు. సంస్కారం, వ్యక్తిత్వం, ప్రతిష్ఠ, గౌరవం, మర్యాద, హోదాలు కనిపించకుండా ఒనగూరే అదనపు ప్రయోజనాలు. భాషల మధ్య ఉన్న తేడా జనసమూహాల్ని విడివిడిగా కలిపి ఉంచుతుంది. ఇది భిన్నత్వం. ఆయా భాషల మధ్య ఉండే పోలికలు భిన్న సమూహాల్ని మళ్ళీ ఏకీకృతం చేస్తాయి. కాబట్టి భిన్నత్వంలో ఏకత్వం సాధించడానికి భాషకూడా ఒక ప్రధాన ఉపకరణం. చరిత్ర, సంస్కృతీ సంప్రదాయాలు భాషారూపంలోనే తరువాతి తరాలకు వారసత్వంగా అందుతాయి. ఈ వారసత్వం మాతృభాషా వ్యవహర్తలకు సహజసంపూర్ణం. ఈ ప్రయోజనాలన్నీ తెలుగు ద్వారా తెలుగు మాట్లాడేవారికి అందుతున్నాయి. అసలు మాతృభాషను తక్కిన బోధనావిషయాలతో పాటు లెక్కించడమే పొరబాటు. అయితే తెలుగుకు కనీసం బోధనాంశాలకిస్తున్న ప్రాధాన్యం కూడా ఇవ్వకపోవడం దురదృష్టకరం. అందుకే దీనిపై చర్చోపచర్చలు, తర్జనభర్జనలు సాగుతున్నాయి. సాగాలి కూడా. ఇది దశాబ్దాలుగా నలుపుతున్న సమస్యే. తెలుగు భాషవ్యవహారం భ్రష్టమైపోతోందని సాంప్రదాయవాదులంటుంటే, భాషావేత్తలు మాత్రం - ఏ భాషా అంత తేలిగ్గా నశించపోదని, పుష్టివంతమైన తెలుగు భాష కది అసాధ్యమని ఆంగ్లపదాల చేరిక తెలుగు భాషకి శక్తినిస్తుంది. కాని నష్ట పరచదని, ఆ మాటకొస్తే ప్రస్తుతం తెలుగులో ఉన్న 80 శాతం పదజాలం సంస్కృతం, పారసీ, అరబ్బీ, ఉర్దూలనుండి వచ్చినవేనంటున్నారు. భిన్న అభిప్రాయాలు, దృక్పథాలు తెలుగు భాషకు కొత్తేమీ కాదు. అప్పుడు గ్రాంథిక, వ్యవహారిక శైలుల విషయంలోనూ ఇటువంటి సంకటమే తెలుగు ఎదుర్కొంది. పదజాలం ఏ భాషదైనా ఉండవచ్చు కానీ భాషకుండే సహజ లక్షణాలు దెబ్బతినకూడదు. అలా తెలుగు భాషకి జరగడానికి హేతువులు ఇష్టంగా మాట్లాడకపోవడం, చదవకపోవడం, చేతల్లో లేని భాషాభిమానం, ఉపాధి లేకపోవడడం, ప్రభుత్వం చొరవ చూపకపోవడమే. పట్టణాలలో ఉన్న కొద్దిమంది మాట్లాడనంత మాత్రాన తెలుగు నశించి పోదనీ, పల్లెల్లో తెలుగు ఇంకా సహజంగా ఉందనే ఇంకో వాదన ఉంది. దీనికి ప్రామాణికత సమాధానం చెప్తుంది. పాలకులను పాలితులు అనుకరిస్తుంటారు. నేడు పల్లెలన్నీ పట్టణాలవుతున్న నేపథ్యంలో పల్లె భాష నాగరికభాషను అనుకరిస్తుంది. దాని వల్ల ఉనికిని కోల్పోతుంది. ప్రసారమాధ్యమాల విస్తృతి కూడా దీనికి బాధ్యత వహించక తప్పదు.

## మాతృభాష ఎంతో మేలు

వ్యక్తికీ, వ్యక్తికీ భాషా వైవిధ్యం ఉంటుంది. మన ఇంట్లో మనం తిరిగినంత స్వేచ్ఛగా ఇతరుల ఇంట్లో తిరగలేం. సొంతభాషలో వ్యవహారం మన ఇంట్లో మనం స్వేచ్ఛగా తిరగడం లాంటిది. మన ఇంట్లో మనకు అన్నీ తెలుస్తాయి కాబట్టి, ఒక పనిని ఇట్టే చేయవచ్చు. అదే పనిని ఇతరుల ఇంట్లోనూ చేయవచ్చు. కానీ దానికి రెట్టింపు సమయం పడుతుంది. మాతృభాషలో మాట్లాడడం, అర్థం చేసుకోవడం, రాయడం, వినడం, చదువుకోవడం, ఆలోచించడం, ఇవన్నీ ఎంతో సహజంగా తక్కువకాలంలో ఎక్కువ ప్రయోజనాన్ని పొందే పనులు. అభివృద్ధి, మేధస్సు, కాలం అనే మూడే మానవపురోభివృద్ధి అనే ముక్కాలిపీటకు మూడుకాళ్ళు. తక్కువ కాలంలో మేధను అభివృద్ధివైపు నడిపించడానికి మాతృభాషను మించిన సాధనం మరొకటిలేదు. అందులోనూ భాషాపరమైన ఏ సమస్యలయినా పరిష్కరించుకోగల తెలుగులాంటి సమర్ధ భాషల ప్రయోజనం రెట్టింపుగా అందుతోంది. భారతీయ భాషలలో తెలుగుకు విభిన్న స్రవంతులను తనలో విలీనం చేసుకొనే సమర్ధత, సమన్వయ శక్తులున్నాయన్నాడు జె.బి.యస్. హాల్డెన్. ఆస్పత్రి, లాంతరు ఇంగ్లీషు పదాలనీ, తువ్వాలు, మేజువాణి ఉర్దూ పదాలనీ, అలమారు, బొత్తాము ఐరోపియా భాషాపదాలనీచెప్తే గానీ తెలీనంతగా తెలుగులో కలిసిపోయాయి. పెంపొందింపదగిన యోగ్యభాషగా, ఎంతో సుకరంగా, సమంజసంగా. పొంకంగా, భావ వ్యక్తీకరణ సామర్థ్యం సమకూర్చగల రూప నిష్పత్తి వైవిధ్యం కల భాషగా విలీయం కారే అనే భాషావేత్త తెలుగును అభివర్ణించాడు.

## దేశభాషలందు తెలుగులెస్స

అనేక భాషలు మాట్లాడేవారు ఉన్న సభలో వాగ్వవహారం చేసిన శ్రీకృష్ణదేవరాయలు అన్నమాట ఇది. ఈ మాట తెలుగు భాషా సామర్థ్యాన్ని, పరిపుష్టిని తెలియజేస్తోంది మాతృభాషస్థానాన్ని మరే భాషా పూరించలేదు. పరభాషను రుద్దడం సామాజికంగా, మనోవైజ్ఞానికంగా సమంజసం కాదు. పైగా నష్టదాయకం. జటిలమైన విషయాన్ని పరభాషలో కన్నా సొంతభాషలో నేర్చుకోవడం ఎంతో సులభం. అవగాహన ప్రక్రియలో అనుకోకుండా మాతృభాషలోనే ఆలోచన స్థిరపడుతుంది. అందుకే మాతృభాష సాధనమాత్రమైన స్థాయిని అతిక్రమించి, ఆత్మీయతాభావనలతో పెనవేసుకొంటూ మానవుని మూర్తిమత్వంలో ఒక అవిభాజ్యమయిన అంగంగా రూపొందుతుంది.

మనో వైజ్ఞానికంగా కూడా మాతృభాషే సమర్థవంతం. ఒక తెలియని విషయాన్ని సూటిగా స్పష్టంగా అపరిచితమాధ్యమంలో తెలుసుకోవడం కష్టం. మాతృభాషలో అయితే అది సులభం. ఇట్టే ధారణకి చిక్కుతుంది. పరభాషా మాధ్యమంలో చెప్పేవారికి, నేర్చుకొనే వారికీ విషయంపై ఆధిపత్యం రాదు. బట్టీయే శరణ్యం. కాశ్మీరు, నాగాలాండ్ రాష్ట్రాలలో ప్రవేశపెట్టిన ఆంగ్లభాషామాధ్యమం విఫలమవ్వడానికి కారణాలివే. అభివృద్ధిలో ముందున్న ఏ దేశంలోనూ పరభాష బోధనామాధ్యమంగా లేదు. రష్యా, జపాన్, ఇజ్రాయెల్ వంటి దేశాలెన్నో తమ భాషలను అధికార భాషలుగా; అన్ని స్థాయిలలోనూ బోధన భాషలుగా రూపొందించుకొని అంతర్జాతీయ రంగంలో ఆధునిక దేశాలుగా ముందు నిలబడ్డాయి. భాష ఆధారమయితే భావం ఆధేయం. రెండూ అపరిచితాలే అయితే అభ్యాసం క్లిష్టమేకాదు, నరకం కూడా. కోరి కోరి మనమే మన పిల్లల అధ్యయనాన్నినరకంలోనికి నెట్టేస్తూ మన అభివృద్ధి విషయంలో గోటితో సాధించే దానిని గొడ్డలివరకూ తెచ్చుకొంటున్నాం.

## తక్షణ కర్తవ్యం

దీనికోసం కృషి యుద్ధప్రాతిపదికన జరగాలి. భాషావేత్తలు, పండితులు, సృజనకారులు కంకణం కట్టుకొని సత్వరం చేయవలసిన కొన్ని ఉపాయాలున్నాయి.

1. శాస్త్ర సాంకేతిక రంగాల ద్వారా కొత్త కొత్తగా వస్తున్న ఆంగ్లపదాలకు ప్రత్యమ్నాయాలను ఎప్పటికప్పుడు తయారు చేయాలి. సాధారణంగా తెలుగులో పారిభాషికపదాలను కల్పించడానికి తత్సమపదాలనే ఎక్కువ వాడడం కన్పిస్తుంది. సంస్కృతం పరిభాషలకి అనుకూలంగా ఉంటుందని నమ్మకమే దీనికి కారణం. విద్యకి సంబంధించిన వివిధ శాస్త్రాల విషయంలోనూ సంస్కృత పదాలకే ప్రాధాన్యం ఇచ్చారు. వీటి విషయంలో ఇది అనివార్యమైనా అచ్చతెనుగు పదాలను వాడటం శ్రేయస్కరం. రేడియో, టీవీల్లాంటి పదాలను ఎలా తెలుగులోకి మార్చుకుంటామని అనుకుంటాం. తమిళంలో చూడండి, తమిళంలో సాధ్యమయినప్పుడు తెలుగులో ఎందుకు సాధ్యం కాదు.
2. అనువాదాలు విరివిగా జరగాలి. ఇప్పటికే తెలుగులో చదువుకోవడానికి అనేక శాస్త్రాలు అందుబాటులో లేవు. విదేశీరచనల్ని అనువాదం చేసే రచయితలు తక్కువే. మన రచనలు ఇతర భాషలలోకి వెళ్ళడం ఇంకా దయనీయంగా ఉంది.
3. భాషను స్పష్టంగా పలకడం, తప్పులు లేకుండా రాయడం, అభిమానంతో చదవడం అనే మూడు పనులు ప్రజలందరికీ ఒక గొప్ప బాధ్యతగా చేయాలి. ఇప్పటికే చాలమంది మాటల్లో, రచనల్లో గ్రాంధికవ్యవహారిక శైలిలు కలిసిపోయి కన్పిస్తుంటాయి. ఇది భాషకు నష్టం కలిగించకపోయినా భాషపట్ల ఆయా వ్యక్తులకుండే నిర్లక్ష్య వైఖరిని తెలియజేస్తుంది.
4. మన సంస్కృతిపట్ల, సమాజం పట్ల, భాషపట్ల గౌరవం ప్రతి ఒక్కరికీ ఉండాలి. వారసత్వంలో భాగంగా, ఉమ్మడి సంపదగా భాషను పరిరక్షించడం, ముందు తరాలవారికి అందించడం అవసరం. భాషను పరిరక్షించడం అంటే శైథిల్యం కాకుండా చూసుకోవడం, నిత్యనూతనంగా వ్యవహారంతో ఉండేలా చర్యలు తీసుకోవడం,

శరీరానికేదైనా రోగం వస్తే మందు వేసుకుంటాం. రాకుండా ముందుగా కూడా జాగ్రత్త కోసమూ మందు వేసుకుంటాం. మరి భాష విషయంలో ఏ ఔషధమైనా నోటివరకూ వస్తోంది కానీ, నోట్లోకి వెళ్ళడం లేదు. పొద్దున్న లేచింది మొదలు మాట్లాడితే కానీ జరగని బతుకులు మనవి. భాషే లేకపోతే అసలైన అంధకారం. అసలు ఇంత నిర్లక్ష్యం భాషపట్ల ఎందుకు వచ్చింది. స్వార్థ ప్రయోజనాలకు అతీతంగా ఆలోచించే వైఖరి భాష విషయంలో జరగడం లేదు. సమాజం-సంస్కృతి-భాష. ఈ మూడింటిలో ఏది అస్వస్థతకు గురైనా, మిగిలిన రెండూ దెబ్బతింటాయి. తల్లిపాలు తాగి పెరిగిన బాలురకు దీదిపాలు తాగి పెరిగిన బాలురకు ఎట్టి భేదం ఉంటుందో స్వభాషతో శాస్త్రాభ్యసనం చేసిన వారికీ పరభాషలో చేసిన వాడికి ఉంటుంది, అని కొమర్రాజు లక్ష్మణరావు, నేనే నియంతనైతే మన బాలురకు పరభాషా మాధ్యమం ద్వారా బోధించడం మాన్పించివేస్తాను అని గాంధీజీ చెప్పారు. ఇంకా రవీంద్రనాథ్ తిలక్, రాజేంద్రప్రసాద్, డా. జాకీర్ హుసేన్ వంటి వారు కూడా ఇదే చెప్పారు.

**(తెలుగు అకాడమి సౌజన్యంతో)**

**ప్రతి గ్రామ పంచాయితీకి ఒక సర్పంచ్ ఉంటారు. గ్రామ ఎన్నికల జాబితాలో పేర్లు గల ప్రజలందరూ సాధారణ ఎన్నికల్లో సర్పంచ్‌ని ప్రత్యేకంగా, మిగిలిన గ్రామ పంచాయతీ సభ్యులతో పాటు ఎన్నుకుంటారు. సాధారణ ఎన్నికల్లో ఎన్నికైన సర్పంచ్ సాధారణ ఎన్నికల తర్వాత గ్రామ పంచాయతీ మొదటి సమావేశానికి ఎన్నికల సంఘం నిర్ణయించిన తేదీ నుంచి అయిదు సంవత్సరాల పాటు పదవిలో ఉంటారు.**



# సర్పంచ్‌ల అధికారాలు, బాధ్యతలు

గ్రామ సర్పంచ్ పదవికి అకస్మాత్తుగా కల్గిన ఖాళీలో ఖాళీ ఏర్పడిన తేదీ నుంచి 120 రోజుల్లో సర్పంచ్‌ని ఎన్నుకోవాలి. ఆ విధంగా మధ్యంతర ఎన్నికలో సర్పంచ్‌గా ఎన్నికైన వ్యక్తి గ్రామ పంచాయితీకి మిగిలిన కాలానికి మాత్రమే సర్పంచ్‌గా పదవిలో ఉంటారు. సర్పంచ్ పదవి రీత్యా గ్రామ పంచాయతీ సభ్యులుగా ఉంటారు. గ్రామ సభ మీటింగులకు, గ్రామ పంచాయతీ మీటింగులకు సర్పంచ్ అధ్యక్షత వహిస్తారు. అంతేకాక, ఉపసర్పంచ్ పదవికి ఎన్నికలను నిర్వహిస్తారు. సర్పంచ్, ఉపసర్పంచ్ నిర్దిష్టమైన రూపంలో తమ పదవులకు రాజీనామా చేయవచ్చు.

గ్రామ సర్పంచ్ కార్యనిర్వాహక వర్గానికి అధిపతిగా ఉంటారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్యనిర్వహణాధికారి, (ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు) గ్రామాభివృద్ధి అధికారి (డెవలప్‌మెంట్ ఆఫీసరు) మొదలైన వారు సర్పంచ్ పాలనాధికారానికి లోబడి ఉంటారు. సర్పంచ్ సలహాపై గ్రామ కార్యనిర్వహణాధికారి గ్రామ పంచాయతీ సమావేశాలను, గ్రామ సభ సమావేశాలను ఏర్పాటు చేయిస్తారు. సర్పంచ్ గ్రామ పంచాయతీ కాగితాలు, పత్రాలు, లెక్కలు, రికార్డులన్నింటినీ తెప్పించుకొని వాటిని పరిశీలించవచ్చు.

పంచాయతీ రాజ్ చట్ట నిర్దేశాలను అమలు జరిపే సందర్భంలో ఆ గ్రామంలోని వ్యక్తి లేక వ్యక్తుల ఆస్తిపాస్తుల వివరాలను, ఇంకా ఇతర రకాల అవసరమైన సమాచారాన్ని అందించమని సర్పంచ్ అధికారిని కోరవచ్చు. గ్రామ పంచాయతీ సభ్యులలో ఏ సభ్యులైన అనర్హతకు గురైనప్పుడు సర్పంచ్ ఆ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారికి తెలియజేయాలి. గ్రామ పంచాయతీ తీర్మానాలను ఆమోదించిన రూపంలోనే సర్పంచ్ వాటిని అమలు జరిగేటట్టు చూడాలి. ఆయన ఆ తీర్మానాల పరిధిలోనే వ్యవహరించాలి.

గ్రామ సర్పంచ్ పదవికి ఖాళీ ఏర్పడినప్పుడు కొత్త సర్పంచ్ ఎన్నిక అయ్యేవరకు ఆ అధికారాలను ఉప సర్పంచ్ నిర్వహిస్తారు. సర్పంచ్ వరుసగా పదిహేను రోజులకు మించి గ్రామంలో లేనప్పుడు గాని, న్యాయ స్థానపు ఉత్తర్వుల కారణంగా కార్యక్రమాలను, విధులను నిర్వహించలేనప్పుడు గాని, విధుల నిర్వహణలో అశక్తులైనప్పుడు గాని సర్పంచ్ విధులు, బాధ్యతలు, అధికారాలను ఉపసర్పంచ్ నిర్వహిస్తారు. ఉపసర్పంచ్ కూడా పైన పేర్కొన్న కారణాల వల్ల విధులను నిర్వహింపజాలని పరిస్థితి ఏర్పడిన యెడల, సర్పంచ్ విధులను, బాధ్యతలను, అధికారాలను నిర్వహించటానికి కమీషనరు పంచాయతీ సభ్యులలో ఒకరిని తాత్కాలిక సర్పంచ్‌గా నియమిస్తారు.

సర్పంచ్ తన అధికారాలను గాని, విధులనుగాని, బాధ్యతలను గాని లిఖితపూర్వకంగా ఉపసర్పంచ్, లేదా ఉపసర్పంచ్ లేనప్పుడు పంచాయతీ సభ్యులలో ఏ సభ్యులైన నిర్వహించే విధంగా ఏర్పాటు చేయవచ్చు. అయితే, సర్పంచ్ ఆ విధంగా డెలిగేట్ చేసిన అధికారాలను ఉపసర్పంచ్ సర్పంచ్ నియంత్రణకు లోబడి వినియోగించాలి. సర్పంచ్ వాటిని ఎప్పుడైనా సవరించవచ్చు. తాత్కాలిక సర్పంచ్‌ని నిర్దేశాలలో పేర్కొన్న విధంగా కమీషనర్ పదవి నుంచి తొలగించవచ్చు. ప్రభుత్వం నిర్ణయించిన పారితోషికాన్ని సర్పంచ్ పొందవచ్చు.

### విధులు - బాధ్యతలు

**గ్రామ పంచాయితీలు అనివార్యమైన బాధ్యతలు (45 వ సెక్షను) :**

గ్రామ పంచాయితీలకు రెండు రకాల అధికారాలు ఉంటాయి. వాటిలో ఒకటి అనివార్యమైన బాధ్యతలు కాగా, మరొకటి ఐచ్ఛిక సంబంధమైన విధులు.

గ్రామ అవసరాలను తీర్చటానికి, ప్రజలకు కనీసావసరాలను సమకూర్చి వారి సంక్షేమానికి తోడ్పటానికి తనకు గ్రామ పంచాయితీ గల నిధుల మేరకు తగిన విధంగా కేటాయింపు చేయాలి.

- గ్రామ పంచాయితీ అధికారమందున్న అన్ని భవనాలు, రోడ్లు, వంతెనలు, కల్వర్టులు, రోడ్డు కట్టలు, దారుల నిర్మాణం,

మరమ్మత్తు, నిర్వహణలను చేయటం గ్రామ పంచాయితీ ప్రధాన కర్తవ్యం.

- అదే విధంగా పంచాయితీ గ్రామంలో ఉన్న పబ్లిక్ రోడ్లు, బజార్లు, బహిరంగ స్థలాలలో దీపాలను ఏర్పాటు చేయాలి. వర్షపు నీరు, మురుగునీరు పోవటానికి కాలువలను త్రవ్వించి వాటిని నిర్వహించాలి.
- గ్రామ పంచాయితీలో ఉన్న బజార్లలోను, వీధులలోను చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలు, పొదలు మొదలైన వాటిని తొలగించి పరిశుభ్రంగా ఉంచటం, వాడుకలో లేని బావులను, అపరిశుభ్రంగా ఉన్న కుంటలను, మడుగులను, పూడ్చించి పారిశుధ్యాన్ని కల్పించటం, ప్రైవేటు, పబ్లిక్ మరుగుదొడ్లను శుభ్రపర్చడానికి ఏర్పాట్లు చేయటం, శ్మశానాలు, ఖనన వాటికలను ఏర్పాటు చేసి వాటిని నిర్వహించటం.
- ఎవరూ పట్టించుకోని మానవ, జంతు కళేబరాలను సంస్కరింపచేయటం, అంటు వ్యాధులు, మలేరియా వంటి వ్యాధులు రాకుండా చూడటం, వచ్చిన వాటికి చికిత్స చేయించటం వంటి కర్తవ్యాలలో గ్రామ పంచాయితీ చర్యలు తీసుకోవాలి.
- ఎరువుల వనరుల సంరక్షణ, కంపోస్టు తయారీ, ఎరువుల విక్రయం వంటి పనులు జరిపించటంలో శ్రద్ధ చూపాలి.
- జనన, మరణ రిజిస్టరు నిర్వహించటం, బందెల దొడ్లను ఏర్పర్చి నిర్వహించటం వంటి కర్తవ్యాలను గ్రామ పంచాయితీలు నిర్వహించాలి.
- బావుల త్రవ్వకం, వాటి మరమ్మతు, చెరువుల త్రవ్వకం, వాటి మరమ్మతు, బట్టలు ఉతకటానికి, స్నానాలు చేయటానికి నీటిని అందేటట్లు చూడటం, త్రాగటానికి రక్షిత నీటిని కల్పించటం.
- వాటి నిర్మాణం, నిర్వహణా బాధ్యతలను గ్రామ పంచాయితీ వహించాలి. గ్రామ స్థాయిలో వనరుల ప్రణాళికను రూపొందించాలి.
- పంచాయితీ రాజ్యచట్టంలోని ఒకటవ అనునూచికలో పొందుపర్చిన 29 అంశాలలో ప్రభుత్వం పంచాయితీలకు అప్పగించిన అంశాలకు సంబంధించిన విధులను కూడా నిర్వహించాలి.

### ఐచ్ఛికమైన బాధ్యతలు (46వ సెక్షను)


గ్రామ పంచాయితీ గ్రామ అవసరాలను తీర్చటానికై తాను ఉచితమని భావించినట్టి కేటాయింపులను ఈ క్రింది విషయాలలో చేయవచ్చును.

- ప్రయాణీకులకు ధర్మశాలలు, సరాయిలు, విశ్రాంతి గృహాల నిర్మాణం, నిర్వహణ.
- రోడ్ల ప్రక్కన, బహిరంగ స్థలాల్లోను చెట్లను, తోపులను నాటి వాటిని పరిరక్షించటం.
- ప్రాథమిక దిగువ స్థాయిలో విద్య, ఎలిమెంటరీ విద్య, సాంఘిక, ఆరోగ్య విద్య, కుటీర పరిశ్రమలు, వాణిజ్యాలను పెంపొందించటం, అభివృద్ధి చేయటం.
- వైద్యశాలలను స్థాపించటం, గ్రామీణ వైద్యులకు సబ్సిడీలను చెల్లించటం.
- వైర్‌లెస్ రిసీవింగు సెట్లు, ఆట స్థలాలు, వ్యాయామ శాలలు, క్లబ్బులు, వినోదం, శారీరక పుష్టి కోసం కేంద్రాలను స్థాపించటం, వాటిని నిర్వహించటం.
- గ్రంథాలయాలను, పఠన మందిరాలను స్థాపించి వాటిని నిర్వహించటం.
- వికలాంగులకు, దిక్కులేని వారికి, అస్వస్థులకు సహాయం కల్పించటం.
- నారుమళ్ళను ఏర్పాటు చేసి వాటిని నిర్వహిచటం, మేలిరకపు విత్తనాలు, వ్యవసాయ పనిముట్ల స్టోరులను స్థాపించి వాటిని నిర్వహించటం, మేలురకాపు విత్తనాలు, క్రిమిసంహారకాలు, తెగుళ్ళ మందులను ఉత్పత్తి చేసి, వాటిని పంపిణీ చేయటం, పశు ప్రదర్శనలను, వ్యవసాయ ప్రదర్శనలను నిర్వహించటం.
- ఉత్పత్తిని పెంచే నిమిత్తం ప్రదర్శనా ప్లాట్లను ఏర్పాటు చేయటం, మేలిరకపు వ్యవసాయ పద్ధతులను ప్రచారం చేయటం.
- భూముల సహకార నిర్వహణను ప్రోత్సహించి ఉమ్మడి సహకార వ్యవసాయాన్ని నిర్వహించటం. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామీణ గృహ నిర్మాణ ప్రాజెక్టు పథకంలో పేర్కొన్నట్లు ఇటుకలు, పెంకులు, మడత బందులు, తలుపులు, కిటికీలు, వాసాలు, ఇతర కట్టడపు వస్తువులను తయారు చేయటానికై సహకార సంఘాలను పెంపొందించటం.
- గిడ్డంగులను, ధాన్యపు కొట్లను నిర్మించి, వాటిని నిర్వహించటం.
- పశువుల కొట్టాలను ఏర్పర్చి, వాటిని నిర్వహించటం.
- గ్రామ నివేశన స్థలాలను విస్తరింపజేయటం.
- ఆబోతులను కొనటం, పశుపోషణ, పశు సంవృద్ధి పర్చటం, పశు వైద్య సహాయాన్ని కల్పించటం.
- సంతలు, జాతరులు, ఉత్సవాలను నియంత్రణ చేయటం.
- గ్రామాలలో సామాజికాభివృద్ధి పనుల నిమిత్తం స్వచ్ఛంద సేవలను ఏర్పాటు చేయటం.

- ప్రసూతి శిశు సంక్షేమ కేంద్రాలను ఏర్పర్చి వాటిని నిర్వహించటం.
- కాపలా, రక్షణ, ఏర్పాట్లు చేయటం.
- కరువు, విపత్తుల సమయంలో సహాయం చేయటానికై ఏర్పాట్లు చేయటం.
- విచ్చలవిడిగా తిరిగే ఊరకుక్కలను నాశనం చేయటం.
- నిరుద్యోగులకు సంబంధించిన గణాంకాలను తయారు చేయించటం.
- పబ్లిక్ మార్కెట్లను తెరిపించి వాటిని నిర్వహించటం
- పబ్లిక్ పశువధాగృహాల (కబేళాల)ను ప్రారంభించి వాటిని నిర్వహించటం.
- కమతాల ఏకీకరణ, భూసార పరిరక్షణలతో పాటు భూసంస్కరణ చర్యలను అమలు జరిపించటం.
- ప్రజల్లో సామరస్య భావాన్ని, సంఘీంభావాన్ని నెలకొల్పి ప్రోత్సహించటానికై అస్పృశ్యతా నిర్మూలన, అనుసూచిత వర్గాల వారికి ఇండ్ల స్థలాలను కల్పించటం, అవినీతిని నిర్మూలించటం, మత్తు పానీయాలను, మత్తు పదార్థాల వాడుకను నిషేధించటం, జూదం, వ్యాజ్యాలను నిరుత్సాహ పర్చటం.
- గ్రామంలోని ప్రజల భద్రత, ఆరోగ్యం, నైతిక, భౌతిక సంక్షేమానికై చర్యలు తీసుకోవటం.

రెండు లేక అంతకుమించిన గ్రామ పంచాయితీలు నిబంధనల ప్రకారం ఉమ్మడి వైద్యశాలలను, శిశు సంక్షేమ కేంద్రాలను, ఇతర సంస్థలను నెలకొల్పుకొని వాటిని నిర్వహించవచ్చును.

గ్రామ పంచాయితీలు తమకు అందుబాటులో ఉన్న నిధులను బట్టి ఈ కార్యక్రమాలను చేపట్టి, వాటిని నిర్వహించవచ్చు. ఇవి ఐచ్ఛిక విధులే అయినప్పటికీ, వీటిని పూర్తిగా విస్మరించటానికి గాని, అలక్ష్యం చేయటానికి గాని వీలులేదు. సమాజంలోని ప్రజల సాంఘిక, ఆర్థిక,




అభివృద్ధి దృష్ట్యా, వీటి అమలు అవసరం చాలా ఉంది.

## గ్రామ పంచాయితీల హక్కులు, అధికారాలు

గ్రామ పంచాయతీ తన విధులను వినియోగింపదగు ఏదేని ప్రయోజనం నిమిత్తం విరాళాలను గాని, ట్రస్టులను గాని స్వీకరించవచ్చు. బందెలదొడ్డి విషయంలో పశువుల అక్రమ ప్రవేశానికి సంబంధించి విధించిన జరిమానాలను, ఎవరికీ సంబంధం లేని పశువులను అమ్మకం చేయటం ద్వారా వచ్చిన సొమ్మును పంచాయితీకి జమకట్టాలి. గ్రామ పంచాయితీ పోగు చేసిన చెత్తా చెదారం, ఇతర పదార్థాలు దానికే చెందుతాయి. చిన్న తరహా నీటి పారుదల చెరువుల్లో చేపలు పట్టుకోటానికి నిబంధనల ప్రకారం పంచాయితీ వాటిని వేలం పెట్టవచ్చు. అటువంటి చెరువు గట్లపై చెట్లను పెంచి వాటిపై వచ్చే ఆదాయాన్ని అవి పొందవచ్చు.

గ్రామంలోని సాముదాయక భూములు, వాటిపై వచ్చే ఆదాయం, పోరంబోకు భూములు, పచ్చిక బయళ్ళు పంచాయతీకి సంబంధించి ఉంటాయి. పోరంబోకు భూముల వినియోగాన్ని, ఆ భూముల్లో ఉన్న చెట్లు మొదలైన వాటి వినియోగాన్ని క్రమబద్ధం చేసే అధికారం పంచాయితీకి ఉంటుంది.

గ్రామ పంచాయితీకి పంచాయతీ చట్టం అనేక విధులను నిర్ణయించింది. ఈ విధులను సమర్థవంతంగా నిర్వహించటానికి పంచాయితీలకు నిధుల అవసరం ఉంటుంది. పంచాయితీలు అనేక పన్నులను విధించటానికి చట్టం అధికారాన్ని కల్పించింది.

గ్రామ పంచాయితీలు ఇంటి పన్నును, కొలగారం పన్నును, గ్రామంలో ఉన్న ఆస్తుల క్రయ విక్రయాలపై సుంకాన్ని విధించవచ్చు. వాహనాలపై పన్ను విధించవచ్చు, నిర్దిష్టమైన ప్రయోజనం నిమిత్తం వ్యవసాయ భూములపై పన్ను విధించవచ్చు. ఆక్రమించిన భూములపై వార్షిక కౌలు విలువపై రూపాయికి రెండు పైసల వంతున భూమి సెస్సు విధించవచ్చు. ప్రకటనలపై పన్ను వేయవచ్చు.

మార్కెట్లలో గాని, ప్రయివేటు మార్కెట్లలో గాని రోడ్లు నిర్మించాలని గాని, మురుగు నీటి వనరులను ఏర్పాటు చేయాలని గాని, గేట్లు పెట్టాలని గాని పంచాయితీ లిఖిత పూర్వక ఆదేశాలను వాటి యజమానులకు పంపవచ్చు. బజార్లకు, వీధులకు పేర్లు పెట్టటానికి, ఇండ్లకు నెంబరు వేయటానికి పంచాయితీకి అధికారం ఉంది. గ్రామంలో ఉన్న ఫెర్రీల విషయంలో వాటి నిర్వహణకు సంబంధించిన అధికారాలు పంచాయితీకి ఉన్నాయి. పంచాయితీ తన అవసరాల నిమిత్తం ఏ ఆస్తినైనా నిబంధనల ప్రకారం నష్టపరిహారాన్ని చెల్లించి సేకరించవచ్చు. ఆ ఆస్తి గ్రామ పంచాయితీకి చెందిన ఆస్తి అవుతుంది.

**- సి.ఎం.పి.**

# గాంధీటోపీ గవర్నర్ ఈడ్పుగంటి రాఘవేంద్రరావు

**అది మధ్యప్రదేశ్ (అప్పటిలో దానిని సెంట్రల్ ప్రావిన్సెస్ అనే వారు) లోని ఒక రైల్వే స్టేషన్. ఆ స్టేషన్‌లో అప్పటి రాష్ట్ర గవర్నర్ రైలు దిగారు. పోలీసులు, సైనికులు హంగామా చేస్తున్నారు. అది బ్రిటీష్ పరిపాలనా కాలం. ఆ రోజులలో సామాన్యులు గవర్నర్ దగ్గరకు వెళ్లడం అంత సులభమేం కాదు (ఇప్పుడు కూడా అదే పరిస్థితి). ఇంతలో ఒక సామాన్య వ్యక్తి గబ గబా చిరునవ్వుతో వచ్చి ఆ గవర్నర్‌తో కరచాలనం చేస్తూ తాను, ఆయన చిన్నప్పుడు సహాధ్యాయులమని గుర్తు చేశారు. అందుకు ఆ గవర్నర్ ఎంతో సంతోషించి, తన్న చిన్ననాటి సహాధ్యాయుని కుశల ప్రశ్నలు వేసి, అయిదు నిమిషాలు అతనితో కులాసాగా మాట్లాడి పంపివేశారు.**

ఒక సామాన్య వ్యక్తి ఇలా మంచి మర్యాద లేకుండా, ముందుగా అనుమతి పొందకుండా, సరాసరి గవర్నర్ దగ్గరకు వెళ్ళి, కరస్పర్శ చేయడం అప్పటి బ్రిటీషు ప్రభుత్వ ఉద్యోగులకు ఆగ్రహం తెప్పించింది. గవర్నర్ అక్కడి నుండి వెళ్ళిపోగానే ఆ సాధారణ ప్రభుత్వ ఉద్యోగిని ఆ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు.

ఈ విషయాన్ని తెలుసుకున్న గవర్నర్ వెంటనే ఆ వ్యక్తిని విడుదల చేయవలసిందిగా ఆదేశించారు. అంతేకాదు- ఆ వ్యక్తి అరెస్టుకు బాధ్యులైన పోలీసు అధికారులను శిక్షింపవలసిందిగా ఉత్తర్వులు చేశారు.



ఆ గవర్నర్ భారతీయుడే! అందులోనూ తెలుగు వాడు! ఆంధ్రులకు గర్వకారకుడైన శ్రీ ఈడ్పుగంటి రాఘవేంద్రరావు. ఆయన తండ్రి తాతలది కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా పెదమద్దాలి గ్రామం. కాంట్రాక్టు పనులపై ఆయన తాత అప్పటి మధ్య పరగణాలలోని నాగపూర్‌వద్ద గల కాంప్టీకి వెళ్లారు. ఆ తరువాత రాఘవేంద్రరావు తండ్రి అదే రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌కు వచ్చి, అక్కడ స్థిరపడ్డారు.

అప్పటి మధ్య పరగణాలలో హిందీ, మరాఠీ భాషలు ప్రధానమైనవి. ఆ రోజుల్లో తాంబే, రవిశంకర్ శుక్లా తండ్రి, ఎన్.బి. ఖరే మొదలైన హేమా హేమీలు మధ్యప్రదేశ్‌లో వుండేవారు. అలాంటి రాష్ట్రంలో ఎక్కడో కృష్ణాజిల్లా పెద్ద మద్దాలి గ్రామం నుంచి వచ్చిన ఆంధ్ర యువకుడు అక్కడ మహాకోసల రాష్ట్ర కాంగ్రెస్ సంఘానికి అనేక సంవత్సరాలు అధ్యక్షుడుగాను, బిలాస్‌పూర్ మున్సిపల్‌బోర్డుకు పన్నెండు సంవత్సరాలు ఛైర్మన్‌గాను, జిల్లా కౌన్సిల్‌కు ఎనిమిది సంవత్సరాలు అధ్యక్షుడుగాను, రెండుసార్లు ఆ రాష్ట్రానికి 'ప్రధాని' (నేటి ముఖ్యమంత్రి పదవి) గాను, అయిదు సంవత్సరాలు హోం శాఖ మంత్రిగాను, నాలుగుమాసాలు గవర్నర్‌గాను, పదినెలల పాటు వైస్రాయ్ కార్యవర్గ సభ్యుడుగాను, రెండు సంవత్సరాలు లండన్‌లో ఇండియా వ్యవహారాల శాఖ మంత్రికి సలహాదారుగాను వున్నారంటే ఆయన ప్రతిభా విశేషాలు, శక్తి సామర్థ్యాలు ఎంత మహోన్నతమైనవో మనం అర్థం చేసుకోవచ్చు.

రాఘవేంద్రరావులోని విశేషమేమిటంటే, ఆయన ఆ రోజుల్లో బ్రిటీష్ హయాంలో అంతటి ఉన్నత పదవులను నిర్వహించినప్పటికీ, దేశభక్తిని విడనాడలేదు. తన నిర్భయ, నిర్మొహమాట ప్రవృత్తికి స్వస్తి చెప్పలేదు. పదవి కోసం ఏ పరిస్థితిలోను ఆ తెల్లదొరలకు దాసోహమనలేదు. విశేషించి, భారతీయుల ప్రయోజన రక్షణకు, స్వరాష్ట్రీయుల సేవలకు ఆయన పదవులను ఉపయోగించారు. అదే ఆయన విశిష్టత. అందువల్లనే ఆయన భారతీయులకు, ముఖ్యంగా తెలుగువారికి చిరస్మరణీయుడు.

## పుట్టు పూర్వోత్తరాలు

రాఘవేంద్రరావు 1889 ఆగస్టు 4వ తేదీన నాగన్న, లక్ష్మీ నరసమ్మ దంపతులకు జన్మించారు. ఆయన మాతామహుని గ్రామం కృష్ణా జిల్లా దొండపాడు. జవహర్‌లాల్ నెహ్రూ కంటే ఆయన నాలుగు నెలలు పెద్ద. నెహ్రూ వలె ఆయన కూడా తన తల్లిదండ్రులకు ఏకైక పుత్రుడే. రాఘవేంద్రరావు బిలాస్‌పూర్‌లో విద్యాభ్యాసం చేశారు. ఆ రోజుల్లో బారిస్టర్ పట్టాపై యువకులకు మోజు ఉండేది. అందులోనూ రాఘవేంద్రరావు వాక్చతురుడు. అందువల్ల ఆయనకు బారిస్టర్ కావాలని వుంది. తండ్రి ప్రోద్బలంతో లండన్‌కు వెళ్లి మిడిల్ టెంపుల్ నుంచి బారిస్టర్ పట్టా తీసుకున్నారు.

లండన్‌లో బారిస్టర్ చదువుతున్నప్పుడు పోలీస్, సైనిక శాఖల నుంచి అనేక పతకాలు సంపాదించారు. ఇండియా తిరిగి వచ్చిన తరువాత బిలాస్‌పూర్‌లో బారిస్టర్‌గా ప్రాక్టీసు పెట్టినా ఆయనకు ధనార్జన పట్ల ఆసక్తి కలగలేదు. ఆయన దృష్టి ఎంతసేపూ ప్రజాసేవ పైనే. అప్పటిలో ఆయన నిత్యం ఖద్దరు దుస్తుల నే ధరించేవారు. ఆయన ఖద్దరు దుస్తులకు స్వస్తి చెప్పితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సహచరులు, శ్రేయోభిలాషులు ఎంత చెప్పినా వినలేదు.

ఒకనాటికి ఈ ఖద్దరును గవర్నర్ భవనానికి తీసుకువెళతానని ఆయన మిత్రులకు ప్రత్యుత్తరం ఇచ్చేవారు.

రాఘవేంద్రరావు వాక్శూరుడే కాదు, కార్యశూరుడు కూడా. తరువాత ఆయన ఆ రాష్ట్రానికి తాత్కాలిక గవర్నర్ అయినప్పుడు గవర్నర్ భవనంలో సోఫాలకు, తెరలకు ఖద్దరునే వినియోగించారు. తాను కూడా ఖద్దరు దుస్తులను, గాంధీ టోపీనే ధరించేవారు! గవర్నర్ భవనంపై బ్రిటీష్ జెండా! లోపల గవర్నర్ తలపాగా గాంధీ టోపీ! ఆ రోజుల్లో ఖద్దరన్నా, గాంధీ టోపీ అన్నా బ్రిటీష్ ప్రభుత్వానికి అరికాలి మంట తలకెక్కేది.

అలాంటి కాలంలో గాంధీ టోపీతోనే ఆయన గవర్నర్ పదవిని నిర్వహించారంటే, ఆయన ధైర్య సాహసాలను, దేశభక్తిని అర్థం చేసుకోవచ్చు. అందువల్లనే ఆయనను 'గాంధీ టోపి గవర్నర్' అన్నారు. కావాలనుకుంటే ఆయనకు ఆ రోజుల్లో బ్రిటీష్ ప్రభుత్వం ఎంత ఉన్నతమైన బిరుదైనా ఇచ్చి ఉండేది. సర్ అనే బిరుదును ఆయన నిరాకరించారు. అప్పటిలో మధ్య పరగణాల ప్రధాని (ఇప్పటి ముఖ్యమంత్రి)గా ఉన్న డా. ఖరేపై రాఘవేంద్రరావు గాంధీజీకి కొన్ని ఫిర్యాదులు చేయగా, అందుకు గాంధీజీ మీరే ప్రధానిగా ఉండవచ్చు గదా అని అడిగారట. అపుడు తాను ప్రజల ద్వారా ప్రధాని

కావాలేగాని, గాంధీజీ ద్వారా కాదని రాఘవేంద్రరావు సవినయంగా సమాధానమిచ్చారట.

ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వాన్ని స్తంభింప చేయాలనే ఆశయం స్వరాజ్యపార్టీ అగ్రనాయకులైన మోతీలాల్‌నెహ్రూ, చిత్తరంజన్ దాసుల స్వరాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బెంగాల్‌లలో సాగలేదు గాని, రాఘవేంద్రరావు నాయకత్వంలోని మధ్య పరగణాల్లో మాత్రం పూర్తిగా నెరవేరింది. రావు మధ్యప్రదేశ్‌లో మూడు సంవత్సరాల పాటు ప్రభుత్వాన్ని స్తంభింప జేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గించారు. మంత్రికి నెలకు రెండు రూపాయలే వేతనం ఉండాలనే నిబంధనను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. ఆ దెబ్బతో ప్రభుత్వం భయపడి శాసనసభను సమావేశపర్చడమే మానివేసింది.

1937లో రాఘవేంద్రరావు మధ్య పరగణాల ప్రధాని పదవిని అధిష్ఠించారు. అందుకు కాంగ్రెస్‌కు ఆయన రాజీనామా చేయటమేకాక ఆ సంస్థ ద్వారా సంక్రమించిన శాసనసభ సభ్యత్వానికి కూడా రాజీనామా చేసి, తిరిగి ఎన్నికవటం ద్వారా ఆనాడే ఒక ఉత్తమ సంప్రదాయానికి మార్గదర్శకులైనారు.

## బ్రిటీష్ సైనికులకు శాస్తి

రెండున్నర సంవత్సరాల పాటు మధ్య పరగణాలకు ప్రధానిగా ఉన్న తరువాత రాఘవేంద్రరావు ఆ రాష్ట్రానికి హోం మంత్రిగా నియుక్తులైనారు. ఆయన హోంమంత్రిగా ఉండగా, ఒక సంఘటన జరిగింది. ఒక గ్రామంలో యూరోపియన్ సైనికులు కొందరు స్త్రీల పై అత్యాచారం జరపగా, కోపోద్రిక్తులైన గ్రామీణులు ఆ సైనికుల ను చితకబాదారు. వెంటనే ఎక్కువ సంఖ్యలో సైనికులు మరొక గ్రామంపై పడి దాన్ని దగ్ధం చేశారు. దేశంలో గగ్గోలు బయలుదేరింది. అత్యాచారం జరిపిన సైనికులను శిక్షించాలనే ఆందోళన బయలు దేరింది. తమ సైనికులను కంటితుడుపుగా శిక్షించాలని, అందుకు గాను వారిని సైనిక న్యాయస్థానంలో విచారించాలని వైస్రాయ్ ఎత్తుగడ వేశాడు. అయితే సైనికులను సివిల్ కోర్టులో మాత్రమే విచారించాలని హోంమంత్రి హోదాలో రాఘవేంద్రరావు పట్టుబట్టారు. వైస్రాయ్ చివరికి దిగి వచ్చాడు. రాఘవేంద్రరావు వాదనా పటిమ అలాంటిది. ఎలాంటి వారైనా ఆయన వాగ్ధాటికి లొంగాల్సిందే.

## నైతిక విలువలు

రాఘవేంద్రరావు కొంత కాలం సి.పి. ప్రభుత్వంలో విద్యామంత్రిగా వున్నారు. ఆయన బావమరిది ఒక కాలేజి లెక్చరర్. ఆయనకు ప్రొఫెసర్‌గా ప్రమోషన్ ఇవ్వవలసిన సమయం వచ్చింది. అప్పుడు రాఘవేంద్రరావు అందుకు సంబంధించిన అధికారిని పిలిచి, అతనితో ''ప్రమోషన్‌కు నా బావమరిది అర్హుడైనా, ఆయనకు ప్రమోషన్ ఇస్తే నేనే ఇప్పించానని ప్రజలు అనుకుంటారు. కాబట్టి నేను విద్యామంత్రిగా వున్నంతకాలం దయచేసి నా బావమరిదికి ప్రొఫెసర్‌గా ప్రమోషన్ ఇవ్వకండి'' అని చెప్పారు.

ఇలాంటి నిజాయితీపరులైన పరిపాలకులు, రాజకీయ వేత్తలు ఇప్పుడు ఎందరు వుంటారు? 1936లో సి.పి. గవర్నర్ సెలవుపై లండన్ వెళ్ళినప్పుడు ఆ స్థానంలో రాఘవేంద్రరావు నాలుగు నెలల పాటు గవర్నర్‌గా నియమించబడ్డారు. ఆయన అప్పటిలో అడిగిన ప్రతి పౌరునికి ఇంటర్వ్యూ ఇచ్చి, వారి కష్టనష్టాల నివారణకు కృషి చేశారు.

1939లో ఆయన లండన్‌లోని భారత వ్యవహారాల మంత్రికి సలహాదారుగా నియమితులయ్యారు. ఇది ఒక భారతీయునికి లభించే అత్యున్నతమైన పదవి. ఈ పదవిలో వుండగా ఆయన భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చే విషయంలో భారతీయ ప్రయోజనానికి బ్రిటీష్ ప్రభుత్వం ఏమాత్రం వ్యతిరేకంగా ఆలోచించినా, రాజీనామా చేస్తానని ఆయన హెచ్చరించారు.

## ఆంధ్రరాష్ట్రం పట్ల ఆసక్తి

ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావాలని రాఘవేంద్రరావు మొదటి నుంచి కోరేవారు. ఆయన 1930లో లండన్‌లో భారత మంత్రికి సలహాదారుగా వెళ్ళేముందు సత్వరం ఆంధ్రరాష్ట్ర నిర్మాణావశ్యకతపై ఆంధ్రులకు సలహా ఇచ్చారు. ఆంధ్రరాష్ట్రం నిర్మిస్తే, మద్రాసు రాష్ట్రంలో అల్లర్లు జరగవచ్చునని ఆ రోజుల్లో మద్రాసు ప్రధానమంత్రి ముఖ్యమంత్రిగా వున్న రాజాజీ భారత మంత్రికి వ్రాసిన లేఖ విషయం గురించి శ్రీ రాఘవేంద్రరావు ఆంధ్ర నాయకుడు టంగుటూరి ప్రకాశం గారితో చెప్పారు.

## క్రిప్స్‌కు గుణపాఠం

లండన్‌లో భారత మంత్రికి సలహాదారుగా పనిచేసిన తరువాత రాఘవేంద్రరావు భారతదేశంలో వైస్రాయ్ కార్యవర్గంలో పౌర రక్షణ శాఖకు సభ్యుడు (ఇప్పుడైతే మంత్రి పదవి)గా 1941 జూలైలో నియుక్తులైనారు. అప్పుడే భారతదేశానికి స్వాతంత్ర్యమిచ్చే విషయమై కొన్ని ప్రతిపాదనలతో బ్రిటీష్ మంత్రి సర్ ష్టాఫర్ట్ క్రిప్స్ మనదేశం వచ్చారు. సర్ ష్టాఫర్ట్ నాటకమాడుతున్నాడని గ్రహించిన ఈడ్పుగంటి ఢిల్లీలో గాంధీజీని కలుసుకుని, క్రిప్స్ ప్రతిపాదనలు ఇండియాకు ప్రయోజనకరం కాకపోగా, ప్రమాదకరం కాగలవని చెప్పారు. అప్పుడు గాంధీజీ రాఘవేంద్రరావుతో మిమ్మల్ని కలుసుకోనడానికి నేనే వచ్చేవాడిని కదా, మీరు శ్రమపడి ఎందుకు వచ్చారని అనగా, రాఘవేంద్రరావు మీ పట్ల గౌరవ ప్రపత్తులతో నేనే వచ్చానని సమాధానమిచ్చారు. ఇది మహాత్మునికి రాఘవేంద్రరావు పట్ల గల గౌరవానికి నిదర్శనం.

తరువాత సర్ ష్టాఫర్ట్ క్రిప్స్ తనను కలుసుకోవలసిందిగా రాఘవేంద్రరావును ఆహ్వానించారు. అప్పుడు రాఘవేంద్రరావు ''మీరు భారతీయ నాయకులను విడివిడిగా కలుసుకొని, ఒకరికి చెప్పింది. మరొకరికి చెప్పకుండా నాటకమాడితే లాభం లేదు. భారతీయ నాయకులందరినీ సమావేశపరచి దేశ రక్షణ శాఖను కూడా భారతీయునికే ఇవ్వడానికి మీరు అంగీకరిస్తే, మీ ప్రతిపాదనలకు భారతీయ నాయకులు అంగీకరించవచ్చు'' అని క్రిప్స్‌కు చెప్పారు. తన క్రింద అధికారి, వైస్రాయ్ కార్యవర్గంలో సభ్యుడుగా వున్న వ్యక్తి అంత నిర్మోహమాటంగా మాట్లాడడం క్రిప్స్‌కు కోపం తెప్పించి, ఏదో వాఖ్యానించాడు.

వెంటనే రాఘవేంద్రరావు ''నా అంతట నేను మిమల్ని కలుసు కోలేదు. మీరు ఆహ్వానిస్తేనే వచ్చాను. అడిగారు కాబట్టి, అభిప్రాయం చెప్పాను. ఇక మీ ప్రతిపాదనల సంగతి చూసుకోవలసింది మీరే!'' అని దిగ్గున లేచి వచ్చారట. అదీ ఆయన సూటిదనం. లండన్‌లో వున్నప్పుడే రాఘవేంద్రరావు ఆరోగ్యం చెడింది. వైస్రాయ్ కార్యవర్గ సభ్యుడుగా వున్నప్పుడు మరింతగా అస్వస్థులైనారు. స్వస్థలమైన బిలాస్‌పూర్‌కు వెళ్లాలని అనుకుంటుండగా 1942 జూన్ 15న ఆయన ఢిల్లీలో శాశ్వతంగా కన్నుమూశారు. ఆయన అకాల మృత్తి వార్త యావద్భారతావనికి, ముఖ్యంగా మధ్య పరగణాలకు, ఆంధ్రదేశానికి పిడుగుపాటువలె విన్పించింది. ఆయన గుణగణాలను కీర్తిస్తూ 'లండన్ టైమ్స్' మొదలైన పత్రికలు సంపాదకీయాలు వ్రాశాయి. అప్పటికి ఆయన వయస్సు 52 సంవత్సరాలే!

స్వాతంత్ర్యానికి పూర్వమే జాతీయ రాజకీయ రంగంలో ప్రముఖ పాత్ర వహించిన ఆ మహాంధ్రునికి స్వరాష్ట్ర రాజధానిలో ఇంతవరకు స్మారక చిహ్నం లేకపోవడం విచారకరం.

*- జానమద్ది హనుమచ్ఛాస్త్రి*
*విశ్రాంత అధ్యాపకులు*

# రేబిస్ నివారణ – జాగ్రత్తలు



## మా కుక్కల బాధలు పరిష్కరించండి - మిమ్మల్ని కూడా రక్షించుకోండి

**హాయ్... నా పేరు హనీ.. మాది రాజమండ్రి. ఈ మధ్య మా రాజమండ్రిలో పిచ్చికుక్కలు కరిచి ముగ్గురు చనిపోయారని తెలిసి చాలా బాధపడ్డాను. కొందరి నిర్లక్ష్యం వల్ల, మా జాతికి చెందిన-జబ్బుపడిన కొందరు మా మిత్రులవల్ల ఈ విధంగా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవటం బాధాకరమే.**

గతంలో ప్రతి పల్లెటూళ్ళోను మేం ఉండి గ్రామాలకు కాపలా కాసేవాళ్ళం. ఊళ్లోకి ఎవరొచ్చినా రీవిగా ఎదురొచ్చి ముందుగా మేమే పలకరించేవాళ్ళం. కొత్తవాళ్ళెవరైనా వస్తే గ్రామస్థులను వారి రాక గురించి హెచ్చరించేవాళ్ళం. అందుకే మమ్మల్ని 'గ్రామసింహాలు' అని గౌరవంగా పిలిచేవారు. అయితే, ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. మా గురించి పట్టించుకునేవాళ్ళు లేక, వేగంగా పెరుగుతున్న జనాభా, ఆధునీకీకరణ, పట్టణాల అభివృద్ధి మొదలైన కారణాల మూలంగా మా సంఖ్య విపరీతంగా పెరిగిపోయి, ఇప్పుడు మేమే జనజీవనానికి ఆటంకంగా మారిపోవటం మా దురదృష్టం.

ఒకప్పుడు పంచాయితీలలోను, మున్సిపాలిటీలలోను మాకు లైసెన్సులిచ్చి, వ్యాధులు రాకుండా ఇంజక్షన్లు ఇచ్చేవారు. అయితే, అనేక కారణాలవల్ల ఆ విధానాలకు తిలోదకాలివ్వటంతో, మా సంఖ్య విపరీతంగా పెరిగిపోయి, మా ఆలనాపాలనా చూసేవాళ్ళు లేక, మేము రకరకాల వ్యాధుల బారినపడి, మా మానసిక శారీరక ఆరోగ్యాలు చెడిపోయి మాలో కొందరు మనుషుల్ని కరవటం, వారు చనిపోవటం వంటి దురదృష్టకర సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

అందుకే, ఈ మధ్య అందరిలోనూ బాగా చర్చకు వచ్చిన మా జాతి సమస్య - అదేనండి **రేబిస్** వ్యాధి గురించి నాకు తెలిసిన కొన్ని విషయాలు మీతో పంచుకోవాలని ఇలా మీ ముందుకొచ్చాను. దయచేసి వినండి.

**రేబిస్** వ్యాధి ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలలో ఉంది. ఇందుకు సంబంధించిన గణాంకాలు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ప్రపంచంలో ఏటా 50,000 మంది **రేబిస్** వ్యాధి వల్ల చనిపోతున్నారట. ఈ మరణాలు కూడా ఆసియా, ఆఫ్రికా దేశాలలోనే ఎక్కువగా సంభవిస్తున్నాయట. ఒక్క ఇండియాలోనే ఏటా 30,000 మంది ఈ వ్యాధి బారినపడి మరణిస్తున్నారంటే, మనదేశంలో వ్యాధి తీవ్రత ఎంతుందో మీరు అర్థం చేసుకోగలరు. అయితే, 2006 నాటికే ఆస్ట్రేలియా, నార్వే, స్వీడన్, తైవాన్, యునైటెడ్ కింగ్‌డం, స్కాండినేవియా, మలేసియా మొదలైన దేశాలలో ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేసారట. అమెరికాలో మాత్రం ఏటా ఒకరిద్దరు ఈ వ్యాధివల్ల మరణిస్తున్నారని, ఒక 1994లో మాత్రం అత్యధికంగా 6 కేసులు నమోదయ్యాయని అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి.

**భలే ఆశ్చర్యంగా ఉంది కదూ!**

వాస్తవానికి ఒక జంతువులో **రేబిస్** వైరస్ ఉన్నదనే విషయాన్ని ఆ జంతువుయొక్క మెదడులోని కణాలను పరీక్షిస్తే తప్ప సాధ్యపడదట. కానీ, సదరు జంతువుయొక్క ప్రవర్తన ఆధారంగా రేబిస్ వ్యాధిని, దాని తీవ్రతను అంచనా వేయవచ్చు. **రేబిస్** వ్యాధి పెంపుడు జంతువులకు, అడవి జంతువులకు వేటికైనా రావచ్చు. అయితే, ప్రస్తుత సమస్య - మన పల్లెల్లో, పట్టణాల్లో సంచరించే మా మిత్రులవల్ల వ్యాప్తిచెందే **రేబిస్**దే. కుక్కలలో కూడా ఎక్కువగా - పెంపుడు కుక్కలలో కంటే, వీధికుక్కలలోనే ఈ రేబిస్ వ్యాధి ఎక్కువగా తలెత్తుతోంది. (మీకు బాగా అర్థం కావటంకోసం **కుక్క** అనే పదాన్నే వాడతాలే.)

**రేబిస్** వ్యాధి సోకిన కుక్క మరో కుక్కను కరిచినప్పుడు వ్యాధి లక్షణాలు వెంటనే కనిపించవు. కరిచిన 3-8 వారాల (పిల్లలలో 2-6 వారాలు) వరకు ఎటువంటి లక్షణాలు కనిపించకపోవచ్చు. కొన్ని కేసుల్లో పది రోజుల తరువాత ఆ లక్షణాలు కనిపించొచ్చు. అందుకే, మనుషుల్ని కుక్క కరిస్తే పదిరోజులు దానిని పరిశీలనలో ఉంచాలని చెప్తారు. రేబిస్ వ్యాధి సోకిన కుక్క మనిషిని కరిస్తే - మనిషిలో ఆ లక్షణాలు 3-6 వారాలమధ్య కనిపిస్తాయి. (ఒక్కొక్కసారి 3 నెలలుకూడా పట్టచ్చు) వ్యాధి లక్షణాలు కనిపించిన తరువాత ఎటువంటి మందులు వాడినా ఫలితం శూన్యం. అందుకే, కుక్క కరిస్తే - వెంటనే అనుమానం ఉంటే వెంటనే వైద్యం ప్రారంభించటం ఎంతైనా అవసరం.

**రేబిస్** వ్యాధి సోకిన కుక్క ప్రవర్తనను బట్టి చాలావరకు వ్యాధి తీవ్రతను అంచనా వేయొచ్చు. అసాధారణంగా పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడం, తనను తానే కరుచుకోవటం, పళ్ళుకొరకటం, చెక్కముక్కలు, రాళ్ళు వంటివాటిని కొరకటం, అడ్డువచ్చినవారిని కరవటం, కళ్ళు ఎర్రగా మారి పుసులు కారటం, నోటివెంట నురగతో కూడిన చొంగ కారటం మొదలైన లక్షణాలు వ్యాధి సోకిన జంతువులో కనిపిస్తాయి. ఆపైన, నెమ్మదిగా వ్యాధి తీవ్రతరమై పక్షవాతం వచ్చి,

తరువాత శారీరకంగా మరింత బలహీనపడి చివరకు ఆ కుక్క దయనీయమైన స్థితిలో చనిపోతుంది.

**రేబిస్** వ్యాధి సోకిన కుక్క కరవటం ద్వారా ఆ వ్యాధి మనిషికి సంక్రమిస్తే-కుక్కలో కనిపించే లక్షణాలే వ్యాధి సోకిన మనిషిలోనూ కనిపిస్తాయి. **రేబిస్** వ్యాధి సోకిన కుక్క మనిషిని కరిచినప్రదేశాన్ని బట్టి వ్యాధి తీవ్రత వుంటుందట. అంటే - కాళ్ళపై కరిచిన దానికంటే ముఖంపై కరిచిన కాటువల్ల **రేబిస్** త్వరగా సోకుతుందట. మనిషి మెదడుకు ఎంత దగ్గరగావున్న భాగంలో కరిస్తే అంత త్వరగా వ్యాధి తీవ్రత ఉంటుందట. కరిచిన కుక్క లాలాజలంలో ఉండే **రేబిస్ క్రిములు** ముందుగా గాయం ఏర్పడినచోట నరాల్లో ప్రవేశించి, మెల్లగా మెదడుకు చేరతాయట. **రేబిస్** వ్యాధి సోకిన 20-60 రోజులలో పూర్తి లక్షణాలు బయటపడతాయి. ఆకలి మందగించిపోవటం, తలనొప్పి, వికారం, వాంతులు, జ్వరం వంటివి ముందుగా కనబడతాయి. పూర్తిగా శరీరంలో వ్యాధి వ్యాపిస్తే రేబిస్ క్రిములు మనిషి లాలాజలం, చర్మం, పాంక్రియాస్, మూత్రపిండాలు, గుండె, కంటిరెటీనా మొదలైన అన్ని ప్రదేశాలకు వ్యాపిస్తాయంటున్నారు నిపుణులు.

**రేబిస్** వ్యాధి సోకిన మనిషి (కుక్కకూడా) నీటినిచూస్తే విపరీతంగా భయపడతాడట. నీళ్ళు తాగాలంటే గొంతుపట్టేసి, నీరు తాగలేకపోవటం, భరించలేని గొంతు నొప్పికి గురికావటమే ఇందుకు కారణమట. అందుకే రేబిస్ వ్యాధిని **హైడ్రోఫోబియా** అని కూడా పిలుస్తారు.

**రేబిస్** వ్యాధి కేవలం మా జాతి కుక్కల ద్వారానే కాకుండా, పిల్లులు, గబ్బిలాల ద్వారా కూడా మనుషులకు సంక్రమించే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. అందుకే, ఇళ్ళల్లో పెరిగే పిల్లులు, గుళ్ళల్లో తిరిగే గబ్బిలాల విషయంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవటం అవసరం. సరైన జాగ్రత్తలు తీసుకుంటే **రేబిస్** వ్యాధి అనేది అసలు తలెత్తకుండా చేయటం చాలా సులువేనండి. ముందుగా పెంపుడు కుక్కలకు పుట్టిన 6 వారాలకు ఒక ఎ.ఆర్.వి. (యాంటిరేబిస్ వేక్సిన్) ఇంజెక్షన్ (1.0ఎం.ఎల్) చేయించాలి. ఒక నెల తరువాత మరల ఒక బూస్టర్ డోస్ (1.0ఎం.ఎల్) వేయించాలి. ఆ తరువాత మళ్ళీ ప్రతి సంవత్సరం ఒక ఇంజెక్షన్ చేయించాలి. ప్రస్తుతం - రక్షారేబ్, నోబివేట్, రేబివైన్, రేబీవేక్ అనే ఎ.ఆర్.వి. లు అందుబాటులో ఉన్నాయి.

అందుకే, అసలు రేబిస్ వ్యాధి రాకుండా చూసుకోవటం ఉత్తమమైన పద్ధతి. వచ్చిన తరువాత, వ్యాధి లక్షణాలు బైటపడ్డాక మరణం మినహా మందులేదు. అందుకే అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకొని వ్యాధి, రాకుండా చేసుకోవటమే ఉత్తమం. ప్రమాదవశాత్తు ఏదైనా కుక్క కరిస్తే తక్షణమే గాయాన్ని సబ్బునీటితో కడిగి (కరిచిన గాయానికి ఎటువంటి పరిస్థితుల్లోను కుట్లు వేయకూడదట) వెంటనే సరైన వైద్యుని సంప్రదించాలి. వ్యాధి లక్షణాలు కనిపించకముందే సరైన చికిత్సపొందితే నూటికి నూరుశాతం **రేబిస్** రాకుండా చూసుకోవచ్చు.

అయినప్పటికీ, ప్రమాదవశాత్తు ఒకవేళ **రేబిస్** వ్యాధిసోకిన కుక్క మనుషుల్ని కరిస్తే వెంటనే యాంటి రేబిస్ వేక్సిన్ వేయించుకోవాలి. 0,3,7,14,30,90 రోజులలో ఒక్కొక్క డోస్ చొప్పున (1.0 ఎం.ఎల్) ఎ.ఆర్.వి., ఇంజక్షన్ చేయించుకోవాలి. పిల్లలకైనా, పెద్దలకైనా ఇదే మోతాదులలో వేక్సిన్ వేయించాలి. **రేబిపూర్, అభయరేబ్, వేరోరేబ్**



అనే ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా, రేబిస్ సోకిన కుక్క మనిషి ముఖంమీద కరిస్తే **ఇమ్యునోగ్లోబ్లిన్స్** అనే ఇంజెక్షన్ వెంటనే తీసుకోవాలి. వైద్యుని సలహా మేరకు పూర్తి కోర్సు వాడాలి. సగం ఇంజెక్షన్స్ తీసుకొని, వ్యాధి లక్షణాలు లేవుకదా అని వైద్యం మధ్యలో విరమించటం ప్రమాదకరం. **రేబిస్** వ్యాధికి హోమియోలో కూడా మంచి మందులున్నాయి. **హైడ్రోఫోబియా-200** మందు ఒక డోసు, లేదా **లెడల్‌పాల్-30** మందు రోజుకు రెండు డోసుల చొప్పున రెండు రోజులు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ఏ మందు అయినా అనుభవజ్ఞుడైన వైద్యుని సలహా సూచనల మేరకు వాడటం శ్రేయస్కరం.

అందుకే, అందరూ సమిష్టి బాధ్యతతో వ్యవహరిస్తే - ఈ **రేబిస్** వ్యాధి అసలు అంకురించకుండానే అంతమొందించొచ్చు. ఈ విషయంలో అన్నింటికంటే ముఖ్యంగా చేయాల్సింది - మాలాంటి పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా ఎ.ఆర్.వి. వేయించాలి. అలాగే వీలైనంత వరకు, పాపం వీధుల్లో తిరిగే మా అనాధ మిత్రులకు కూడా వేక్సిన్ వేయించాలి. ముఖ్యంగా, మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థలలో పెంపుడు జంతువులకు లైసెన్సింగ్ విధానాన్ని పకడ్బందీగా అమలుచేయాలి. లైసెన్సులేని కుక్కలు పెంచేవారిపైన, పెంపుడు జంతువులను వీధులలో వదిలేసి బాధ్యత లేకుండా వ్యవహరించె వారిపైన నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకొని జరిమానా విధించాలి. ఇందుకోసం స్థానిక ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి. స్వచ్ఛంద సంస్థలు ఇందుకు తగిన సహకారం అందించి **రేబిస్** వ్యాధి గురించి ప్రజలలో సరైన అవగాహన కల్పించాలి. ఈ చర్యలు తీసుకుంటే 'చేతులు కాలాక ఆకులు పట్టుకునే' పరిస్థితి మరోసారి రాకుండా అరికట్టటం సులభసాధ్యమే. ఈ విధంగా అందరం ఏకమై అన్ని చర్యలు తీసుకుంటే ఏ పాపం ఎరుగని మమ్మల్ని అనవసరంగా చంపే అవసరం మీకు ఎప్పటికీరాదు ఆ పాపం మీకెవరికీ అంటదుకూడా.

అయితే, పై తెల్పిన చర్యలు తీసుకోకుండా నేరం అంతా మాదే అన్నట్టు మమ్మల్ని నిర్ధాక్షిణ్యంగా పట్టి క్రమంగా చంపుతున్నారు. మమ్మల్ని అనవసరంగా చంపొద్దని కోర్టువారి ఆదేశాలున్నా, కొన్ని స్వచ్ఛంద సంస్థలు అరిచి గీపెడుతున్నా మాపై జరుగుతున్న మారణకాండ ఆగటంలేదు. అందుకే, ఇప్పటికైనా అందరూ మేల్కొని సరైన జాగ్రత్తలు తీసుకుంటే అటు మీరు, ఇటు మేము సుఖంగా ఉంటాం. మీ సేవలో ఎప్పటిలాగే మేం పాలుపంచుకొని మా విశ్వాసాన్ని మీపట్ల మరింత ఎక్కువగా ప్రదర్శిస్తాం, సరేనా!?

**సర్వేజనా సుఖినోభవంతు.. శలవ్**

- **డాక్టర్ వి. రాజేంద్రప్రసాద్,** రీజనల్ డైరెక్టర్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, రాజమండ్రి



# మానవ విలువలను పాటిస్తూ గ్రామ ప్రజలను ఆదుకోనవలెనని పిలుపు

**నేటి గ్రామీణ ప్రజలు ఎన్నో సమస్యలను ఎదుర్కొనుచున్నారు. వాటిని పరిష్కరించేందుకు పాలనాధికారులు పనిచేస్తూ త్రాగునీరు, ఆరోగ్య, పారిశుధ్య సమస్యలను పరిష్కరించుటకు ఇంజనీరింగ్ సిబ్బంది కృషి చేయవలసి ఉందని అపార్డు జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సి. నాగరాజు అన్నారు. ఆయన 28-10-2013న అపార్డులో జరిగిన అసిస్టెంట్ ఇంజనీర్ల శిక్షణను ప్రారంభించి ప్రసంగించారు. ఈ శిక్షణ అక్టోబర్ 28 నుండి నవంబర్ 24,2013 వరకు జరుగుతుంది.**

ఈ ఇంజనీరింగ్ శిక్షణా కోర్సులో మొదటి ఉపన్యాసంగా "పని సంస్కృతి - విలువలు" అనే అంశంపై సిడిఎస్ డైరెక్టర్ జనరల్ శ్రీ కె. చంద్రమౌళి ఐఏఎస్ (రిటైర్డ్) మాట్లాడుతూ విలువలు కుటుంబం నుండే మొదలౌతాయని, పాఠశాలలో విద్యార్థులల్లో స్థిరీకరణ జరుగుతుంది, వాటిని సమాజపు రోజువారీ పనులలో ఉపయోగించి మన కర్తవ్యాన్ని నెరవేర్చేందుకు పనిచేయుటకు ఉత్రేరణను కలుగుతుందని ఆయన ఎన్నో ఉదాహారణలతో వీడియో క్లిప్పింగ్స్‌ను ఉపయోగించి శిక్షితులతో బావోద్రేకాన్ని కలిగించారు. విలువలతో పనిచేస్తూ గ్రామీణ పేదలకు కావలసిన త్రాగునీటి నీటి సమస్యను తీర్చేందుకు నూతనంగా పదవి బాధ్యతలు నిర్వహించే ఇంజనీర్స్ నీతి, నియామాలు విలువలతో పనిచేయాలని సూచించారు. అదే విధంగా చిన్న ఆశా వాహం మనిషిని నిలబెడుతుంది. ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకొనే విధంగా గ్రామాలలో లేట్రిన్ వినియోగాన్ని పెంచేందుకు పని చేయాలని చంద్రమౌళి విశదీకరించారు. గంటన్నర పైగా సాగిన తన విస్తృత ప్రసంగంలో పని సంస్కృతిని గూర్చి వివరించారు.

ఈ కార్యక్రమాన్ని సెంటర్ ఫర్ వాటర్ & శానిటేషన్ వారు నిర్వహించుచున్నారు.

**- సిఎంపి**

## మన గ్రామ అభివృద్ధి మన చేతుల్లోనే

### మారుద్దామా మన గ్రామాన్ని, ఇలా !

# గ్రామ సౌభాగ్యం కోసం బిఎన్‌విల కృషి



**ఈ దేశం, ఈ గ్రామం, ఈ ప్రజలు నాకేమి చేశారని కాకుండా ఈ గ్రామానికి, నా ప్రజలకు తద్వారా నా దేశానికి, నా జన్మ భూమికి నేనేమి చేశాను అనే దృక్పథంతో నడుంబిగించిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు గ్రామ సౌభాగ్యం కోసం నేను సహితం అంటూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి పనిచేస్తూ, ప్రశంసలందుకొంటున్నారు.**

నెల్లూరు జిల్లాలో సీతారామపురం మండలం, జయపురం పంచాయితీ గ్రామంలోని వాలంటీర్లు తమ గ్రామం కోసం నడుంబిగించి, మద్యం షాపులు తమ గ్రామానికి రానివ్వకుండా నిషేధం విధించారు. గ్రామంలో యువకులు, మహిళలతో కలసి, గ్రామ ఆవిర్భావం నుంచి మద్యనిషేధ గ్రామంగా పేరున్న గ్రామ సాంప్రదాయాన్ని నిలుపుకుందాం అంటూ చేతులు కలిపారు. అలాగే గ్రామ ప్రవేశ ద్వారంలోని రోడ్డు కిరువైపులా సుమారు 60 చెట్లు (కానుగ, వేప) నాటారు. గ్రామంలో జరిగే ఉపాధి హామీ పనులు రైతులకు ఉపయోగపడేలా మలచుకున్నారు. పాఠశాల నూతన భవనాన్ని వాలంటీర్లు దగ్గరుండి నాణ్యత గల భవనంగా నిర్మించుకున్నారు. గ్రామంలో పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత కోసం



కృషిచేస్తూ ప్రశంసలందుకొంటున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ టి. గురవయ్య కూడా వాలంటీర్‌గా మారి అభివృద్ధి పనులకు ప్రోత్సాహాన్నిస్తున్నారు.

### 'గిరిజనుల జీవన శైలిలో మార్పుల కోసం కృషి'

బుచ్చిరెడ్డిపాలెం మండలం రేబాల గ్రామంలో మాజీ సర్పంచ్ వై. పెంచల నరసయ్య ఆధ్వర్యంలో వాలంటీర్ల దళం ఆ గ్రామంలోని గిరిజనుల సంక్షేమం, జీవనోపాధుల పెంపు, విధానంలో మార్పుల కోసం కృషి చేస్తూ చెల్లాచెదురుగానున్న గిరిజన జనాన్ని ఒకచోట చేర్చి వారికి విద్యా బుద్ధులు, వేషభాషలు, సంస్కృతీ సాంప్రదాయాలు అలవాటు చేయడానికి కృషి చేస్తున్నారు. అలాగే గ్రామంలో పరిశుభ్రతపై అవగాహనా సదస్సు, వృద్ధాప్యంలోని వారికోసం ఏర్పాటు చేసిన ఆశ్రమంలో వృద్ధులకు చేయూత, సహకారాలు అందివ్వడం, విద్యా అభివృద్ధి కోసం కృషి చేయడం వంటి వివిధ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

### పంచాయతి ఆవరణలో వాలంటీర్ల శ్రమదానం

దగదర్తి మండలం, వెలిపోడు పంచాయితీలో గల వాలంటీర్లు తమ గ్రామ పంచాయితీ ఆవరణను శుభ్రం చేసి గ్రామస్తుల మన్ననలు పొందారు. ముఖ్యంగా గ్రామ పంచాయితీ ఆవరణ పశువులకు నిలయంగా, వ్యర్థ పదార్థాలతో నిండి, అడవిని తలపిస్తున్న విషయం గమనించిన వాలంటీర్లు ఒక్కపూట శ్రమదానంతో ఆవరణను అందంగా తీర్చిదిద్దారు. అంతకుముందు గ్రామంలోని డ్రైనేజిని, కాలువలను శుభ్రం చేశారు. పాలాలకు వెళ్లే రోడ్లు బాగు చేశారు. నేడు మరుగు దొడ్ల నిర్మాణం కోసం ఇంటింటా సర్వే చేయించి, గ్రామంలో మరుగు దొడ్లను కట్టుకొనే విధంగా అవగాహన చర్యలు చేపడుతూ గ్రామస్తుల ప్రశంసలందుకొంటున్నారు.

**- శివ**



# సగటు మనిషి కల కావాలి 'మరుగు దొడ్డి'

**'అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవం' సందర్భంగా. నవంబరు 19, 2013 న ప్రపంచ వ్యాప్తంగా మరుగుదొడ్ల దినోత్సవం జరుపుకుంటాం. అవగాహనా సమావేశాలు, ర్యాలీలు, చర్చలు, మీటింగులు ఇలా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించుకుంటాం. ఇలా ప్రతి ఏడాది చేస్తూనే ఉన్నాం. ఈ సంబరం చేస్తాం, మరుసటి సం॥రం సదా - మామూలే. ఇలా ఎన్ని సంబరాలు. ఎందుకు మనం మరుగుదొడ్ల వాడకంలో ముందుకు పోలేక పోతున్నాం.**

**ఒక్కటి :** మరుగుదొడ్డి తప్పనిసరి అవసరంగా సగటు మనిషి గుర్తించక పోవడం;

**రెండు :** బహిరంగ మల విసర్జనకు సామాజిక అంగీకారం లభించడం.

**సగటు మనిషి కల**

ప్రతి మనిషీ ఎన్నో కలలు కంటారు. ఉండడానికి 'ఓ మోస్తరు ఇల్లు, కూడు, గుడ్డ, ఒక బైకు, సెల్‌ఫోన్, ఓ కలర్ టి.వి., చేతి నిండా పని, పిల్లలకు మంచి జీవితం'' ఇలా కలలు కనడం ఆ కలలు ఫలించడానికి కృషి చేయడం జరుగుతూనే ఉంది.

> త్రాగుడు, పేకాట, జూదం, వ్యభిచారం ఇవన్నీ. సమాజిక దురలవాట్లుగా మనం గుర్తించాం. వీటన్నింటిని చెడు అలవాట్లుగా మనందరం ముక్త కంఠంతో గర్హిస్తున్నాం.
>
> **మరి 'బహిరంగ మలవిసర్జన'**
>
> ఆ కోవలోకి ఎందుకు రాకూడదు.

అయితే, ఈ కలలలో ఎక్కడా 'మరుగుదొడ్డి'కి స్థానమే లేదు. కలలలో దీనికి స్థానం దొరికిన రోజూ 'బహిరంగ మల విసర్జన' సమస్య కనుచూపు మేరలో కాననేరాదు.

**కలల సౌధంలో స్థానం కావాలంటే ఏమి చేయాలి?**

- సమాజంలో బహిరంగ మల విసర్జన కున్న, సామాజిక అంగీకారాన్ని తొలగించాలి. అందుకు సరైన అవగాహన ప్రజలలో కల్పించి, ప్రజలలో విప్లవ జ్వాలలు రగిలించ గలగాలి.

**విప్లవ జ్వాలలు ఎలా రగులుతాయి?**

"పీర్ ప్రెజర్" ద్వారా ఇది సాధ్యం. ఒక్క విషయాన్ని ప్రజలు గుర్తించ గలిగితే చాలు. 'మనం చెడు అలవాట్లుగా బావిస్తున్న వాటివలన నష్ట పోయేది ప్రత్యక్షంగా "సంబంధిత వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులు." సమాజం పై ప్రభావం పరోక్షంగా మాత్రమే ఉంటుంది. అదే బహిరంగ మల విసర్జన వల్ల నయితేనో అందరు ఆరు బయట మల విసర్జన చేసిన. దాని దుష్ ఫలితాలు సమాజంలో నివశిస్తున్న అందరికీ చేరతాయి.

అంటే అర్థం ఎవరి "పియ్యనో" మన మందరం ప్రియంగా భుజిస్తున్న మన్న మాట.

అంటే అనకూడనిది అంటు త్రాగ కూడనిది త్రాగుతూ కూడా మనకు కనీసం చీమ కుట్టినట్లుయినా లేదంటే దానిపై అవగాహనలో మనం ఎంత వెనక బడి ఉన్నామో. మనం ఇట్లే అర్థం చేసుకోవచ్చు.

ఈ అంశాన్ని మనం సమాజంలో ఫోకస్ చేయి గలిగితే ఏ ఒక్కరు బయటకు పోతున్న మిగతా కుటుంబాల ప్రజలు ముక్త కంఠంతో ఖండిస్తారు, ఆపై దండిస్తారు. అలా జరిగిన రోజు "మరుగు దొడ్డి వాడకం" గురించి మరొకరు చెప్పవలసిన అవసరమే రాదు. ఈ మరుగుదొడ్ల దినోత్సవం అందుకు నాంది కావాలని కోరుకుంటూ.

**- పి మాధురి, అపార్డ్**



# భూసార పరీక్షలు, పద్ధతులు, ఫలితాల విశ్లేషణ

**భూసారాన్ని పరీక్షించాల్సిన అవసరం ఎంతగానో వుంది. పోషకాల సమతుల్యత పాటించడానికి, రసాయన ఎరువుల సక్రమ వినియోగానికి భూసార పరీక్షల ఆవశ్యకతను 1957లోనే ప్రభుత్వం గుర్తించింది. పెరుగుతున్న అవసరాలను గుర్తించి 1970లో జిల్లాకొక కేంద్రం ఏర్పాటు చేశారు.**

భూసార పరీక్షా కార్యక్రమాలను రైతులకు మరింత చేరువగా తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో 1999లో జిల్లాల్లోని ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ఒక ప్రయోగశాల ఏర్పాటు చేయడం జరిగింది. ఇదంతా ప్రభుత్వం రైతులకు అందించే ఉచిత సేవా కార్యక్రమం. పైర్లకు కావాల్సిన అన్ని పోషకాలు కొంత ప్రమాణంలో నేలలో సహజంగానే వుంటాయి. ఇవి తయారై పైర్లకు లభ్యం కావడమనేది నేల భౌతిక, రసాయన లక్షణాలు, సూక్ష్మజీవుల చర్య, వాతావరణ పరిస్థితులపై ఆధారపడి వుంటుంది. వీటిలో ఎంతో తేడాలుండే అవకాశం వుంది. నేలలో అవి ఎంత వరకు లభ్యమవుతున్నాయో, వేయదలచిన పైరుకు ఎంత తక్కువ అవుతోందో నిర్ధారించి ఎరువులు వాడాలి.

### భూసార పరీక్షా కేంద్రం నుండి లభించే సలహాలు

- భూసారాన్ని నిర్ధారించి, రైతు వేయదలచిన పంటలకు నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులకు ఖచ్చితమైన మోతాదులు నిర్ణయించడం.
- సాగుకు అనుకూలంగా లేని ఆమ్ల భూములు, చౌడు భూముల్లో చాలా తక్కువ దిగుబడి వస్తుంది కనుక వీటిని గుర్తించి బాగుచేసే విధానాలు, ఇతర యాజమాన్య పద్ధతులను సూచించడం.
- ఎంపిక చేసిన నమూనాలలో సూక్ష్మపోషకాల విశ్లేషణ చేసి సలహాలివ్వడం.
- ముఖ్య పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్‌లను ఆహారపు పంటలకు 4:2:1 నిష్పత్తిలో వాడమని సిఫారసు చేస్తుండగా, రైతులు భాస్వరం, పొటాష్‌లను సిఫారసు చేసిన దానికన్న తక్కువగాను, నత్రజని పోషకాన్ని సిఫారసు చేసినదానికి రెండు నుండి రెండున్నర రెట్లు అధికంగాను వాడుతున్నారు. దీని వల్ల పోషకాల సమతుల్యత దెబ్బతింటుంది.

పోషకాల సమతుల్యత అంటే పోషకాలను సమానంగా వాడమని అర్థం కాదు : ఏ పైరుకు, ఏ పోషకం ఎంత పరిమాణంలో నేలకు

అవసరమో తెలుసుకుని హెచ్చుతగ్గులు కాకుండా అందించడాన్ని పోషకాల సమతుల్యత అంటారు. దీని వల్ల, విలువైన ఎరువులను పొదుపుగా వాడవచ్చును. పొదుపుగా వాడడమంటే తగ్గించి వాడమని అర్థం కాదు. అవసరం లేని పోషకాన్ని వేసి వృథా చెయడాన్ని అరికట్టాలి. దీని ద్వారా రైతుకు ఖర్చు తగ్గుతుంది. ఆశించిన ఫలితంతో పాటు నికరాదాయం పెరుగుతుంది.

పోషకాల సమతుల్యత లోపించడం వల్ల, ప్రత్యేకించి నత్రజని అధికంగా వాడడం వల్ల పైరు విపరీతంగా ఎదిగి పడిపోవడం, పూతకు ఆలస్యంగా రావడం, తాలుగింజలు అధికం కావడం, చీడపీడలకు సులువుగా గురికావడం, దిగుబడి - నాణ్యత తగ్గిపోవడం సంభవించి చివరకి రైతుకు తీవ్ర నష్టం జరుగుతుంది.

భూసార పరీక్షల వల్ల మాత్రమే సమతుల ఎరువుల వాడకం జరుగుతుంది.

### భూసార పరీక్షలో వివిధ దశలు

1. మట్టి నమూనాల సేకరణ
2. ప్రయోగశాలలో పరీక్షలు
3. ఫలితాలనాధారంగా ఎరువుల సిఫార్సులు, సమస్యలకు తగు సూచనలు.

### మట్టి నమూనాల సేకరణ

★ భూసార పరీక్షలకు మట్టి నమూనాల సేకరణ మొదటిదే కాకుండా, ముఖ్యమైన అంశంగా భావించాలి. సరైన సమూనా తీయడం కార్యక్రమ విజయానికి తొలి మెట్టు. తీసిన మట్టి నమూనా పొలంలోని మట్టి లక్షణాలకు ప్రాతినిధ్యం కలదిగాను, ప్రతిబింబించేదిగాను వుండాలి.

★ సరైన పద్ధతిలో తగు జాగ్రత్తలలో తీసిన సమూనా నుండి వచ్చే ఫలితాలు, సలహాలు యదార్ధంగాను, లాభదాయకంగాను వుంటాయి. పొలాలు ఖాళీగా వున్న సమయంలో (పొలంలో ఎలాంటి పంట లేని సమయం) ఎప్పుడైనా మట్టి నమూనాలు (Soil samples) తీయవచ్చు. సంవత్సరానికి ఒక పంట పండించే భూముల్లో ఫిబ్రవరి నుండి ఏప్రిల్ నెలల మధ్యకాలం, రెండు పంటలు పండించే భూముల్లో మే నెలలో నమూనాలు సేకరించడానికి అనువుగా వుంటుంది.

★ మట్టి నమూనాల సేకరణకు లోహపు గొట్టం, అగరు వంటి సాధనాలు వినియోగించవచ్చును. లేదా రైతులకు అందుబాటులో వుండే పార, దోకుడు పార, గడ్డ పలుగు సహాయంతో మట్టి నమూనాల ను తీయవచ్చును. నేలరకం, రంగు, సాగు నీటి వసతి, మెరక, పల్లం, సేద్య పద్ధతులు, పంట దిగుబడిలోని వ్యత్యాసం ఆధారంగా వేర్వేరు నమూనాలు తీయాలి. పొలం విస్తీర్ణం ఎంత తక్కువైనప్పటికీ, తేడాలు గుర్తించినప్పుడు అన్ని నమూనాలు వేరుగా తీయాలి. పొలం అంతా ఒకే రకంగా వున్నపుడు 2 హెక్టార్ల (5 ఎకరాలు) విస్తీర్ణానికి ఒక్కొక్క మట్టి నమూనా చొప్పున తీస్తే సరిపోతుంది.



★ ఒక మట్టి నమూనా తీయదలచిన పొలంలో 10 నుండి 12 చోట్ల మట్టిని సేకరించాలి. నేల పైభాగంలోని చెత్తాచెదారం తీసివేయాలి.

పారను ఉపయోగించి 'V' ఆకారంలో 6 అంగుళాల (15 సెం. మీ) లోతు గుంత తీయాలి. పై నుండి దిగువ వరకు ఒకే మందంలో పలుచని పొర వచ్చే విధంగా మట్టిని తీయాలి. ఇలా అన్నిచోట్ల తీసిన మట్టిని గోనెపట్టా లేదా పాలిథీన్ షీట్ లేదా గుడ్డమీద వేసి మట్టి గడ్డల ను చిదిమి బాగా కలిపి, చతురస్రాకారంగా పరిచి, ఉజ్జాయింపుగా నాలుగు (4) భాగాలుగా విభజించాలి. వీటిలో 1, 3 భాగాలు వుంచుకుని,

| | |
|---|---|
| 1 | 2 |
| 4 | 3 |

2, 4 భాగాలలోని మట్టి తీసి వేయాలి. మిగిలివున్న మట్టిని మరల కలిపి అదే విధంగా నాలుగు భాగాలు చేసి ఇప్పుడు 2,4 భాగాలు వుంచుకుని, 1,3 భాగాలు తీసుకోవాలి. సుమారు 1/2 కిలో (500 గ్రా.) మట్టి మిగిలేవరకు ఈ విధంగా చేయాలి. దీనికి చదుర్విభజన పద్ధతి (క్వార్టరింగ్ టెక్నిక్) అంటారు. మట్టి నమూనాను శుభ్రమైన గుడ్డ సంచిలో గాని, పాలిథిన్ సంచిలో గాని వేయాలి. ఎరువులకు ఉపయోగించిన గోనె సంచులు, పాలిథిన్ సంచులను మట్టి నమూనాల సేకరణలో వాడకూడదు.

### మట్టి నమూనాల వివరాల పట్టిక

1. రైతు పేరు, గ్రామం
2. మండలం, జిల్లా
3. సర్వేనంబరు లేదా పొలం పేరు
4. నమూనా తీసిన లోతు
5. గత మూడు సంవత్సరాలలో పండించిన పంటలు, దిగుబడులు :

1.

2.

3.

6. ప్రస్తుతం రైతు పండించదలచిన పంటలు / రకము / సీజను.

1.

2.

3.

7. వర్షాధారపు పంట లేదా నీటి వసతి పంట
8. రైతు అనుభవంలోని విషయాలు
9. మట్టి నమూనా సేకరించిన తేది.
10. సేకరించిన వారి సంతకం.

### నమూనాలు సేకరించడంలో మెలకువలు

1. పొలంలోని మట్టి లక్షణాలకు పోలికలేని చోట్ల లేదా ప్రాతినిధ్యం వహించని చోట్ల మట్టి నమూనా తీయకూడదు. చెట్ల క్రింద, గట్ల ప్రక్కన, కంచెల దగ్గర కాలిబాటలలో నమూనాలు తీయకూడదు. పశువుల ఎరువు కంపోస్టు కుప్పలు నిలవుంచినచోట్ల నమూనాలు తీయకూడదు.
2. బాగా సారవంతమైన చోట్ల, మరీ నిస్సారవంతమైన చోట్ల మట్టిని కలిపి తీయకూడదు.
3. చౌడు భూముల్లో నమూనాలు విడిగా తీయాలి. వీటిని సాధారణ భూముల్లోని మట్టితో కలిపి తీయకూడదు.
4. రసాయన ఎరువులు వేసిన 45 రోజులలోపు నమూనాలు తీయకూడదు.
5. నమూనా తీసేటపుడు నేలపైనున్న ఆకు, అలము, చెత్తా చెదారం తీసి వేయాలేగాని పై మట్టిని తొలగించకూడదు.
6. సాధారణంగా నీరు నిలిచి బురదగా వున్న నేల నుండి నమూనా తీయకూడదు. తప్పనిసరిగా తీయవలసినప్పుడు నీడన ఆరబెట్టి పరీక్షకు పంపవచ్చు.
7. మెట్ట, ఆరుతడి సేద్యంలో పైరు పెరుగుతున్న సమయంలో నమూనా తీయవలసినపుడు వరుసల మధ్య నుండి నమూనా సేకరించాలి.
8. చౌడు భూముల్లో 0-15 సెం.మీ, 15-30 సెం.మీ లోతులో రెండు నమూనాలు తీయాలి.
9. పండ్లతోటలు వేయదలచిన పొలంలో ఒక సామాన్య ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని, అందులో 6 అడుగుల గొయ్యి తీసి ప్రతి అడుగుకు పై నుండి క్రిందికి ఒక మట్టి నమూనా చొప్పున సేకరించి, వివరాలతో పరీక్షా కేంద్రానికి పంపాలి.

రైతులు మట్టి నమూనాలు ఎలా సేకరించాలో వ్యవసాయ విస్తరణాధికారులు సూచిస్తారు. కొద్దిమంది రైతుల పొలాలలో నమూనాలు సేకరించి పంపడం కూడా జరుగుతుంది. ఆ ఫలితాలు వీరి ద్వారానే రైతులకు అందుతాయి. విస్తరణాధికారుల నుంచి అందిన నమూనాలు వేల సంఖ్యలో వుండటంతో, పరీక్షలు జరిపి ఫలితాలు పంపడానికి ఆలస్యం కావచ్చు.

ఒక్కొక్కసారి సీజన్ దాటిపోయిన తర్వాత ఫలితాలు అందే ఆవకాశం వుంది. కనుక రైతులు తమ పొలంలోని మట్టిని తామే సేకరించి భూసార పరీక్షా కేంద్రానికి నేరుగా గాని, లేదా విస్తరణాధికారుల ద్వారా పంపడం మంచిది. ఈ విధంగా వచ్చిన నమూనాలను ప్రత్యేకంగా రైతుల రిజిష్టరులో నమోదు చేసి వారం, పదిరోజులలో వారి చిరునామాకు తెలుగులో అచ్చు వేయబడిన కార్డు ద్వారా ఫలితాలు, సలహాలను పంపుతారు. అవసరమైతే వీటిపై వివరణను విస్తరణాధికారుల నుండి తెలుసుకోవచ్చు. సూక్ష్మపోషక లోపాలను గూర్చి తెలుసుకోదలచినపుడు ప్రత్యేకంగా కోరిన మీదట, విశ్లేషణ చేపట్టి, సలహాలివ్వడం జరుగుతుంది. దీనికి కావాల్సిన యంత్రపరికరం అందుబాటులో వున్న భూసార పరీక్షా కేంద్రాలలోనే సాధ్యపడుతుంది.

### భూసార పరీక్షా ఫలితాలు - కార్డు నమూనా

భూసార పరీక్షా కేంద్రం .......... , నమూనా నెం. ............... తేది .......... , రైతు పేరు ............ , గ్రామం ............ , సర్వే నం. .............. మండలం ............... , జిల్లా ................ .



| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | నేల స్వభావం | ( ) | తేలిక నేలలు | మధ్యరకపు నేలలు | బరువు నేలలు |
| 2. | ఆమ్ల-క్షార లక్షణం | ( ) | ఆమ్లం | తటస్థం | అల్ప/మధ్య/ అధిక క్షారం |
| 3. | లవణం, మి. మే/సెం.మీ | ( ) | సామాన్యం | మొలకెత్తడం కష్టం | పంటలకు హాని |
| 4. | సేంద్రియ కర్బనం | ( ) | తక్కువ | మధ్యస్థం | ఎక్కువ |
| 5. | లభ్య భాస్వరం కి.గ్రా/హెక్టారుకు | ( ) | తక్కువ | మధ్యస్థం | ఎక్కువ |
| 6. | లభ్య పొటాష్ కి.గ్రా/హెక్టారుకు | ( ) | తక్కువ | మధ్యస్థం | ఎక్కువ |

### సిఫారసు చేయబడిన ఎరువుల మోతాదులు కిలోలు / హెక్టారుకు

| 1. పైరు | నీటి సేద్యం/వర్షాధారం | | ఆబి. | ఖరీఫ్/తాబీ రబీ |
|---|---|---|---|---|
| | నత్రజని | భాస్వరం | పొటాష్ | సేంద్రియ ఎరువులు/ట/హె. |
| 1. ........ | ( ) | ( ) | ( ) | ( ) |
| 2. ........ | ( ) | ( ) | ( ) | ( ) |

తక్కువ దిగుబడినిచ్చే భూముల నుండి, సమస్యాత్మక భూముల నుండి నమూనాలు సేకరించడానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఎక్కువ ఉపయోగం వుంటుంది. పంట తీసుకున్న వెంటనే భూములు ఖాళీగా వున్న సమయంలో నమూనాలు సేకరించి పంపడం వల్ల భూసార పరీక్ష ఫలితాలు, సలహాలు రైతులకు సకాలంలో, సీజన్‌కు ముందుగానే అంది చక్కని ఫలితాలతో ఉపయోగదాయకంగా వుంటుంది.

### ఫలితాలు విశదీకరణ

భూసార పరీక్షా కేంద్రంలో నేలను గూర్చి సరైన అవగాహన కొరకు వివిధ పరీక్షలు జరుపుతారు. నేల రంగు, స్వభావం వంటి భౌతిక లక్షణాలేగాక, ఉదజని, లవణ పరిమాణం, సేంద్రియ కర్బనం, లభ్య భాస్వరం, లభ్య పొటాష్ నిర్ధారిస్తారు. సమస్యాత్మక నేలలకు వేయాల్సిన జిప్సం / సున్నం (లైమ్) పరిమాణాన్ని నిర్ణయిస్తారు. రైతు కోరిన నమూనాలకు సూక్ష్మపోషకాల విశ్లేషణ జరుపుతారు.

భూసార పరీక్ష ఫలితాలు, పైర్లకు వేయాల్సిన పోషక మోతాదులు, చౌడు మొదలగు సమస్యలపై సలహాలు, ఇతర సూచనలను తెలుగులో ముద్రింపబడిన కార్డు ద్వారా రైతులకు అందజేస్తారు. పైరు రకాన్ని బట్టి అందుబాటులోని నీటి వసతి లేదా వర్షాధార పరిస్థితిని బట్టి, ఖరీఫ్ లేదా రబీ సీజన్లను బట్టి, నేలలో వున్న పోషణ పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకుని అవసరమైన ఖచ్చితమైన మోతాదులను సిఫార్సు చేస్తారు.

*- టి. నాగేందర్*

# స్థానిక సంస్థలలో ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి!



**కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు స్థానిక సంస్థలకు నిధులు, విధులు, సిబ్బందిని సమకూర్చి వాటిని బలోపేతం చేయాలని ఇటీవలికాలంలో చర్యలు తీసుకుంటున్నాయన్న సంగతి మనకు విదితమే. కానీ అసలు స్థానిక సంస్థలకు సంబంధించి ఆర్థిక పరిస్థితి మెరుగు పడడమే కాకుండా, మరింత మేలైన ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టే అవకాశముంటుంది. నేడు మన రాష్ట్రంలో పంచాయతీరాజ్ సంస్థలకు సంబంధించి అధికార వ్యవస్థ మూడంచెలుగా వుంది. అవి గ్రామ పంచాయతీలు (21,943), మండల పరిషత్ (1096), మరియు జిల్లాపరిషత్ (22), సదరు సంస్థలలో సుమారు 2 లక్షల మంది ప్రజా ప్రతినిధులు, 2 లక్షల మంది ప్రభుత్వాధికారులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో పంచాయతీరాజ్ సంస్థల ద్వారా సుమారు 3,000 కోట్ల రూపాయల మేరకు ఆర్థిక పరమైన లావాదేవీలు జరుగుతున్నాయి.**

వీటిలో సుమారు 10 శాతం పైగా నిధులు దుర్వినియోగానికి లోనవుతున్నాయని ఆడిట్ ప్రకారం తెలుస్తున్నది. అంటే ప్రతి సంవత్సరం 300 కోట్ల రూపాయల మేర స్థానిక సంస్థల నిధులు సక్రమంగా వినియోగం కావటం లేదనేది నిర్వివాదాంశం. కాబట్టి స్థానికసంస్థల నిధుల దుర్వినియోగాన్ని చట్టప్రకారం అరికట్టడానికి ప్రభుత్వం నిర్దేశించిన నియమావళి ఏమిటన్నది తెలుసుకోవలసిన అవసరముంది. 1994వ పంచాయితీరాజ్ చట్టం ప్రకారం, మండల, జిల్లాపరిషత్‌లకు సంబంధించి ఈ క్రింద సూచించిన విధంగా నియమనిబంధనలు పాటించాలి.

- ప్రతి నెలకు, యావత్తు సంవత్సరానికి, ప్రారంభ నిల్వలను వర్తమాన, క్రమాభివృద్ధి జమా ఖర్చులను సూచించే పోస్టింగ్ రిజిస్టర్ నిర్వహించాలి.
- పోస్టింగ్ రిజిస్టర్‌లోని జమల విభాగాన్ని నగదు పుస్తకంలోని, ట్రాన్స్‌ఫర్ ఎంట్రీ రిజిస్టర్‌లోని నమోదుల ఆధారంగా, వివిధ జమాపద్ధతులను వర్గీకరించి, సంబంధిత ఖాతా రిజిస్టర్‌లో, పోస్టింగ్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. అలాగే పోస్టింగ్ రిజిస్టర్‌లోని చెల్లింపుల విభాగాన్ని నగదు పుస్తకం ఎంట్రీ, ట్రాన్స్‌ఫర్ ఎంట్రీల ఆధారంగా పూర్తిచేయాలి. వివిధ అంశాలను వాటి ఓచర్ల సంఖ్యలతో సహా పోస్టింగ్ రిజిస్టరు అడుగు భాగాన నమోదు చేయాలి. వాటి మొత్తాలను మాత్రం సంబంధిత ఖాతాకు ఎదురుగా నమోదు చేయాలి. ఆ రెండింటిని సూచిక అక్షరాల ద్వారా కలపాలి. ప్రతి నెలకు సంబంధించిన లెక్కలను కూర్చగానే అన్ని ఖాతాల క్రింది క్రమవృద్ధి మొత్తాలను అందుకోసం నిర్ధారింపబడిన గడిలో నమోదు చేయాలి.
- ప్రభుత్వం నిర్ణయించిన నమూనాలో, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు ప్రతి నెలవారీ లెక్కల సంక్షిప్తిని పోస్టింగ్ రిజిస్టరు ఆధారంగా తయారుచేసి, దానిని సరిచూసినట్టి ధృవపత్రంతో సహా, తరువాతి నెల పరిసమాప్తం కాకముందు జిల్లా పరిషత్తు ఆడిటర్‌కు, జిల్లా పరిషత్ విషయంలో ప్రభుత్వానికి పంపాలి.
- జిల్లా పరిషత్ ప్రధాన లెక్కలో కలిపేందుకు గాను హెడ్ క్వార్టరులో ఉన్న జిల్లాపరిషత్ కార్యనిర్వాహక ఇంజనీర్లు జిల్లాలోగల ఇతర డివిజన్ల కార్యనిర్వాహక ఇంజనీర్ల కార్యలయంలోని రాబడులు, చెల్లింపులను కూడా కలుపుకొని నెలవారీ నగదు లెక్కల కరెంట్‌ను జిల్లా ముఖ్యకార్యనిర్వహణాధికారికి పంపాలి.
- రాబడి క్రింద లభించిన ఆదాయాన్ని, సిబ్బంది చేపట్టిన పనులపైన ఖర్చులు, ప్రతిపనిపై చేసిన ఖర్చు మిగిలిన మొత్తాన్ని, కాలక్రమేణా ప్రభుత్వం కోరిన సమాచారాన్ని మండలపరిషత్ / జిల్లా పరిషత్‌ల సాంవత్సరిక లెక్కల సంక్షిప్తిని ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలలో తయారు చేసి తదుపరి ఆర్థిక సంవత్సరపు రెండవ నెలలోని 15వ రోజులాగా జిల్లా పరిషత్‌కు / ప్రభుత్వానికి పంపాలి.
- ఆర్థిక సంవత్సరం ముగిసిన ఒకనెలలోగా, మండల పరిషత్ అధికారి / జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి నిర్దేశించిన నమూనాలలో ఆ సంవత్సరానికి మండల పరిషత్ జిల్లా పరిషత్‌కు సంబంధించిన సవివరమైన సాంవత్సరిక లెక్కలను తెలియజేసే సాంవత్సరిక లెక్కల సంక్షిప్తిని తయారు చేయించి సాధారణ సభ / జిల్లా పరిషత్‌ల ఆర్థిక స్థాయి కమిటీ ముందుంచాలి.
- తదుపరి ఆర్థిక సంవత్సరపు రెండవ నెలలోని 15వ రోజులోగా మండల పరిషత్ / జిల్లా పరిషత్ తన సంక్షిప్తిని, సవివరమైన లెక్కలను పరిగణించి తన తీర్మానంతోపాటు వాటి ప్రతిని జిల్లాపరిషత్‌కు / ప్రభుత్వానికి మరియు లోకల్ ఫండు ఆడిట్ డైరక్టర్‌కు పంపాలి.
- ప్రతి మండల పరిషత్ / జిల్లా పరిషత్, దాని స్థాయి కమిటీలు ఆ నెలలో అవిచ్చిన ఆర్థిక మంజూరు నకళ్ళను తరువాతి నెల 20వ తేదీలోగా ఆడిటర్లకు పంపాలి. మండల పరిషత్తు విషయంలో రిటర్న్‌లను జిల్లా పరిషత్తుకు పంపాలి.

- మండల పరిషత్తు సామూహిక అభివృద్ధి కార్యక్రమం క్రింద చేసిన ఖర్చుకు ప్రత్యేక అనుబంధ పనుల రిజిష్టరును కంటింజెంటు రిజిష్టరును నిర్వహించాలి.
- మండల పరిషత్తు / జిల్లా పరిషత్తు లెక్కలలోని ప్రతి మార్పుదలను అందుకోసం వుంచిన ట్రాన్స్‌ఫర్ ఎంట్రీ రిజిష్టర్‌లో ఎంట్రీ వేయాలి. రిజిష్టర్‌లో బదిలీ పద్దును వేయటానికి ముందు వీటిని మండల పరిషత్తు అభివృద్ధి అధికారి / ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆమోదించాలి.
- లెక్కల నమూనాల కొనుగోలు, వాటి సాధారణ నిర్వహణ మరియు వాటి స్టాకును సంబంధిత నమూనా పట్టికలో వివరించాలి.
- చట్టం ద్వారా లేదా దాని క్రింద జారీ చేసిన నియమాల ద్వారా సంక్రమించిన అధికారాల ననుసరించి ప్రభుత్వం నిర్ణయించిన లెక్కల నమూనాలనే తప్ప మిగిలిన వాటిని ప్రభుత్వ పూర్వ మంజూరు లేకుండా మండల పరిషత్తు / జిల్లా పరిషత్తు వినియోగించరాదు.
- ప్రభుత్వం కాలక్రమేణా నిర్ణయించిన విధంగా నమూనాల స్టాకు లెక్కలను సక్రమంగా నిర్వహించునట్లు మండల పరిషత్తు అభివృద్ధి / జిల్లా పరిషత్తు ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఏర్పాటు చేయాలి. ప్రతి ఆర్థిక సంవత్సరం పరిసమాప్తమైన వెంటనే మండల పరిషత్ అభివృద్ధి అధికారి / ముఖ్య కార్యనిర్వహణ అధికారి స్టాకు లెక్క యదార్థతను సరిచూడాలి.
- అన్ని లెక్కలను, రికార్డులను తెలుగులో నిర్వహించాలి.
- లెక్కలలోని అన్ని మార్పులను ఎర్రసిరాతో స్పష్టంగా వ్రాయాలి. వాటిని మండల పరిషత్తు అభివృద్ధి అధికారి / ముఖ్య కార్యనిర్వహణ అధికారి లేదా ఆయన అధికారమిచ్చిన బాధ్యత గల ఇతర అధికారి ధృవీకరించాలి. అదే విధంగా బిల్లులోని దిద్దుబాట్లను మార్పులను బిల్లులను డ్రా చేయు వ్యక్తి ధృవీకరించాలి.

స్థానిక సంస్థ ఆర్థిక లావాదేవీలు నిర్వహించేందుకు ప్రభుత్వం చొరవ, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల స్పందన, స్థానిక సంస్థలలోనున్న ఉద్యోగుల సహకారం అవసరం. ఇవేకాక ఈ క్రింది సూచనలు పరిగణనలోకి తీసుకుంటే స్థానిక సంస్థల ఆర్థిక పరిపుష్టి మెరుగుపడే అవకాశముంది.



## 1. పర్యవేక్షణకై టాస్క్‌ఫోర్స్

నేడు గ్రామ పంచాయతీల ఆర్థికపరమైన లావాదేవీలపై ప్రతి నెలా సమీక్షించే విధానం వుండాలి. వీటి కోసం మండల స్థాయిలో కలెక్టర్, పంచాయతీ విభాగం ఆధీనంలో ఒక టాస్క్‌ఫోర్స్ అవసరం. సదరు వ్యవస్థలో ఒక పంచాయితీ విస్తరణాధికారి (ప్రస్తుత విస్తరణాధికారి గ్రేడ్ 1) ఒక ఆడిటర్ మరియు ఒక సహాయక ఇంజినీరు వుండాలి. అలాగే జిల్లా స్థాయిలో జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఒక ఆడిట్ ఆఫీసర్, ఇంజనీరు, డివిజనల్ పంచాయతీ అధికార్లతో ఒక టాస్క్‌ఫోర్స్ కూడా ఏర్పాటు చేయాలి. రాష్ట్ర స్థాయిలో పంచాయతీరాజ్ కమీషనర్ కార్యాలయంలో ఒక జాయింట్ కమీషనర్ ఆధ్వర్యంలో ఇద్దరు సహాయక కమీషనర్లు, డిప్యూటీ డైరెక్టర్ కేడర్‌లో లోకల్ ఫండ్ మరియు ఖజానా శాఖకు సంబంధించిన అధికారులతో ఏర్పాటు చేయాలి. ఆ టాస్క్‌ఫోర్స్ వారు స్థానికసంస్థలలో జరిగే ఆర్థికపరమైన లావాదేవీలపై పూర్తి సమీక్ష జరిపి ప్రభుత్వం దృష్టికి మరియు స్థానిక ప్రజల దృష్టికి తీసుకురావాలి.

## 2. అవగాహనా సదస్సులు

స్థానిక సంస్థలు నిర్వహించే ఆర్థిక పరమైన విధులకు సంబంధించి సర్పంచ్, మండల పరిషత్ అధ్యక్షులు మరియు జిల్లా పరిషత్ అధ్యక్షులకు రాష్ట్ర స్థాయిలో కమీషనర్ (అపార్డ్) సంస్థతో నిపుణుల ద్వారా శిక్షణ కల్పించాలి. స్థానిక సంస్థలో పనిచేసే ఉద్యోగులకు పంచాయితీరాజ్ కమీషనర్ ఆధ్వర్యంలో ఆర్థిక పరమైన విధుల నిర్వహణకు సంబంధించి నిపుణుల ద్వారా సమగ్ర శిక్షణ కల్పించాలి. అందుకోసం పంచాయతీరాజ్ భవన్‌ను వినియోగించుకోవాలి.

## 3. కంప్యూటరైజేషన్

స్థానిక సంస్థలు నిర్వహించే ఆర్థిక పరమైన లావాదేవీలకు సంబంధించిన విషయాలను ఏ రోజుకారోజు కంప్యూటర్‌లో నమోదు చేసే విధానం వుండాలి. సదరు విషయాలను మండల పరిషత్ కార్యాలయాలకు, జిల్లా పరిషత్‌కు, జిల్లా పంచాయతీ అధికారులకు, పంచాయతీరాజ్ కమీషనర్ కార్యాలయానికి అనుసంధానం చేయాలి. అందుకవసరమైన కంప్యూటర్లను, ఆన్‌లైన్ సౌకర్యాన్ని ప్రతి గ్రామపంచాయతీకి కూడా కల్పించాలి.

73వ రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రభుత్వం స్థానిక సంస్థలకు రావలసిన నిధులు బదలాయించి సదరు సంస్థలు ఆర్థిక క్రమశిక్షణ పాటించే విధంగా చర్యలు తీసుకోవాలి. అందుకు పంచాయతీరాజ్ సంస్థలలో జరిగే ఆర్థిక పరమైన లావాదేవీలలో ఎటువంటి అవకతవకలకు అవకాశం జరగకుండా చేయటమే కాక, ప్రజలకు మరింత మేలైన సంక్షేమ కార్యకలాపాలు చేపట్టే అవకాశం వుంటుంది. అంతేకాక, స్థానిక సంస్థల పరిపాలనపై స్థానిక ప్రజలలో కూడా తమ సంస్థల పరిధిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులపై పూర్తి విశ్వాసం ఏర్పడుతుంది. పంచాయతీరాజ్ సంస్థలలో ఆర్థిక క్రమశిక్షణ పాటించటానికి ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వారి వంతు సహకారం అందిస్తారని ఆశిద్దాం.

**(ఆర్.డి.ఐ. సౌజన్యంతో)**

Printed & Published by: G.D. Priyadarshini, Director, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : G.D. Priyadarshini**